అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 26-09-2024

సంపుటి : 10 | సంచిక : 218 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



అలా అనొద్దు

మత, లింగ వివక్ష వ్యాఖ్యలు చేయొద్దు

న్యాయమూర్తులకు సుప్రీం సూచన




న్యూఢిల్లీ : భారత భూభాగంలోని ఏ ప్రాంతాన్నీ పాకిస్తాన్ అనలేమని, అలా అనడం రాజ్యాంగం ప్రకారం ప్రాథమికంగా తప్పని, ప్రాదేశిక సమగ్రతకు భంగకరమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మతోన్మాదం లేదా లింగ వివక్షను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని న్యాయమూర్తులకు సూచించింది. ఇటీవల కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి వి.శ్రీశానంద ఒక కేసు విచారణ సందర్భంగా బెంగళూరులో ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతాన్ని పాకిస్తాన్‌గా ప్రస్తావించడాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. పైగా ఆ కేసును వాదిస్తున్న మహిళా న్యాయవాదిని ...2లో

ఉపాధికి భద్రత

విద్యార్థుల నైపుణ్యశిక్షణ ప్రభుత్వం బాధ్యత

- త్వరలో మరో 35 వేల ఉద్యోగాలు
- వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్‌లో ఇంటర్న్‌షిప్
- కనీస ప్రమాణాల్లేని ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలు :సీఎం హెచ్చరిక



స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ స్కిల్స్ ప్రోగ్రాం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చటంతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని చెప్పారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాలు నేర్పించే గమ్యస్థానంగా హైదరాబాద్‌ను విశ్వ వేదికపై నిలబెట్టేం దుకు అందరి సహకారం కావాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో గత పదేండ్లలో నిరుద్యోగం పెరిగిందనీ, టీఎస్పీఎస్సీ వెబ్‌సైట్లోనే 30 లక్షల మంది నమోదు చేసుకున్నారని, రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులు వీధిన పడే పరిస్థితి ఉందని అన్నారు. ఈ సమస్య తీవ్రతను ప్రజా ప్రభుత్వం గుర్తించిందని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, తదితర ఉద్యోగాలన్నీ కలిపి మరో 35 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పారు. రాబోయే రెండూమూడు నెలల్లో మరో 35 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

బుధవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ జేఎన్టీయూ ఆడిటోరియంలో రాష్ట్రంలోని 38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న యువతను తయారు చేసి ఉపాధికి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే బీఎఫ్ఎస్ఐ ప్రతినిధులతో చర్చించామనీ, వారు ఇచ్చిన ప్రతిపాదనలతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో డిగ్రీలో చేరిన పది వేల మంది డిగ్రీ విద్యార్థులు తమ పట్టా పొందే నాటికి నైపుణ్యాన్ని నేర్చుకునేలా ఈ ప్రోగ్రాం రూపకల్పన చేసినట్టు చెప్పారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉద్యోగాలకు ఢోకా ఉండదని తెలిపారు. అవసరమైన నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎక్విప్ సంస్థను, ఈ కోర్సు సిలబస్‌ను రూపొందించిన బీఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ...11లో

దసరాకు ఇందిరమ్మ కమిటీలు

విధివిధానాలు రూపొందించండి

పీఎంఏవై నుంచి గరిష్టంగా ఇండ్లు సాధించాలి

రాజీవ్ స్వగృహ ఇండ్లకు వేలం

సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



వివరాలు 11లో..



మూసీ సుందరీకరణతో

వేల కోట్ల కుంభకోణం

పాకిస్తాన్ కంపెనీకి అప్పగించాలని సర్కార్ యత్నం

పేదలకు ఆశ్రయం కల్పించిన తరువాతే ఇండ్లు కూల్చాలి

'హైడ్రా'మాలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఫతేనగర్‌లో ఎస్టీపీ పరిశీలన

నవతెలంగాణ - కూకట్‌పల్లి/బాలానగర్

మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మూసీ సుందరీకరణను సీఎం రేవంత్ రెడ్డి ఓ పాకిస్తాన్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆహ్వానం మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి ఫతేనగర్ ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పరిశీలించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రేటర్ ...2లో

మంత్రుల అరాచకాలు

ఎండగడదాం

వారి అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా పర్యటనలు : కేటీఆర్

వివరాలు 2లో..

అటవీ జంతువుల నుంచి జీవనోపాధిని రక్షించాలి

ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌ల పేరుతో తొలగింపులు ఆపాలి

పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తేయాలి : ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ ధర్నా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అటవీ జంతువులు, విచ్చలవిడి జంతువులు పంటలు నాశనం చేయడం నుంచి జీవనోపాధిని రక్షించాలని, ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌ల తొలగింపును వన్యప్రాణుల సంరక్షణ పేరుతో ఆపాలని, పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తివేయాలని ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ నినదించింది. మానవ వన్యప్రాణులు, విచ్చలవిడి జంతువుల బెడదపై అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో బుధవారం నాడిక్కడ పార్లమెంట్ స్ట్రీట్ వద్ద ధర్నా జరిగింది. ఈ ఆందోళనలో కేరళ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్, తెలంగాణ, యూపీ, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది రైతులు పాల్గొన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ధర్నాను ప్రారంభించగా, ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే, ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి. శివదాసన్, ఏఐకేఎస్ తమిళనాడు ఉపాధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు ఆర్ సచ్చితానందం ప్రధాన వక్తలుగా మాట్లాడారు. ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా, ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి పి. కృష్ణప్రసాద్, కేరళ కర్షక సంఘం కార్యదర్శి, ఏఐకేఎస్ సంయుక్త కార్యదర్శి వల్సన్ పనోలి, వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు ఈ ధర్నాలో ప్రసంగించారు.

డిమాండ్లు

1. భారతీయ అటవీ చట్టం-1927, వన్యప్రాణుల రక్షణ చట్టం-1972, అటవీ సంరక్షణ చట్టం-1980ను వన్యప్రాణుల దాడి నుంచి మానవ ప్రాణం, ఆస్తులు, జీవనోపాధికి రక్షణ కల్పించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణ కోసం సవరించాలి. జీవనోపాధిని రక్షించడానికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి.
2. క్రిములు, స్టెరిలైజేషన్, వైల్డ్ జంతువుల బెదిరింపులను ...2లో

పెన్షనర్లకు వైద్య సౌకర్యాలు కుదించొద్దు

టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి డిమాండ్

హైదరాబాద్‌లో కేంద్రీయ సదన్ వద్ద ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడనాడాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) డిమాండ్ చేసింది. వైద్య సౌకర్యాలను కుదించొద్దని కోరింది. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్సీసీపీఏ) పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని కోఠి మహిళా విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న కేంద్రీయ సదన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదో పే రివిజన్ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య సౌకర్యాల్లో కోత విధించడం సరైంది కాదన్నారు. ఈ విధానాలను కేంద్రం మానుకోవాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం అమలు చేసే ఆరోగ్య పథకాలను మెరుగు పర్చాలని డిమాండ్ చేశారు. టీఏపీఆర్‌పీఏ సీనియర్ నాయకులు ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిపై ప్రయివేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీజీహెచ్ఎస్‌కు ఉద్యోగులు ప్రతి నెలా తమ జీతంలో చందా చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. రిటైరైన తర్వాత కూడా 120 నెలల సబ్‌స్క్రిప్షన్ చెల్లించారని వివరించారు. కానీ ఇప్పుడు ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేసి వైద్య సౌకర్యాలను కుదించాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ అధికారుల సంఘం (సీసీజీజీఓఓ) జాతీయ చైర్మెన్ వి కృష్ణ మోహన్ డిమాండ్ చేశారు. ఏఐఆర్ఆర్ఎఫ్ ...10లో


అడ్డగోలు పెట్రో దోపిడీ



70 డాలర్లకు తగ్గిన ముడి చమురు

అయినా భారత్‌లో హెచ్చు ధరలు కొనసాగింపు

- ప్రజలపై రూ.2 లక్షల కోట్ల భారం
- మరోవైపు ఎక్సైజ్ సుంకం పెంపు



న్యూఢిల్లీ : అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంటున్నప్పటికీ.. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం నింగిలోనే ఉన్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 92 డాలర్లుగా ఉండగా.. తాజాగా 70 డాలర్ల దిగువకు పడిపోయింది. సెప్టెంబర్ 9న ఏకంగా 69 డాలర్లుగా పలికింది. ఆరు నెలల్లో దాదాపుగా 20 శాతం ధరలు దిగివచ్చాయి. 2021 డిసెంబర్ నాటి కనిష్ట స్థాయిలో చమురు ధరలు పలుకుతున్నాయి. అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను హెచ్చు స్థాయిలోనే కొనసాగిస్తూ.. ప్రజల జేబులకు చిల్లులుపెడుతోంది. ముడి చమురుపై కేవలం 10 డాలర్లు తగ్గితే ఏడాదికి రూ.1.08 లక్షల కోట్లు ఆదా అవుతోంది. ఇటీవల దాదాపు 20 డాలర్లు పైన తగ్గడంతో మోడీ సర్కార్ ఖజానాకు ఏడాదికి రూ.2 లక్షల కోట్లు పైనే సమకూరనుంది. అంటే ఆ మొత్తాన్ని ప్రజలపై అదనంగా భారం మోపుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలపై దేశ వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోన్న నేపథ్యంలో ఇటీవలి సార్వత్రిక ఎన్నికలకు రెండేండ్ల ముందు నుంచే ధరలను సవరించడం ఆపేసింది. పెంచిన ధరలను కొనసాగిస్తోంది. చివరి సారిగా 2022 ఏప్రిల్‌లో లీటర్ పెట్రోల్, డీజిల్ మీద నామమాత్రంగా రూ.2 ధర తగ్గించింది. ప్రస్తుతం ...11లో

హైడ్రాలో 169 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి

డిప్యుటేషన్ పద్ధతిలో నియామకాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 'హైడ్రా' సంస్థకు 169 పోసుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టులన్నింటినీ డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేస్తారు. ఆయా పోస్టులను ...2లో

చెక్కుచెదరని బంధం

పాలస్తీనా రాయబారిని ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో సత్కరించిన క్యూబా



హవానా: క్యూబా, పాలస్తీనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం గావించడంలో విశేష కృషి చేసిన పాలస్తీనా రాయబారి అక్రమ్ మహ్మద్ సమాన్‌ను ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో క్యూబా విదేశాంగ శాఖ ఉప మంత్రి జోసెఫినా విడాల్ ఫెరీరో సత్కరించారు. సోదర దేశ రాయబారి పదవీ కాలం త్వరలో ముగియనున్న సందర్భంగా క్యూబా అధ్యక్షుని తరఫున ఆయనకు ఈ మెడల్‌ను ఫెరీరో ప్రదానం చేశారు. పాలస్తీనా సమస్యకు పరిష్కారం ...2లో

పని గంటలు పెంచితే ప్రమాదమే

పనితీరు మందగిస్తుంది

ఉద్యోగుల ఆరోగ్యం పైనా ప్రభావం

పని-జీవితం మధ్య సమతూకం అవసరం

పరిశోధకుల మనోగతం

దేశ పురోభివృద్ధి కోసం యువత వారంలో 70 గంటల పాటు పనిచేయాలని గత సంవత్సరం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సలహా ఇచ్చారు. అమెరికాలో టెస్లా వ్యవస్థాపకుడు ఎలన్ మస్క్ ఓ అడుగు ముందుకు వేసి విజయాన్ని అందుకోవాలంటే వారానికి వంద పని గంటలు ఉండాలని సూచించారు. అయితే దీర్ఘకాల పని గంటలు సత్ఫలితాలను ఇవ్వకపోగా ప్రతికూల పరిణామాలకు దారితీస్తాయి. ఉద్యోగుల సామర్థ్యం దీర్ఘకాలం కొనసాగాలంటే ఆరోగ్యకరమైన పని-జీవితం సమతూకంగా ఉండాలని పరిశోధనలు చెబుతున్నాయి.





న్యూఢిల్లీ : పని ప్రదేశంలో ఎక్కువ గంటలు గడపడం ఉద్యోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది కూడా. 26 సంవత్సరాల అన్నా సెబస్టియన్ పెరయిల్ అనే అకౌంటెంట్ మరణం ఉద్యోగుల పని ఒత్తిడికి, మానసిక ఆందోళనకు అద్దం పడుతోంది. ఆమె నాలుగు నెలల క్రితమే ఓ సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఆ సంస్థ ఇండియా విభాగం చైర్మన్‌కు పెరయిల్ తల్లి ఓ లేఖ రాస్తూ తన కుమార్తెకు పనిభారం అధికమైందని, తనకు విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి నిద్ర, ఆహారం కూడా మానేసిందని ఆరోపించారు.

మనుగడ కోసం...

పనిని, జీవితాన్ని సమతూకం చేసుకునే ఉద్యోగులు విధి నిర్వహణలో పెద్దగా ఇబ్బందులు పడరు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ సమర్థతతో ముందుకు సాగుతారు. పని, జీవితం...వీటిని బ్యాలెన్స్ చేసుకుంటే జీవన నాణ్యత మెరుగుపడుతుంది. అటు ఉద్యోగంలోనూ మంచి పనితీరు కనపడుతుంది. వాస్తవానికి మన దేశంలో ...11లో

పని ఒత్తిడితో కుర్చీలోనే కుప్పకూలిన మహిళా ఉద్యోగి

2లో.. లక్నోలో ప్రయివేట్ బ్యాంకులో విషాదం



చెక్కుచెదరని బంధం

(మొదటిపేజీ తరువాయి)

కుదిరేంతవరకు ఆ దేశానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫెరీలో పునరుద్ఘాటించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల సందర్భంగా అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం న్యూయార్క్‌లో జరిగింది. ఈ సమావేశంలో క్యూబా విదేశాంగ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు బ్రూనో రొడ్రిగజ్ పెరీరా మాట్లాడుతూ, పాలస్తీనాను ఐరాసలో పూర్తి స్థాయి సభ్యురాలిగా ముందస్తుగా చేర్చుకోవడాన్ని స్వాగతించారు. . పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణ హోమాన్ని అంతమొందించేందుకు నిజాయితీతో జరిగే చట్టబద్ధమైన అంతర్జాతీయ యత్నాలకు తాము సహకరిస్తామన్నారు. గాజాపైన, లెబనాన్‌పైన పెద్దయెత్తున బాంబు దాడులకు తెగబడుతున్న ఇజ్రాయిల్ గత పన్నెండు మాసాల్లో 40వేల మంది ప్రాణాలు తోడేసింది. పెద్దయెత్తున ఇళ్ళు, ఆస్పత్రులు, ఇతర పౌర సదుపాయాలు ధ్వంసమయ్యాయి. గాజాలో 19 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పాలస్తీనా ప్రజలకు మానవతా సాయం అందకుండా అడ్డుపడుతున్న ఇజ్రాయిల్ చర్యలను ఆయన ఖండించారు. ఇజ్రాయిల్-పాలస్తీనా సంఘర్షణకు రెండు దేశాల ఏర్పాటే సరైన పరిష్కారమని, ఆ దిశగా దీనికి పరిష్కారం చూపేందుకు అలీనోద్యమం ఒత్తిడి పెంచాలని ఆయన కోరారు. 1967కు మందున్న సరిహద్దుల ఆధారంగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె)లో సౌతాఫ్రికా వేసిన పిటిషన్‌కు మద్దతుగా ఇంప్లీడ్ అవుతున్న దేశాల్లో క్యూబా మూడవది.

పని ఒత్తిడితో కుర్చీలోనే కుప్పకూలిన మహిళా ఉద్యోగి..!

లక్నో : పని ఒత్తిడితో కుర్చీలోనే ఓ బ్యాంకు మహిళా ఉద్యోగిని కుప్పకూలిపోయిన ఘటన యూపీలోని లక్నోలో జరిగింది. గోమతినగర్‌లోని ఓ ప్రయివేట్ బ్యాంకులో అదనపు డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సదాఫ్ ఫాతిమా రోజులాగానే ... ఆఫీసుకు వచ్చారు. విధులు నిర్వహిస్తుండగా ఉన్నట్టుండి కుర్చీలోనే కుప్పకూలారు. తోటి ఉద్యోగులు వెంటనే ఆమెను ఆస్పతికి తీసుకెళ్లినప్పటికీ, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే.. అడిషనల్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఫాతిమాకు ఇటీవల ప్రమోషన్ వచ్చిందని.. అప్పటి నుంచి ఆమె తీవ్రమైన పని ఒత్తిడికి గురైందని తన తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఈ ఘటనపై సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఎక్స్ ద్వారా స్పందించారు. ప్రయివేట్, ప్రభుత్వ సంస్థలు ఎకానమీ టార్గెట్‌లను సీరియస్‌గా తీసుకుంటున్నాయని, అది ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడికి దారితీస్తున్నాయని ఆరోపించారు.. ఇది ముమ్మాటికీ ఆందోళన కలిగించే అంశంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి అడ్డుకట్ట పడాలంటే.. పని ప్రదేశాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు.

మూసీ సుందరీకరణతో
వేల కోట్ల కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌ను మురుగునీటి రహిత నగరంగా మార్చే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ట్రయల్ రన్ దశలో ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎస్టీపీల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎస్టీపీల సందర్శనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని.. ఉప్పల్ నల్లచెరువు, ఎల్‌బీనగర్, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్ ఎస్టీపీలను కూడా త్వరలోనే సందర్శిస్తామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదన్నారు. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అసలు ఉద్దేశం వేరే ఉందనే అనుమానం ప్రజల్లో ఏర్పడిందన్నారు.

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇంటి తాళాలు అప్పగించాకే.. వారి ఇండ్లను కూల్చాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే కూల్చివేతలను అడ్డుకుంటామని హెచ్చరించారు. మూసీని శుద్ధి చేయాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ఎస్టీపీలను వినియోగించుకుంటే సరిపోతుందని అన్నారు. హైడ్రా కూల్చివేతలపై పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయమా అని అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మంత్రుల, నేతల ఇండ్లు కూల్చిన తరువాత పేదల ఇండ్లు కూల్చాలన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామాలు ఆపేసి హైదరాబాద్ ఇమేజ్‌ను కాపాడాలని సూచించారు. బీఆర్ఎస్ నగర ఎమ్మెల్యేలతో చర్చించి హైడ్రాపై ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు. రేవంత్ సర్కార్ కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తోందని, కోర్టు సెలవు దినాలైన ఆదివారం తెల్లవారుజామున కూల్చివేతలు చేయడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ న్యాయ విభాగం అండగా ఉంటుందన్నారు. బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బాధితులు సంప్రదించాలని.. లేదా స్థానిక కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలను సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ హయాంలో మొహరం, వినాయక చవితి, సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్లు ఏవి జరిగినా కట్టుదిట్టమైన భద్రత కల్పించి ఎలాంటి గొడవలూ జరగకుండా చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను కూడా సమర్థవంతంగా నిర్వహించలేకపోయిందని విమర్శించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కెవి.వివేకానంద, కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లాలో కానిస్టేబుల్ మిస్సింగ్

- నాలుగు పోలీసు బృందాల గాలింపు

నవతెలంగాణ-వనపర్తి



వనపర్తి జిల్లాలో కానిస్టేబుల్ రామకృష్ణ మిస్సింగ్ కలకలం రేపింది. పానగల్ పీఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ గత రాత్రి నుంచి కనిపించకుండా పోయాడని అతని భార్య ఫిర్యాదు చేశారని జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీరామదాసు తేజావత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పానగల్ పోలీస్‌స్టేషన్ నుంచి రామకృష్ణ ఎస్కార్ట్ పీసీగా చివరి సారిగా విధులు నిర్వహించినట్టు తెలిపారు. ఆ తర్వాత ఆయన జాడ లేకపోవడంతో.. అతని భార్య మంజు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో విధులు నిర్వహించలేక పోతున్నానని భార్యకు మెసేజ్ చేసినట్టు తెలిపారు. రామకృష్ణ ఎక్కడికి వెళ్లాడన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. మంజుల ఫిర్యాదుతో మ్యాన్ మిస్సింగ్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి రామకృష్ణ ఆచూకీ కోసం పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి వెతుకుతున్నారని పేర్కొన్నారు.

మావోయిస్టుల మెరుపు దాడి

- పూసుగుప్ప బేస్ క్యాంపుపై గంట పాటు కవ్వింపు చర్య

నవతెలంగాణ-చర్ల

మావోయిస్టు విలీన ఉత్సవాల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప సమీప సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. బుధవారం సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 7:30 వరకు సుమారు 15 రౌండ్ల కాల్పులు జరిపినట్టు విశ్వసనీయ సమాచారం. సరిహద్దుల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ రాంపురం వైపు నుంచి మావోయిస్టులు బేస్ క్యాంప్‌పై ఎటాక్ చేసినట్టు తెలిసింది. ఫైరింగ్ చేయడంతో పాటు మందు పాత్రలు పేల్చి ఆ ప్రాంతమంతా హల్చల్ చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్న తరుణంలో పూసుగుప్ప క్యాంపుపై జరిగిన మెరుపు దాడి మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

నాలుగు రోజుల్లో కులగణనకు మార్గదర్శకాలు

వారం, పది రోజుల్లో ప్రక్రియను ప్రారంభిస్తాం

- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తాం
- బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలి : బీసీ సంఘాల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ, కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీసీలు ఎలాంటి సందేహాలకు లోనుకావొద్దని చెప్పారు. కులగణనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఒప్పుకున్నారని వివరించారు. నాలుగు రోజుల్లో కులగణన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. వారం, పది రోజుల్లో ఆ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభమవుతుందని చెప్పారు. బీసీ సంఘాల విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనను చేపట్టి స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతామంటూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించామన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు కులగణనను నిర్వహించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. అందుకోసమే బీసీ కమిషన్‌ను నియమించామని గుర్తు చేశారు. కులగణన కోసం బీసీ సంఘాలు చేసే పోరాటంలో తప్పులేదనీ, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 50 శాతానికి తగ్గించి బీసీలను రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీ గొంతు కోసిందని విమర్శించారు. ఇప్పుడు కులగణన అంటూ కొత్త పల్లవి అందుకుందనీ, బీఆర్ఎస్ పరిస్థితి చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు.

గత పదేండ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు కులగణన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఆ పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అది కేవలం కుటుంబ పార్టీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధాని మోడీ ఉన్నప్పటికీ ఒరిగిందేమీ లేదని అన్నారు. బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తేయాలని కోరారు. కులగణన చేసే హక్కును రాష్ట్రాలకు కల్పించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను పెంచుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించాలని చెప్పారు. కులగణన కాంగ్రెస్ పేటెంట్ అని అది నిర్వహించిన తర్వాత బీసీలు సంఘటితంగా ఏర్పడి నిజాం కాలేజ్ మైదానంలో లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించి సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే బీసీ సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించి సంఘాలు, మేధావుల సలహాలు, సూచనలను తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే కులగణనను నిర్వహించి బీసీ రిజర్వేషన్లు పెంచాలనీ, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన చేసి పార్లమెంట్‌లో విపక్షాలకు రాహుల్ గాంధీని విమర్శించే అవకాశాన్ని ఇవ్వొద్దని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి, బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగాని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ, ప్రొఫెసర్ బాగయ్య, వివిధ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వేముల వెంకటేష్, శేఖర్ ఉప్పర, కొండ దేవన్న, బాలకృష్ణ నాయి, శంకర్ రజక, బి మనీ మంజరి, తాటికొండ విక్రమ్ గౌడ్, అయిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారుల కృషి వల్లే పండుగలు విజయవంతం

- వైద్య, విద్యారంగాలకు ప్రాధాన్యత : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అధికారులకు సత్కారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో బోనాలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పండుగలను అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా కష్టపడి పని చేయడంతో విజయవంతం అయ్యాయని రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని తెలిపారు. బుధవారం నగరంలోని గోల్కొండ హోటల్‌లో బోనాలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ సక్సెస్ మీట్-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పండుగలకు అధికారులు కష్టపడి విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని అభినందించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతమూ కలగకుండా పోలీస్ సిబ్బంది కృషి చేసిందన్నారు. భవిష్యత్‌లో ఇలాగే అందరూ సమిష్టి బాధ్యతగా భావించి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు.. ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు నష్టం జరగకుండా పునరావాసం, ఉపాధి కల్పిస్తామని చెప్పారు. అనంతరం అధికారులకు శాలువా కప్పి మెమోంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ ఏసీపీ విశ్వ ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైడ్రాలో 169 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

బట్టి వేతనాలనూ ఖరారు చేసారు. ఐఏఎస్ కేడర్‌ను కమిషనర్ పోస్టుగా, మరో ఎస్పీ ర్యాంక్ కేడర్ పోస్టు అధికారిని అడిషనల్ కమిషనర్‌గా నియమించుకొనేందుకు ఆర్థికశాఖ అనుమతించింది. వీరితో పాటు మరో మూడు ఎస్పీ ర్యాంక్ అధికారుల పోస్టులు, 5 డీఎస్పీ పోస్టులు, 16 మంది ఇన్స్‌పెక్టర్లు, 16 మంది సబ్ ఇన్స్‌పెక్టర్లు, 3 రిజర్వు ఇన్స్‌పెక్టర్ పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. వారితోపాటు 60 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఒక అసిస్టెంట్ అనలిటికల్ ఆఫీసర్, ఒక రీజినల్ ఫైర్ ఆఫీసర్, మూడు సిటీ ప్లానర్, 12 అడిషనల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, ఎమ్మార్వో, సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్ వంటి మొత్తం 169 పోస్టులకు భర్తీకి అనుమతి లభించింది.

అటవీ జంతువుల నుంచి జీవనోపాధిని రక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

నియంత్రించడానికి శాస్త్రీయంగా చంపడం సహా ఇతర చర్యలను ప్రకటించే రాష్ట్రాల హక్కులకు హామీ ఉందని నిర్ధారించాలి. షెడ్యూల్ జంతువుల జాబితా నుంచి అడవి పందిని తొలగించాలి.

3. ఏకపక్ష ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌లు, వన్యప్రాణుల అభయారణ్యాలు, బలవంతపు తొలగింపులను ఆపాలి.

4. అటవీ హక్కులు, కమ్యూనిటీ అటవీ హక్కులను నిర్ధారించాలి. ఎఫ్ఆర్ఎ, పీఈఎస్ఎ ఉల్లంఘనను ఆపాలి. అటవీ ప్రాంత ప్రజలకు విద్యుత్తు అందేలా చూడాలి.

5. పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తివేయాలి. ఉత్పత్తి లేని పశువులను మార్కెట్ ధరలకు కొనుగోలు చేయాలి. ఆవు విజిలెంట్ గ్రూపులపై బలమైన నిరోధక చర్యలను నిర్ధారించాలి.

6. వన్యప్రాణుల వల్ల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, అలాగే తీవ్ర గాయాలపాలైన వారికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి.

7. పంచాయతీలు, గ్రామసభల ద్వారా పంట నష్టాలను సరిగ్గా అంచనా వేసి తగిన పరిహారం అందించాలి.

8. కృత్రిమ వాణిజ్య కలప చెట్లను, ఆక్రమణ జాతులను దశలవారీగా క్లియర్ చేయాలి. అటవీ ప్రాంతాల్లో పండ్ల చెట్లను, వెదురును ప్రోత్సహించాలి.

9. హాట్ బెడ్‌లలో కందకాలు, వైర్-మెష్, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థను నిర్మించాలి.

10. ఉపాధి కింద సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు కమ్యూనిటీ వాచ్‌ను రోజుకు రూ. 1,000కి ఏర్పాటు చేయాలి.

మంత్రుల అరాచకాలు ఎండగడదాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మంత్రుల అరాచకాలను ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. అధికార అహంకారంతో ఈ జిల్లా మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. వారి అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో హైదరాబాద్‌లోని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ చేపట్టనున్న అంశాలు, కార్యక్రమాలను నేతలకు కేటీఆర్ వివరించారు. జిల్లాలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో మళ్లీ ఫ్లోరోసిస్ భూతం తెరపైకి వస్తోందని కేటీఆర్‌కు జిల్లా పార్టీ నేతలు వివరించారు. అదే విధంగా కాంగ్రెస్ నేతల అరాచకాలకు, అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏ విధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారో నియోజక వర్గాల వారీగా కేటీఆర్‌కు వివరించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్ని అంశాల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో వారిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

రాష్ట్ర రాజకీయాలతో పాటు నల్లగొండ జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాలపై కూడా మరింత చురుగ్గా ప్రజాక్షేత్రంలోకి వెళ్దామని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో లేవనెత్తాల్సిన సమస్యలను స్థానిక జిల్లా నేతలకు కేటీఆర్ వివరించారు. కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డితో పాటు నల్లగొండ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మరుపల్లిలో బీఆర్ఎస్ దళిత కార్యకర్తలపై పోలీసుల దాడి : కేటీఆర్ ఆగ్రహం

వికారాబాద్ నియోజకవర్గంలోని మరుపల్లిలో పార్టీ కార్యకర్తలైన నవీన్, ప్రవీణ్ అనే ఇద్దరు దళితులపై స్థానిక ఎస్సై, పోలీసులు దాడి చేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేస్తూ అక్రమ కేసులతో అక్రమంగా వ్యవహరిస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. దాడికి గురైన బాధితులు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పోలీసుల చేతిలో దాడికి గురైన బాధితులకు ఈ సందర్భంగా కేటీఆర్ ధైర్యం చెప్పారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే తాను కూడా వికారాబాద్‌కు వచ్చి ఆందోళన చేస్తానని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జరిగే ఇలాంటి చిల్లర దాడులతో ధైర్యం కోల్పోవద్దని కార్యకర్తలకు సూచించారు. బాధితులకు పూర్తిగా న్యాయసాయం పార్టీ లీగల్ సెల్ ద్వారా అందిస్తామన్నారు.

స్పీకర్ స్పందించాలి

అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో దళితులను పోలీసులు హింసిస్తున్నా ఆయన పట్టించుకోవడం లేదని కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా ఆయన ఈ దాడులను ఖండించాలని కోరారు. దాడికి పాల్పడిన ఎస్సై విషయంలో చర్యలు తీసుకోవాలని స్పీకర్‌తో, డీజీపీతో మాట్లాడుతానని కేటీఆర్ చెప్పారు.

ఓటమి మన మంచికే

ఓటమి కూడా మన మంచికే అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనేక హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాలను ప్రజలు గ్రహిస్తూ మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన హన్మకొండ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 14 ఏండ్లు ఉద్యమపార్టీగా అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఢిల్లీని ఒప్పించి తెలంగాణ సాకారం చేసుకున్నామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ చేసిన పనులను చెప్పుకోలేకపోయిందనీ, కాంగ్రెస్ చేయని పనులను కూడా చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నదని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం, అత్తకు రూ.4 వేలు, కోడలుకు రూ.2,500 తదితర హామీలను కేటీఆర్ గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవా లని ఆదేశించడంతో ఫిరాయించిన వారిలో భయం మొదలైందని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలిపారు. రాజయ్యే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు బీజేపీ రక్షణ కవచంలా ఉంటూ కాపాడుతున్నదని కేటీఆర్ విమర్శించారు.

రైతుల గోస చూడు : కేటీఆర్

ఎత్తు కుర్చీల్లో కూర్చోవడం కాదు-కన్నెత్తి రైతుల గోస చూడు ముఖ్యమంత్రి అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. మాఫీ కానీ రుణమాఫీ- పత్తా లేని పాల బిల్లులు-వేస్తావన్న భరోసా లేని రైతు భరోసా - బోనస్ పేరుతొ బోగస్ మాటలు, ఒకటా రెండా అన్నింట్లో రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ విమర్శించారు. రైతు రోడ్డెక్కితే జంకిన మీరు 150 కోట్ల రూపాయల పాల బిల్లుల బకాయిలకు 50 కోట్ల రూపాయలు విడుదల ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పుణ్యమా అని ఈ దసరా రైతులకు మునపటి దసరాలా ఉండేలా లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

గురుకులాల సమస్యలను
సత్వరమే పరిష్కరించాలి

- సొంత భవనాలను నిర్మించాలి
- మెనూచార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలి
- జేఏసీ ఆందోళనను విరమింపజేసేందుకు చర్యలు తీసుకోండి : సీఎస్ శాంతికుమారికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఐదు రకాల గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమింపజేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారికి బుధవారం ఆయన లేఖ రాశారు. గురుకులాల సమస్యలపై ఈనెల 18 నుంచి 23 వరకు దశలవారీగా ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల కింద ఉన్న ఐదు రకాల సొసైటీల పరిధిలోని 1,022 గురుకులాల్లో సుమారు 700 గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. వసతి సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలనీ, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పనివేళలను సవరించాలని తెలిపారు. ఉపాధ్యాయులు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారనీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. గురుకులాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన

- పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈనెల 27న చేపట్టిన విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకుపోతున్నాయని అన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,225 కోట్లు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడూతుతున్నారని చెప్పారు. అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నా రన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. యూనివర్సిటీ లకు రెగ్యులర్ వైస్ ఛాన్స్‌లర్స్‌ను నియమించాలన్నారు. 27న ఇందిరాపార్క్ వద్ద జరిగే విద్యార్థి మహాగర్జనకు విద్యార్థులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు స్టాలిన్ శ్రీమాన్, జిల్లా సహాయ కార్యదర్శి నాగేందర్, ప్రశాంత్, లక్ష్మణ్, నాయకులు నికిత, భగత్, భారత్, పవన్, వరుణ్, కైలాష్, ప్రణవ్ యాదవ్ పాల్గొన్నారు.

అలా అనొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశించి కూడా సదరు న్యాయమూర్తి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.

వాదిస్తున్న కేసుకు సంబంధం లేని రీతిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి వుండాలని న్యాయమూర్తులకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి అనవసర వ్యాఖ్యలు చేయడం వల్ల ఆ న్యాయమూర్తులపై వ్యతిరేక అభిప్రాయాలు ఏర్పడడమే కాకుండా మొత్తంగా న్యాయ వ్యవస్థపైనే ప్రతికూల ప్రభావం పడుతుందని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. న్యాయమూర్తులు, లాయర్లు, కక్షిదారులు, ముఖ్యంగా పిటిషనర్లు అందరూ కూడా తమ భాష, వ్యవహార శైలిలో సంయమనం పాటించాల్సిన అవసరం వుందన్నారు. కోర్టులో వున్నవారే కాదని, బయటవున్న లక్షలాదిమంది జనం కూడా తమను చూస్తారని వారు గ్రహించుకోవాలన్నారు.

సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న మరునాడే ఈ నెల 21నే బహిరంగ న్యాయస్థానంలో జస్టిస్ శ్రీశానంద క్షమాపణ చెప్పారు. దాంతో ఇక ఈ విషయాన్ని ఇంతటితో మూసివేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు 30 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్-ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులకు వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము బాన్సువాడ, కామారెడ్డి జిల్లా

నెం. యం.సి.బి/ఈ1/39/2023-24. తేది : 25.09.2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

పురపాలక సంఘం బాన్సువాడ కమిషనర్ గారిచే ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫాం ద్వారా ఆన్‌లైన్ టెండర్ పిలవడం జరిగింది. 1. మొత్తం పనులు: (06), 2. పని వివరములు: బాన్సువాడ మునిసిపల్ పరిధిలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 22.10 లక్షలు, 3. బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేది మరియు సమయం : 26-09-2024 ఉ॥ 11.00 గంటలకు, 4. బిడ్ డౌన్ లోడ్ ముగింపు తేది మరియు సమయం: 05-10-2024 సా॥ 4.00 గంటలకు. ఇతర వివరముల కొరకు https://tender.eprocurment.gov.in చూడగలరు మరియు కార్యాలయ పని వేళల యందు ఫోన్ నం.6305996373 నకు సంప్రదించగలరు.

సం/- కమిషనర్, పురపాలక సంఘం బాన్సువాడ

DIPR R.O.No.4557-PP/CL/ADVT/1/2024-25, Dt:25.09.2024

ఫారం నెం.యుఆర్‌సి-2

చట్టం యొక్క చాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నోటీసు ఇవ్వవలసిన ప్రకటన (కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి), కంపెనీల (రిజిస్టర్ చేయుటకు అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014 లోని రూల్ 4(1)నకు అనుగుణంగా)

1. [illegible] మాడెన్ మెడికల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ [illegible] కంపెనీల చట్టం, 2013లోని చాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద ఒక లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ [illegible] మాడెన్ మెడికల్ కేర్ ఎల్‌ఎల్‌పి [illegible] కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366 యొక్క సబ్-సెక్షన్ (2)నకు అనుగుణంగా తెలియజేస్తున్నాం.

2. కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు దిగువ విధంగా కలవు :

[illegible]

3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క ప్రతిని ఆఫీసు: ఇ.నెం. 7-1-211/38, ఫ్లాట్ నెం.90, శివబాగ్, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ -500016 వద్ద పరిశీలించుకోవచ్చును.

4) [illegible] ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్(ఐఐసిఏ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్-5, ఐఎంటి మనేసర్, జిల్లా గుర్గావ్(హర్యానా)-122050 [illegible] ఇ.నెం. 7-1-211/38, ఫ్లాట్ నెం.90, శివబాగ్, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ -500016 వద్ద ఒక కాపీతో వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను.

26, సెప్టెంబర్, 2024
మాడెన్ మెడికల్ కేర్ ఎల్‌ఎల్‌పి కొరకు,
సం./- [illegible] పటేల్,
డిజిగ్నేటెడ్ పార్ట్‌నర్,
డిపిఐఎన్ : 06456634.

తేది : 26-09-2024
ప్రదేశం : హైదరాబాద్.



ఆ అధ్యయన పత్రం వెనక్కి..

కోవాగ్జిన్ భద్రతపై వ్యాసాన్ని ప్రచురించిన జర్నల్

నిర్థారణలను విశ్వసించలేమంటూ ఉపసంహరణ

ప్రముఖుల అభ్యంతరం

న్యూఢిల్లీ : కోవిడ్ మహమ్మారి నుండి ప్రజలను రక్షించేందుకు ఉపయోగించిన కోవాగ్జిన్ సురక్షితమైనదా కాదా అనే విషయంపై రూపొందించిన ఓ అధ్యయన పత్రం 'డ్రగ్ సేఫ్టీ' అనే జర్నల్‌లో ప్రచురితమైంది. అయితే ఈ పత్రాన్ని మంగళవారం ఆ జర్నల్ ఉపసంహరించుకుంది. ఆ వ్యాసంలో పొందుపరచిన నిర్థారణలు విశ్వసించదగినవిగా లేవని, అందుకే దానిని వెనక్కి తీసుకుంటున్నామని వివరణ ఇచ్చింది. కోవాగ్జిన్ తీసుకున్న వారిలో మూడో వంతు మందికి పైగా ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారని ఈ అధ్యయనం తెలిపింది. బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు పరిశోధకులు ఈ పత్రాన్ని రూపొందించారు.

ఆ వ్యాసంలో పరిశోధకులు కొన్ని నిర్థారణలు చేశారని, అయితే అవి ఎంతమాత్రం విశ్వసించదగినవిగా లేవని సంపాదకుడు, ప్రచురణకర్త అభిప్రాయపడ్డారని జర్నల్ తెలిపింది. కోవాగ్జిన్‌పై వ్యాసంలో పొందుపరచిన అభిప్రాయాలు తప్పుడు అంచనాలకు వచ్చేలా ఉన్నాయని, అందుకే ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దానిని తొలగించామని వివరించింది. ప్రస్తుతం జర్నల్‌లో ఆ పత్రం కన్పించడం లేదు. కాగా జర్నల్ నిర్ణయంపై పరిశోధకులు విభేదించారు.

అంతర్జాతీయంగా ఆమోదం పొందిన పబ్లిక్ ఎథిక్స్ కమిటీ (కోప్) మార్గదర్శకాల మేరకు జర్నల్ ఆ వ్యాసాన్ని తొలగించింది. పరిశోధనా పత్రంలో అనేక లోపాలు ఉన్నాయంటూ భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) మే 24న జర్నల్ సంపాదకుడికి ఓ లేఖ రాసింది. కాగా పత్రాన్ని ఉపసంహరించుకోవద్దంటూ 600 మంది పౌరులు జర్నల్ సంపాదకుడికి ఓ లేఖ రాశారు. దానిని మీడియాకు విడుదల చేసిన రోజునే జర్నల్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ లేఖపై పలువురు వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, ప్రజారోగ్య పరిశోధకులు, హోమియోపతి ప్రాక్టీషనర్లు, ఐటీ కన్సల్టెంట్లు, ఆయుర్వేద నిపుణులు, శాస్త్రవేత్తలు సంతకాలు చేశారు.

ఉపాధిపై ఫోకస్

అగ్నివీర్ విషయంలో కేంద్రంపై ఆగ్రహం

- బీజేపీని దూరం పెడుతున్న ఓటర్లు
- సిట్టింగ్ స్థానాల్లో జేజేపీకి ఆదరణ కరువు
- ఉనికి కోసం ఆప్ పాకులాట
- జులానా నియోజకవర్గంపై అందరి దృష్టి
- కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగట్‌కు ప్రజల నుంచి మద్దతు
- రాజకీయ విశ్లేషకులు, పరిశీలకుల అంచనాలు



చండీగఢ్ : హర్యానాలో నిరుద్యోగం పెద్ద సమస్యగా పరిణమించింది. బీజేపీ పాలనలో ఇది తీవ్రమైంది. ప్రస్తుతం నిరుద్యోగం త్వరలో జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ప్రచారాస్త్రంగా మారనున్నది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నిరుద్యోగం మీదనే మాట్లాడుతూ.. అధికార బీజేపీని ఇరుకున్న పెడుతున్నది. ఒలంపిక్స్ ఫైనల్‌లో తృటిలో పతకాన్ని చేజార్చుకున్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ జులానా నుంచి పోటీలో ఉన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్, బీజేపీ నాయకుడు బ్రిజ్ భూషన్‌పై పోరాటంలో వినేశ్‌ది కీలక పాత్ర. ఈ పోరాటం పరోక్షంగా బీజేపీ అధిష్టానం, మోడీపై అంటూ రాజకీయ విశ్లేషకులు సైతం అభివర్ణించారు. దీంతో జులానాపై అందరి దృష్టి పడింది.

జులానాలోనూ నిరుద్యోగ సమస్య ఉన్నది. దీనిపై వినేశ్ ప్రధానంగా దృష్టిని సారిస్తున్నారు. "నేను పోటీ చేస్తున్నందున జులానాకు గుర్తింపు వస్తున్నదని ప్రజలు చెప్తున్నారు. వినేశ్ కోసం కాకుండా.. ఉపాధి, రెజ్లింగ్‌కు జులానా పేరు పొందాలని నేను అనుకుంటున్నాను" అని తన స్వంత గ్రామం నిడానాలోని ఓటర్లు, తన మద్దతుదార్లను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి, ఒలంపియన్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ అన్నారు. జులానాలో ఆమెకు అక్కడి ఓటర్ల నుంచి చక్కటి మద్దతు లభిస్తున్నది. ఎక్కడికి వెళ్లినా ఆమె కోసం ప్రజలు పెద్ద ఎత్తును స్వాగతం తెలుపుతున్నారు. ఆమె ప్రధానంగా ఉద్యోగ, ఉపాధిపై దృష్టి పెడుతున్నారు. అలాగే, బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నివీర్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రజలకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తున్నారు. వినేశ్ స్వగ్రామంలో రెజ్లింగ్‌కు చక్కటి ప్రాధాన్యత ఉన్నది. ఈ గ్రామం ఇండోర్ జిమ్నాసియం, రెజ్లింగ్ అఖాడా (అరేనా)ను కలిగి ఉన్నది. దీనిని స్థానికుల స్వచ్ఛంద సహకారంతో నిర్మించారు.

నిడానాలో జాట్ రైతులు ప్రధాన భూస్వాములుగా ఉన్నారు. వారిలో చాలా మంది భద్రతా దళాల్లోనూ చేరి సేవలు అందిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాలు (రైతుల పోరాటాల తర్వాత రద్దయ్యాయి), భద్రతా దళాల్లో తాత్కాలిక నియామక ప్రక్రియ అయిన అగ్నివీర్.. జాట్‌లతో పాటు ఇక్కడి ప్రజలలో చాలా మందిని తీవ్రంగా దెబ్బ తీశాయని విశ్లేషకులు చెప్తున్నారు. జాట్‌లు, ఇతర హర్యానా ప్రజలు గర్వపడాల్సిన పరిస్థితులు లేవనీ, కొందరు యువకులు రోజువారీ కూలీ కోసం ఛత్తీస్‌గఢ్‌కు కూడా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని నిడానా గ్రామవాసి రామ్ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశాడు. "ప్యారిస్‌లో ఏం జరిగిందో (ఫైనల్‌లో వినేశ్ ఫొగాట్ అధిక బరువు కారణంగా అనర్హురాలిగా ప్రకటించబడింది) అన్న విషయం నాకు సరిగ్గా తెలియదు. ఆశను కోల్పోకుండా, ప్రస్తుతం వ్యవస్థలో మార్పు కోసం పోరాడుతున్నందుకు ఆమె పట్ల మేము గర్వంగా ఉన్నాం" అని అన్నాడు. గ్రామంలో ఫొగాట్‌ను అక్కడి ప్రజలు కుల, మతాలకతీతంగా సన్మానించారు.

జింద్ జిల్లాలోని జులానా అసెంబ్లీ నియోజకవర్గంలో జాట్‌ల ప్రాబల్యం ఎక్కువ. అలాగే, ఎస్సీలు 22.5 శాతంగా ఉన్నారు. భద్రతా దళాల్లో చేరి సేవలందించేవారిలో దళిత యువత కూడా ఉన్నది.

అయితే, అగ్నివీర్ పథకం తర్వాత ఆర్మీ సెలక్షన్‌పై వారిలో నిరాశను కలిగించిందని ఇక్కడి యువత చెప్తున్నది. దీంతో బీజేపీపై వారు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ వినేశ్ ఫొగాట్ పోటీ చేస్తుండటంతో యువత ఓటు కాంగ్రెస్ వైపు మళ్లే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఇక్కడ బీజేపీ నుంచి యోగేశ్ బైరాగీ పోటీలో ఉన్నారు. అలాగే, ఆప్ నుంచి డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ కవితా దళాల్ పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆప్ ప్రభావం కొంత మాత్రమేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. "ఆమె పహిల్వాన్ ('రెజ్లర్'కు గౌరవ పదం) కాదు. ఆమె డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్. ఇక్కడ ఆప్‌నకు ఉనికి లేదు. హర్యానా పార్టీలైన ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జననాయక జనతా పార్టీ (జేజేపీ)లు పోటీ నుంచి దూరంగా ఉన్నాయి. దంగల్ (పోటీ) కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉంటుంది. వచ్చేసారి ఆప్‌నకు కేజ్రీవాల్ వంటి నాయకుడు ఉంటే, మేము వారి వైపు చూస్తాం" అని జులానా పట్టణంలోని అగ్రికల్చర్ డీలర్ దల్బీర్ మాలిక్ అన్నాడు.

> బీజేపీ మాజీ మిత్రపక్షం జేజేపీ నుంచి అమర్‌జిత్ ధండా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే, జేజేపీ సైతం ఇప్పుడు ఇక్కడి జనాలను ఆకట్టుకోవటానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తున్నది. ఆ పార్టీ నిర్వహించే సమావేశాలకూ ప్రజల నుంచి స్పందన కనబడటం లేదు. "మోడీ అనే అంశం కారణంగా గత ఎన్నికల్లో బీజేపీ వైపు ప్రజలు చూశారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. రైతుల పోరాటం కాంగ్రెస్‌కు సహాయపడుతుంది" అని ధిగానా గ్రామ టీచర్ ఒకరు అన్నారు. అగ్నివీర్ పథకం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానాలో అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 8న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

గోకినేపల్లికి శౌర్యయాత్ర

ఆకట్టుకున్న తెలంగాణ సాయుధ పోరాట వీధినాటక ప్రదర్శన

నవతెలంగాణ-ముదిగొండ

ప్రజానాట్యమండలి శౌర్యయాత్ర బృందం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామానికి బుధవారం సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలోని వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుల స్మారక భవనం వద్ద మచ్చా వీరయ్య, రావెళ్ల సత్యం, వాసిరెడ్డి లింగయ్య, యరమనేని వెంకట వెంకటనరసయ్య దంపతుల చిత్రపటాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, కళాకారులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీధినాటికను కండ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఈ వీధినాటిక ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, జిల్లా కార్యదర్శి సదానందం, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం,



నాయకులు పయ్యావుల రామనాథం, ప్రభావతి, మందరపు వెంకన్న, రాయల శ్రీనివాసరావు, వేల్పుల భద్రయ్య, కట్టకూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించలేని దళిత విద్యార్థికి సుప్రీం భరోసా

న్యూఢిల్లీ : గడువులోగా ఫీజు చెల్లించలేకపోవడం వల్ల ఐఐటి సీటు కోల్పోయిన నిరుపేద దళిత విద్యార్థికి సాయం చేస్తామని సుప్రీం కోర్టు భరోసా ఇచ్చింది. సీటును నిలబెట్టుకోవడానికి అవసరమైన మొత్తం రూ.17,500ను జూన్ 24లోగా డిపాజిట్ చేయాల్సి వుండగా, విద్యార్థి అతుల్ కుమార్ అందులో విఫలమయ్యాడు. సాధ్యమైనంతవరకు ఈ విషయంలో సాయం చేస్తామని హామీ ఇస్తూ, ఫీజు చెల్లించడానికి గడువు ముగిసే వరకు గత మూడు మాసాలుగా మీరేం చేస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. అతుల్ కుమార్ తరపు న్యాయవాది మాట్లాడుతూ చిట్టచివరి ప్రయత్నంలో కుమార్ జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష పాసై ఐఐటి ధన్‌బాద్‌లో సీటు తెచ్చుకున్నాడని, ఈ సమయంలో న్యాయస్థానం గనక సాయం చేయకపోతే కష్టమవుతుందని చెప్పారు. స్వల్పంగా వాదోపవాదాలు సాగిన తర్వాత ఐఐటి అడ్మిషన్లు చూసే ఐఐటి మద్రాసు జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీకి బెంచ్ నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది తన క్లయింట్ కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలియచేశారు. సీటు కేటాయించిన తర్వాత నాలుగు రోజుల్లో అంత పెద్ద మొత్తం కట్టలేని పరిస్థితి వారిదని, దినసరి కూలీ కుటుంబం వారిదని తెలిపారు. ఆ విద్యార్థికి సాయం చేయలేమని జాతీయ ఎస్‌టి కమిషన్ కూడా చేతులెత్తేసింది. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

భూగర్భ జలవనరుల శాఖ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు

28న ధ్రువపత్రాల పరిశీలన : టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ భూగర్భ జలవనరుల శాఖలో ప్రకటించిన వివిధ గెజిటెడ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 28న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)లో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులకు రెండో విడతలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. అందులో పొందుపరిచిన ఒరిజినల్ ధ్రువపత్రాలను అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు **www.tspsc.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. భూగర్భ జలవనరుల శాఖలో 32 గెజిటెడ్, 25 నాన్‌గెజిటెడ్ కలిపి 57 పోస్టుల భర్తీకి 2022, నవంబర్ 29న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

బీసీ కులగణనకు కార్యాచరణ రూపొందించండి

బీసీ కమిషన్‌కు సీఎం ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ కులగణనకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి, విధానాలపై సీఎంతో పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్, సభ్యులతో చర్చించారు. బీసీ కులగణన ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. కులగణన ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. బీసీ కులగణన వెంటనే ప్రారంభించి, వేగంగా ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అక్టోబర్ 21 నుంచి 'ఎస్‌ఏ-1' పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల 21 నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదేనెల 28 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఇందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లోనూ ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణ వివరా లను ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ రెండున జవాబుపత్రాల మూల్యాం కనం చేసి ఫలితాలను ప్రకటించాలని తెలిపారు. అదేనెల ఐదున విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేనెల 16న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలనీ, విద్యార్థుల మార్కులు, వారి ప్రతిభపై చర్చించాలని కోరారు. అక్టోబర్ రెండు నుంచి 14 వరకు 13 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు దసరా సెలవులుంటాయి. వచ్చేనెల 15న బడుల్లో తరగతులు ప్రారంభమవుతాయి.

బాలికపై అసభ్యకర ప్రవర్తనపై పోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలో ఓ మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీసులు బుధవారం సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన వ్యక్తి షేక్ పాషామియా ఆ బాలికను గత కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తించడంతో మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గాంధీభవన్‌లో 'ప్రజావాణి'

పార్టీ కార్యకర్తలు, శ్రేణులతో మంత్రి దామోదర ముఖాముఖి | మొదటి రోజు 285 దరఖాస్తులు

అక్కడికక్కడే 30 దరఖాస్తులను పరిష్కరించిన మంత్రి

- సాయం కోసం హెచ్ఐవీ సోకిన ఓ బాలిక, మరో మహిళ అర్జీ
- మెడికల్ పెండింగ్ బిల్లుల కోసం వినతులు
- రేషన్‌కార్డులు, భూసమస్యలు, రేషన్, నిర్వాసితులు, ఇండ్ల కోసం...



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణుల కోసం టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో ప్రజావాణికి శ్రీకారం చుట్టారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలతోపాటు వివిధ సమస్యలతో బాధ పడుతున్న ప్రజలు గాంధీభవన్‌కు భారీగా తరలి వచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మొదటి రోజు ప్రజావాణి కార్యక్రమాన్ని టీపీసీసీ అధ్యక్షులతో కలిసి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వహించారు. ఉదయం 11.30 ప్రారంభమైన ముఖాముఖి కార్యక్రమం మధ్యాహ్నం మూడున్నర వరకు నిర్విరామంగా జరిగింది. మొదటి రోజు వివిధ సమస్యలపై 285 విజ్ఞప్తులు వచ్చాయి. అందులో 30 వరకు మంత్రి అప్పటికప్పుడే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత ఉన్నతాధికారులకు, ఆయా కలెక్టర్లకు పంపించారు. అందులో ఇద్దరు డయాలిసిస్ రోగులు తమ బాధలు చెప్పగానే మంత్రి దామోదర వారిని నిమ్స్‌కు అటాచ్ చేశారు. హెచ్ఐవీ సోకిన ఒక బాలిక, మరో మహిళలకు పెన్షన్‌తోపాటు వైద్య సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు వివిధ రోగాలతో బాధపడుతూ చికిత్స తీసుకున్న తర్వాత మెడికల్ బిల్లులు రావడం లేదంటూ మంత్రికి ఫిర్యాదు చేశారు. వారికి భరోసా కల్పించి త్వరలో పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామంటూ హామీ ఇచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, వైద్య సేవలు అవసరం ఉన్న వారు, డబుల్ బెడ్ రూమ్, రేషన్ కార్డులు ఇలా అనేక సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారు. మహిళలు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకున్నారు. జీవో నెంబర్ 317 బాధితులు, భూ వివాదాలు, కొండ పోచమ్మ నిర్వాసితులు, బీఆర్ఎస్ సర్కారు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేత, ఉపాధ్యాయ, ఉద్యోగ బదిలీలపై వినతులు వచ్చాయి. తన శాఖకు సంబంధించిన అంశాలపై వెంటనే పరిష్కరించాలని దామోదర అధికారులకు సూచించారు. మొత్తం దరఖాస్తులను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు టీపీసీసీ సిబ్బంది కంప్యూటర్‌లో శాఖల వారీగా దరఖాస్తులను నమోదు చేశారు. ఆయా శాఖల వారీగా దరఖాస్తులను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లేఖలను జత చేసి మంత్రులకు పంపిస్తారు.

మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందన్నారు. అందుకే వాళ్ళ కోసం గాంధీభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం పెట్టామన్నారు. వారంలో బుధ, శుక్రవారాల్లో మంత్రులు గాంధీభవన్‌కు వచ్చి ప్రజల సమస్యలు వింటారు. ప్రజలు, కార్యకర్తలు ఇచ్చిన అర్జీలను మంత్రులు తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో పరిష్కరించేందుకు కృషి చేస్తారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ గాంధీ భవన్‌లో ప్రజావాణి కార్యక్రమం అద్భుతమైన ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి అధ్యక్షతన వహించారు. సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్, అధికార ప్రతినిధులు భవాని రెడ్డి, బండారు శ్రీకాంత్, అల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

> **రేపు ప్రవాసీ ప్రజావాణి ప్రారంభోత్సవం**
>
> హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ఈనెల 27న శుక్రవారం ఉదయం 10 గంటలకు గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మెన్, అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు

అనుగుణంగా మోడీ పాలన

జయంతి వేడుకల్లో బీజేపీ ఎంపీ లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనసంఘ్ పూర్వ అధ్యక్షులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోడీ నిరంతరం పనిచేస్తున్నారని బీజేపీ ఎంపీ కె లక్ష్మణ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి లక్ష్మణ్‌తోపాటు ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, రాష్ట్ర కార్యదర్శులు జయశ్రీ, గొట్టాల ఉమారాణి, రాష్ట్ర అధికార ప్రతినిధి జి వెంకటరెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యమంటూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన సిద్ధాంతానికి అనుగుణంగా మోడీ పనిచేస్తున్నారని చెప్పారు. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు, దేశ సంపద అందాలన్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ కలలను సాకారం చేస్తున్నారని వివరించారు. కుల, మత, వర్గ భేదం లేకుండా అందరికీ నేరుగా ఫలాలు అందేలా, దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలను డిజిటల్ విధానంలో అందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అవినీతి కుంభకోణాలతో కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిందని ఆరోపించారు. కర్నాటక సీఎం నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాల్సింది పోయి చేసిన అవినీతిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో కూడా మంత్రులు, ప్రభుత్వంలోని కొంతమంది అవినీతికి పెద్ద ఎత్తున పాల్పడుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం, వ్యతిరేకత వస్తున్నదని అన్నారు.

వైద్యారోగ్యశాఖలో

4 వేల పోస్టులు

15 రోజుల వ్యవధిలో నోటిఫికేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో అన్ని రకాల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నది. దీంతో గడిచిన 15 రోజుల వ్యవధిలోనే 4 వేల పోస్టులకు వైద్యారోగ్య సేవల నియామక మండలి నోటిఫికేషన్లు విడుదల చేసింది. మరో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రానున్న 10 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు సమాచారం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో దాదాపు 1,600 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదాన్ని వైద్యారోగ్యశాఖ కోరింది. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే వాటికి కూడా నోటిఫికేషన్ ఇస్తామని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి ఆస్పత్రిలో ఉన్న ఖాళీల్లో 80 శాతం ఖాళీలను భర్తీ చేయాలని సర్కారు నిర్ణయించింది. ఇప్పటికే నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు గానూ 6,956 మందికి, 285 మంది ల్యాబ్ టెక్నీషియన్లను, 48 మంది ఫిజియోథెరపిస్టులను, 18 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించిన సంగతి తెలిసిందే. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ల ద్వారా 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 2,050 నర్సింగ్ ఆఫీసర్లు, 633 ఫార్మాసిస్టులు, 1,666 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఫీమేల్), 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్, 435 సివిల్ సర్జన్, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులున్నాయి.

విలేకర్లు కావలెను

కావాల్సిన ప్రాంతాలు :

- నల్లగొండ రూరల్
- నల్లగొండ టౌన్
- తిప్పర్తి
- కనగల్
- గుర్రంపోడ్
- గట్టుప్పల్
- నకిరేకల్ రూరల్
- చందంపేట
- దామరచర్ల
- నేరేడుగొమ్ము
- నాగార్జునసాగర్
- గుడిపల్లి
- నడిగూడెం
- అనంతగిరి
- భువనగిరి రూరల్
- భువనగిరి టౌన్
- మోటకొండూరు

అనుదినం జనస్వరం నినాదంతో నడుస్తున్న నవతెలంగాణ దినపత్రికలో పని చేసేందుకు రిపోర్టర్లు కావలెను. చక్కని రాత, సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ చక్కటి అవకాశం. వెంటనే దరఖాస్తు చేసుకోండి. డిగ్రీ ఆపైన చదివిన వారు అర్హులు.

పరీక్ష తేదీ: 27.09.2024,శుక్రవారం

సంప్రదించవలసిన చిరునామా :
నవతెలంగాణ జిల్లా కార్యాలయం, సిపిఐ(ఎం) ఆఫీస్,నల్లగొండ.

9490099357
9490099332

అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ప్రయత్నం మంచిదే!

సంపాదకీయం



ఇటీవల కన్నుమూసిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి మన దేశాన్ని అందమైన ఒక పూల బొకేతో పోల్చారు. రంగురంగుల పూలన్నీ ఒక చోట చేరి, ఆ బొకేకి అందాన్ని చేకూర్చినట్టు...భారతంలో భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న ప్రాంతాలు, రకరకాల భాషలు, పలురకాల సాంప్రదాయాలు... వెరసి మరేదేశంలో లేని విధంగా మన దగ్గర భిన్నత్వంలో ఏకత్వమనేది శతాబ్దాలుగా పరిఢవిల్లుతోందని ఆయన నొక్కి వక్కాణించారు. అదే కోవలో మహత్తర, వీరోచిత సాయుధ రైతాంగ పోరాటం జరిగిన తెలంగాణ గడ్డ... గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలిచింది. భాషలు, మతాలు వేరైనా, మనమంతా భాయి... భాయి అంటూ హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు గురజాడ చెప్పినట్టు అన్నదమ్ముల వలె కలగలిసి తిరుగుతున్నారు.

అయితే కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ... ఈ సోదరతత్వాన్ని విడదీసి, పరమత సహనానికి బీటలు వార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో ఎనిమిది మంది ఎంపీలను గెలిచిన కమలం పార్టీ... ఇక్కడ ఏ మూలన ఏం జరిగినా, దాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తోంది. భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు అది కుయుక్తులు పన్నుతోంది. వ్యక్తిగత విభేదాలకు మతం రంగు పూస్తూ.. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు అది కుట్రలు పన్నుతోంది. వాటికి సామాన్య ప్రజలు బలవుతుండటం ఆందోళనకరం. దాని ఉచ్చులో కొందరు పావులుగా మారుతున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో జరిగిన ఘటన ఈ కోవలోకే వస్తుంది. గతంలో అదే జిల్లాలోని భైంసాలో ఆ పార్టీ మత ఉద్రికత్తలను రెచ్చగొట్టిన తీరు మనకు గుర్తే. ఇప్పుడు మరో కొత్త ప్రాంతమైన జైనూరులో కూడా అదే తరహాలో చిచ్చుపెట్టేందుకు, తద్వారా రాజకీయలబ్ధి పొందేందుకు కాషాయ పార్టీ చూస్తోంది. ఆయా ఘటనలను విచారించి, నిజా నిజాలను నిగ్గు తేల్చాల్సింది, బాధితులకు న్యాయం చేయాల్సింది, బాధ్యులను శిక్షించాల్సింది పోలీసులు, కోర్టులు. కానీ ధరలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, సీజనల్ వ్యాధుల్లాంటి ప్రజల దైనందిన సమస్యల గురించి ఒక్కరోజు కూడా పట్టించుకోని బీజేపీ... జైనూరు లాంటి ఘటనల్లో మాత్రం జోక్యం చేసుకోవటం అత్యంత విడ్డూరం. ఆయా విషయాల్లో ఒక రాజకీయ పార్టీగా అన్నింటికి మతం రంగు పులమటం, తద్వారా చిలువలు పలువలు చేయటం దానికే చెల్లింది.

> మతతత్వ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. దుష్టశక్తులు పేట్రేగేందుకు అవకాశమివ్వొద్దంటూ జనాలను అప్రమత్తం చేశారు. అంతేకాదు నిజాం హయం నుంచి ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సఖ్యతగా మెలిగిన ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఇలాంటి సమస్యలను పైపైన చూడకూడదనీ, వాటి మూలాల్లోకి వెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఇక్కడ మనం ఒక విషయాన్ని సీరియస్‌గా గమనించాలి. గత కొన్నేండ్లుగా రాష్ట్రంతోపాటు దేశంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టు కోసం బీజేపీ అనేక రకాల ప్రయోగాలు చేస్తోంది. వనవాసీ కళ్యాణ పరిషత్ తదితర సంస్థల పేర్లతో వారిలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది, అలా ప్రయత్నించి కొన్నిచోట్ల సఫలీకతమైంది, ఫలితాలు సాధించింది. జైనూరుతో పాటు ఆ జిల్లాలోని అనేక గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో సరైన ఉపాధి అవకాశాల్లేకపోవటం సమస్యలకు ప్రధాన కారణం. దీంతో ఆదివాసీలు, ఇతర గిరిజనుల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటోంది. ఈ పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మలచుకుంది. ఆదివాసీలను రెండు వర్గాలుగా విడదీసి, వారిలో వారికి చిచ్చుపెట్టి, వారితో మైదాన ప్రాంత గిరిజనులకు గొడవలు సృష్టించి, నానా యాగీ చేస్తోంది.

మరోవైపు జానీ మాస్టర్ వ్యవహారంపై కూడా రచ్చ చేసేందుకు బీజేపీ కాసుక్కూర్చుంది. ఈ అంశంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఇక్కడ గమనార్హం. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నేటి కేంద్ర మంత్రి బండి సంజయ్...'మసీదులన్నీ కూలుస్తాం...' అంటూ ప్రమాదకరమైన కామెంట్లు చేయటం ఆ పార్టీ విద్వేష బీజాలకు పరాకాష్ట. 'శవాలు, శివలింగాలు...' అంటూ ఆయన వ్యాఖ్యానించటాన్నిబట్టి తన పార్టీ 'ఉద్దేశమేంటో' చెప్పకనే చెప్పారు.

బహుశా ఇలాంటి ప్రమాదాలను రాష్ట్ర మంత్రి సీతక్క ముందే పసిగట్టారు కాబోలు. మతతత్వ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. దుష్టశక్తులు పేట్రేగేందుకు అవకాశమివ్వొద్దంటూ జనాలను అప్రమత్తం చేశారు. అంతేకాదు నిజాం హయం నుంచి ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సఖ్యతగా మెలిగిన ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఇలాంటి సమస్యలను పైపైన చూడకూడదనీ, వాటి మూలాల్లోకి వెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మైనారిటీల పట్ల యువతలో వ్యతిరేక భావనను పెంపొందిస్తున్న దుష్ట శక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలంటూ ఆమె ఆదేశించారు. ఇదే సమయంలో జైనూరు ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు త్వరలోనే ప్రభుత్వం తరపున ఒక ఉమ్మడి సమావేశాన్ని నిర్వహిస్తామంటూ ఆమె భరోసా నివ్వటం హర్షణీయం. అదే సమయంలో 'మైనారిటీ శక్తులు' కూడా హద్దు దాటితే 'చట్టం తన పని తాను చేసుకు పోతుంది...' అని చెప్పటం ద్వారా మతతత్వ శక్తులకు ఎలాంటి అవకాశం, ఆస్కారం ఇవ్వకుండా చూడటం కూడా సరైందే. ఈ విషయంలో ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రిగా సీతక్క చొరవను, కృషిని అభినందించి తీరాలి. అయితే ఆమె ప్రయత్నమొక్కటే ఇక్కడ సరిపోదు. ఇలాంటి సున్నిత అంశాలను పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత నేటి రేవంత్ సర్కార్‌పై ఉంది. ప్రజల మధ్య చిచ్చుపెట్టే అరాచక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్న సంకేతాన్ని అది ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పంపాలి. అప్పుడే ఏచూరి చెప్పిన మన పూల బొకే మరింత అందంగా కనబడుతుంది.

ఆ ఒక్క నిజమే ...

శ్రమకు ఏదేదో జమైంది
కాళ్ళ శ్రమ బళ్ళెక్కింది
చేతి శ్రమ కీబోర్డు పరమైంది
నోటి శబ్దం స్పీకర్లో దూరింది
శ్రామికుడి యూనిఫారం
తెల్ల బట్టల్లో మెరుస్తోంది
శ్రమజీవులిప్పుడు కొందరు
ఏసీ గదుల్లో నిలపబడ్డారు
ఇదే పెట్టుబడి బజారు దండోర
అన్నీ పాక్షికంగానైనా నిజాలే
ఏవీ పూర్తి అబద్ధాలు కావు



కానీ చెప్పని కఠోర నిజం ఒకటుంది
కష్టజీవుల బతుకుల్లో మెరుపులు నింపే
ఉత్పత్తిలో శ్రమకు వాటా పెట్టలేదు
అది జీతమై జీవితానికి జమ కాలేదు
పని గంటల ముల్లుకు
స్కేటింగ్ చక్రాలు తొడిగి
ఎనిమిదిని పన్నెండుకు పెంచి
ఇబ్బడిముబ్బడిగా దోచడం ఆపలేదు
కష్టం మేరకు ధనం దక్కని జనం
పెరిగిన ధరలు .. చమురు భారాల్లో
సలాసలా మరిగి చిక్కి పోతున్నారు
ఆ ఒక్క నిజమే వారిని
తూర్పు మార్పుకు కదంతొక్కిస్తుంది
అరుణ పతాకను చేత పట్టిస్తుంది

- ఉన్నం వెంకటేశ్వర్లు
8790068814

'అధ్యయనం-పోరాటం' ఆయుధంగా...



ఎస్.వీరయ్య

ఐసీయులోకి పోయిన సీతారాం ఏచూరి ఇక రారనీ, అక్కడి నుంచి అంతిమయాత్రకేనని ఎవరూ ఊహించలేదు. ఆయన మరణం పట్ల ఉన్నతస్థాయి స్పందన చూసాం. దేశం సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కామ్రేడ్ ఏచూరిని కోల్పోయింది. దేవుడిని, మతాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. మత విశ్వాసానికి, మతోన్మాదానికి మధ్య ఉన్న విభజన రేఖను స్పష్టంగా గుర్తిస్తూ ఉన్మాదపు ఎత్తుగడలను సమర్థవంతంగా తిప్పికొట్టిన నేత. రాజకీయాల్లో విలువలకు వలువలూడిన కాలం ఇది. ఆ విలువలకే విలువలద్దిన నేత సీతారాం ఏచూరి. పదవికి దూరంగా పది రోజులు కూడా ఉండలేక గోడ దూకే కాలం. అన్ని అవకాశాలుండి కూడా తాను అడుగుపెట్టిన రాజకీయాలనే అంటిపెట్టుకుని అర్ధ శతాబ్ధం నిలిచిన నేత. తుది శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నేత. అందుకే ఇది అనేక మంది రాజకీయ నాయకులకు ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఆయన ఒక విజ్ఞాన శిఖరం. బాల్యం నుంచి తుది ఘడియల వరకు ఆ శిఖరం ఎదుగుతూనే వచ్చింది. పదహారేండ్ల వయస్సులోనే అంతర్జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో నెగ్గి అందుకు బహుమతిగా అమెరికా అధ్యక్షునితో వైట్‌హౌస్‌లో అల్పాహారం తీసుకున్నారు. హయ్యర్ సెకండరీ స్థాయి పరీక్షలలో ఆల్ ఇండియా అగ్రస్థానం సాధించారు. ఆ రోజుల్లోనే పిల్లలకోసం ప్రచురించిన జూనియర్ స్టేట్స్‌మెన్ పత్రిక సీతారాం ఏచూరిని భావిభారత ప్రధానిగా అభివర్ణించిందని ఆయన బాల్య మిత్రుడు సంజయబారు గుర్తుచేసారు. ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యూ)లో కూడా అత్యుత్తమ అధ్యయనశీలిగానే నిలిచారు. కుటుంబ పెద్దలు ఉన్నతస్థాయికి ఎదిగిన నేపధ్యం కూడా ఉన్నది. వ్యక్తిగత అభివృద్ధికి ఇన్ని అవకాశాలు ఉండి కూడా అన్నీ వదులుకుని మార్క్సిజమే మార్గంగా ఎంచుకున్నారు. భారతదేశంలో నేటి గొప్ప మార్క్సిస్టు మేధావిగా నిలిచారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతినిధిగా అత్యంత సమర్థవంతంగా జోక్యం చేసుకున్నారు.

> విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రూపొందించిన కీలకమైన నినాదాలను మనసా, వాచా, కర్మణా అక్షరాల అమలు చేసిన నేత సీతారాం ఏచూరి. ఆయన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత నాయకులుగా ఉన్న సమయంలోనే 'అధ్యయనం - పోరాటం' అన్న నినాదం దేశమంతా మారుమోగింది. 'చదువుతూ పోరాడు - చదువుకై పోరాడు' అని సాధారణ విద్యార్థులు కూడా అందుకున్న నినాదం ఇది. అంతేకాదు, పాఠ్యపుస్తకాలే కాక, సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్న సందేశాన్నిచ్చిన నినాదం ఇది. అనతికాలంలోనే ఇది అన్ని విద్యార్థి సంఘాల నినాదంగా మారింది. మా నినదాన్ని స్వీకరించిన ఇతర సంఘాలు మా విధానాలను కూడా స్వీకరిస్తే మంచిదని సీతారాం చురకలు వేసేవారు.

విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రూపొందించిన కీలకమైన నినాదాలను మనసా, వాచా, కర్మణా అక్షరాల అమలు చేసిన నేత సీతారాం ఏచూరి. ఆయన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత నాయకులుగా ఉన్న సమయంలోనే 'అధ్యయనం - పోరాటం' అన్న నినాదం దేశమంతా మారుమోగింది. 'చదువుతూ పోరాడు - చదువుకై పోరాడు' అని సాధారణ విద్యార్థులు కూడా అందుకున్న నినాదం ఇది. అంతేకాదు, పాఠ్యపుస్తకాలే కాక, సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్న సందేశాన్నిచ్చిన నినాదం ఇది. అనతికాలంలోనే ఇది అన్ని విద్యార్థి సంఘాల నినాదంగా మారింది. మా నినదాన్ని స్వీకరించిన ఇతర సంఘాలు మా విధానాలను కూడా స్వీకరిస్తే మంచిదని సీతారాం చురకలు వేసేవారు. విద్యార్థి ఉద్యమంలో సమ్మె ఒక ముఖ్యమైన ఆయుధంగా చలామణి అవుతున్న కాలమది. ఉత్పత్తి రంగంలో వర్గ పోరాటానికి, విద్యార్థి రంగంలో పోరాటానికి మధ్య ఉన్న తేడాను చూపిన సుందరయ్య బాటలో నాటి ఎస్ఎఫ్ఐ నాయకత్వం ముందుకు సాగింది. పరిశ్రమలు, వ్యవసాయ రంగంలో సమ్మెలు ఉత్పత్తిని స్తంభింపజేస్తాయి. పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల మీద పోరాటానికి సమ్మె పదునైన ఆయుధం. ప్రత్యేక సందర్భాల్లో తప్ప, విద్యార్థి ఉద్యమంలో అది సాధారణ ఎత్తుగడ కాజాలదని స్పష్టం చేసింది. నాటి విద్యార్థి ఉద్యమంలో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇది కూడా ఏచూరి నాయకత్వంలోనే దేశ వ్యాపితంగా ప్రచారంలోకి వచ్చింది. అతి త్వరలోనే విస్తృత ఆమోదం పొందింది. విద్యా సంస్థల్లో భౌతికదాడులు సర్వసాధారణంగా మారిన కాలమది. భౌతిక దాడులు కాదనీ, భావసంఘర్షణ కేంద్రాలుగా భాసిల్లాలని నాటి నాయకత్వం నినదించింది. ఈ వైఖరులన్నీ విద్యారంగంలోనూ, విద్యార్థుల తల్లిదండ్రులు, సమాజంలోనూ ఆదరణ పొందాయి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైన పాలకులు సమస్యను రిజర్వేషన్ల చుట్టూ తిప్పే ప్రయత్నం ఇప్పుడే కాదు, ఆ కాలంలోనే మొదలైంది. సహజం గానే రెండు వాదనలు ముందుకొచ్చాయి. తరతరాలుగా వివక్షకు గురైన తరగతుల నుంచి కొందరు రిజర్వేషన్లే సర్వరోగ నివారిణిగా పైకెత్తేందుకు ప్రయత్నించారు. ఊరట కల్పించే చిన్న అవకాశాన్ని ఉన్నతమైన పరిష్కారంగా చూపించారు. మరోవైపు కొందరు రిజర్వేషన్ల వల్లనే ప్రతిభావంతులు అవకాశాలు కోల్పోతున్నారనే వాదన చేసారు. ఇలాంటి సమయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఇచ్చిన నినాదం 'అందరికీ విద్య-అందరికీ ఉద్యోగం' విద్యార్థి లోకాన్ని ఆకర్షించింది. ఐక్యంగా నిలిపే నినాదంగా ముందుకొచ్చింది. ఐక్య పోరాటాలకు బాటలు వేసింది. సమాజంలో అందరికీ చదువుకునే అవకాశం కల్పించి, అందరికీ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తెస్తే రిజర్వేషన్ల ప్రశ్నే ఉదయించదు కదా! అందుకే ఈ నినాదం దేశమంతా మారుమోగింది. అనేక ప్రాంతాల్లో విచ్ఛిన్నకర ఉద్యమాలతో విద్యార్థిలోకం ప్రభావితం అవుతున్న కాలంలో ఎస్ఎఫ్ఐ నాయకత్వం 'మా దేహం ముక్కలైనా - దేశాన్ని ముక్కలు కానివ్వం' అని గర్జించింది. ఈ నినాదం విద్యార్థి లోకాన్ని పెద్ద ఎత్తున ప్రభావితం చేసింది. ఇలాంటి నినాదాలు విద్యార్థుల హృదయాలను కదలించే విధంగా ముందుకు తీసుకెళ్ళడంలో సీతారాం అగ్రగణ్యుడు.



> ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని రాముని పేరుతో, మతం పేరుతో పక్కదారులు పట్టించే ప్రయత్నాలు జరుగుతున్న స్థితిలో ఉన్నాం. మనిషి ప్రశ్నించేతత్వాన్ని, తెలుసుకోవాలన్న జిజ్ఞాసను నీరుగార్చేందుకు పాలకవర్గాలు మతం పేరుతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే మనిషి జీవితం నిరర్థకం అనీ, చేయగలిగిందేమీ లేదని శ్రామికులను నిరుత్సాహపరచడానికి పూనుకుంటున్నాయి. ఈ సందర్భంగా "జీవితం నిరర్ధకం కాదు... చనిపోయేంతవరకు జీవితపు ఉపయోగితను సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలి" అన్నారు సీతారాం ఏచూరి. అదే ఆయన ఆచరించి చూపారు. అంతేకాదు, చనిపోయిన తర్వాత కూడా ఆయన శరీరపు ఉపయోగితను మరింత పెంచి చూపించారు. తన దేహాన్ని వైద్య పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు అప్పగించారు. అందుకే నేటి యువతకు ఆయనొక ఐకాన్.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్రనేతగా సీతారాం ఏచూరి భౌతికకాయానికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రాంగణంలో అధికారుల నుంచి విద్యార్థుల వరకు అందరూ నివాళులు అర్పించిన తీరు ప్రత్యేకతను సంతరించుకున్నది. జెఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులుగా వరుసగా మూడుసార్లు ఎన్నికైన ఏకైక నాయకుడు ఏచూరి. ఆరోగ్యకరమైన విద్యార్థి ఉద్యమ సంప్రదాయాలు నెలకొల్పి ఎస్ఎఫ్ఐ బలమైన కేంద్రంగా జెఎన్‌యూను రూపుదిద్దిన ఇద్దరు నాయకుల్లో ఏచూరి ఒకరు. జెఎన్‌యూలో ప్రకాష్‌కారత్, సీతారాం ఏచూరిల నాయకత్వంలో నిర్మించిన విద్యార్థి ఉద్యమమే నాటికీ, నేటికీ ఒక నమూనా అంటే అతిశయోక్తికాదు. జెఎన్‌యూలో ఏచూరికి అందిన అసాధారణ నివాళిని ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవచ్చు. అర్థశాస్త్రం, తత్వశాస్త్రం, చరిత్ర, రాజ్యాంగం, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం వంటి అనేక అంశాలను లోతుగా అధ్యయనం చేసారు. భారతీయ తాత్వికచింతన మూలాల ఆధారంగానే మతోన్మాదుల వాదనలను తిప్పికొట్టిన మేధావి. ఇది సహించలేకనే "హైందవ శక్తి" అనే పేరుతో కొందరు ఉన్మాదులు చనిపోయిన ఏచూరి మీద నీచమైన నిందాపూరిత ప్రచారం ప్రారంభించారు. అది ఎలాంటి సంస్కారమో, ఎట్లాంటి సంస్కృతో వారే సమాధానం చెప్పాలి. పార్లమెంట్‌లో సీతారాం ఏచూరి ప్రసంగాలు అన్ని పక్షాలకు చెందిన సభ్యులు శ్రద్ధగా వినేవారంటేనే ఆయన లోతైన అధ్యయనం, హేతుబద్ధమైన వాదనాపటిమ గురించి అర్థం చేసుకోవచ్చు.

ఏచూరి తండ్రి కోరిక మేరకు ఆయన మేనమామ మోహన్‌కందా (ఉమ్మడి రాష్ట్రప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ) గారు సీతారాం ఏచూరిని రాజకీయ కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారట. ఈ ప్రయత్నంలో సీతారాం మారకపోగా, తానే మార్క్సిస్టుగా మారిపోతానేమోనన్న పరిస్థితి ఏర్పడిందని మోహన్‌కందా గుర్తు చేసుకున్నారు. మార్క్సిజం- లెనినిజం పట్ల సీతారాం ఏచూరి ప్రదర్శించిన అచంచల విశ్వాసం ఫలితమిది. నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు విలువలు, క్రమశిక్షణా పాటించవలసి వచ్చినప్పుడు తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యుల ఒత్తిడి పేరుతో కొంతమంది మినహాయింపులు కోరడం చూస్తున్నాం. అధ్యయనశీలిగా, ప్రజా ప్రయోజనాల కోసం జీవితాంతం నిబద్ధతతో కృషి చేసిన నేతగా ఆయన భవిష్యత్ తరాలకు ఆదర్శం. ప్రపంచీకరణ ప్రభావంతో సమిష్టి ప్రయోజనం స్థానంలో వ్యక్తిగత ప్రయోజనానికి పెద్దపీట వేస్తున్న నేడు యువతలో క్యారియరిజం ఒక దశలో పరాకాష్టకు చేరింది. ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మళ్ళీ మార్పులొస్తున్నాయి. ప్రపంచీకరణ భ్రమలు మంచుతెరల్లా కరగడం మొదలైంది. అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాల్లో కూడా యువత జీవితంలో అస్థిరత పెరుగుతున్నది. భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నది. మరోవైపు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) పేరుతో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వేగంగా దూసుకు పోతున్నది. శ్రమ దోపిడీకి దీనిని సాధనంగా వాడుకుని లాభాలు దండుకునేందుకు పెట్టుబడి దారీ వర్గం సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నిస్తున్నది. సీతారాం అమలు చేసి చూపిన 'అధ్యయనం-పోరాటం' ప్రాధాన్యత మరొకసారి ముందుకొచ్చింది. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని రాముని పేరుతో, మతం పేరుతో పక్కదారులు పట్టించే ప్రయత్నాలు జరుగుతున్న స్థితిలో ఉన్నాం. మనిషి ప్రశ్నించేతత్వాన్ని, తెలుసుకోవాలన్న జిజ్ఞాసను నీరుగార్చేందుకు పాలకవర్గాలు మతం పేరుతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే మనిషి జీవితం నిరర్థకం అనీ, చేయగలిగిందేమీ లేదని శ్రామికులను నిరుత్సాహపరచడానికి పూనుకుంటున్నాయి. ఈ సందర్భంగా "జీవితం నిరర్ధకం కాదు... చనిపోయేంతవరకు జీవితపు ఉపయోగితను సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలి" అన్నారు సీతారాం ఏచూరి. అదే ఆయన ఆచరించి చూపారు. అంతేకాదు, చనిపోయిన తర్వాత కూడా ఆయన శరీరపు ఉపయోగితను మరింత పెంచి చూపించారు. తన దేహాన్ని వైద్య పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు అప్పగించారు. అందుకే నేటి యువతకు ఆయనొక ఐకాన్. ఆయన నమ్మిన మార్క్సిజమే మార్గదర్శకం.

సవాళ్లను అధిగమించి..చరిత్రను సృష్టించి...

అతుల్ చంద్ర, విజయ్‌ప్రసాద్

ఈ నెల 22న ఫలితాలు ప్రకటించిన శ్రీలంక దేశ అధ్యక్ష ఎన్నికల్లో జన విముక్తి పెరుమన (జేవీపీ) నాయకత్వాన ఏర్పడిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్పీపీ) కూటమి గెలుపొందింది. గత పదేళ్లుగా వామపక్ష పార్టీ అయిన జేవీపీకి నాయకత్వం వహించిన దిశనాయకే, తనతో బరిలో ఉన్న 37మంది కాండిడేట్లపై గెలుపు సాధించి, అధ్యక్ష పదవిని చేపట్టనున్నారు. ఆయన ఓడించిన వారిలో ఇప్పటి వరకు అధ్యక్షునిగా ఉన్న యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్పీ) నాయకుడు రనిల్ విక్రమసింఘేతో పాటు, రెండవ స్థానంలో గట్టి పోటీనిచ్చిన సమాగి జాన బాలవేగవ (ఎస్‌జెబి) అభ్యర్థి సజిత్ ప్రేమదాస ఉన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా శ్రీలంక ఎన్నికలని, రాజకీయాలని శాసించిన, రెండు పార్టీలు - పోదుజన పెరుమన (ఎస్ఎల్ఎల్ పి), యూఎన్‌పిలకి, ఈ ఎన్నికలలో గట్టి దెబ్బ తగిలింది. అయినప్పటికీ, శ్రీలంక పార్లమెంట్‌లో వీరి ఆధిపత్యం కొనసాగబోతోంది. ప్రస్తుత పార్లమెంటులో ఉన్న స్థానాల్లో 105 సీట్లు ఎస్ఎల్ఎల్‌పికి మూడు స్థానాల్లో యూఎన్‌పికి ఉన్నాయి. దిసనాయకే నాయకత్వాన జేవీపీకి ఉన్న పార్లమెంటు స్థానాలు మూడు మాత్రమే.

మొత్తమ్మీద చూస్తే, దిసనాయకె గెలుపు, చారిత్రిక గెలుపుగా చూడవల్సిందే. శ్రీలంక దేశ చరిత్రలో మొట్ట మొదటి సారి, మార్క్సిస్టు చరిత్ర ఉన్న ఓ రాజకీయ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందింది. అందరూ ఏకేడీ అని పిలిచే, దిసనాయకే కొలంబోకి దూరంగా, ఉత్తర-మధ్య శ్రీలంకలో, ఓ శ్రామిక వర్గ కుటుంబంలో 1968లో పుట్టారు. ఆయన శ్రీలంక విద్యార్థి ఉద్యమంలో, తరువాత జేవీపీ కార్యకర్తగా రాజకీయ పరిణితి చెందారు. ప్రపంచంలో మొట్టమొదటి మహిళా దేశాధ్యక్షురాలైన సిరిమావో బాండారనాయకే కూతురు, 1994 నుండి 2005 వరకు శ్రీలంక అధ్యక్షురాలిగా ఎన్నికైన చంద్రిక కుమారతుంగతో 2004లో జేవీపీకి పొత్తు కుదిరింది. కుమారతుంగ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న దిశనాయకేకి అప్పుడే మంచి కార్యదక్షునిగా పేరొచ్చింది. ఆయన హయాంలో శ్రీలంక వ్యవసాయ విధానంపై దేశంలో అప్పట్లో విస్తృతంగా చర్చలు జరిగాయి. దిసనాయకే 2019లోనూ అధ్యక్ష ఎన్నికలలో ఎన్‌పిపి తరపున పోటీచేశారు.

శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం

2022లో శ్రీ లంక రాజధాని కొలంబో వీధుల్లో జరిగిన 'అరగలయ' నిరసనకారులు అధ్యక్షుని ఇంటిని చుట్టుముట్టి ఆక్రమించడం, ఆ పరిస్థితుల్లో అధ్యక్షుడు గోటబయ రాజపక్సే కొలంబో వదిలిపోవాల్సి రావడం తెలిసిందే. 2022 నాటికి పూర్తిగా సన్నగిల్లిన ప్రజల ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, తిండి, చమురు, మందులవంటి అత్యవసర వస్తువుల కొరత -ఈ అరగలయ (నిరసనలు) వెనుక ఉన్న కారణాలు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శ్రీలంక ప్రభుత్వం విదేశీ అప్పులను తీర్చలేక చేతులెత్తేసింది. గోటబయ రాజీనామా తరువాత, అమెరికా కూటమి పట్ల సుముఖంగా ఉంటూ శ్రీలంకలో సరళీకరణ ఆర్థిక విధానాల అమలుకు ఆధ్యుడైన విక్రమసింఘే అధ్యక్ష పదవిని ఆక్రమించాడు. ప్రజాసమ్మతం లేని విక్రమసింఘే పాలనలో, భారీ నిరసనలకు కారణమైన ఏఒక్క సమస్యని తీర్చే ప్రయత్నం జరగలేదు. 2023లో అంతర్జాతీయ విత్త సంస్థ ముందు మోకరిల్లి, 2.9 వందల కోట్ల డాలర్ల అప్పుని పొందింది విక్రమసింఘే ప్రభుత్వం. ఇలా షరతులతో కూడిన అప్పు ఇచ్చి శ్రీలంక ఆర్థిక వ్యవస్థలో కల్పించుకోవడం, గత అరవై ఏండ్లలో ఇది పదిహేడవ సారి. ఐఎంఎఫ్ కూడా షరతుల్లో భాగంగా విద్యుత్ సబ్సిడీలకు భారీ కోత పెట్టి, వస్తువులపై వేసే వాల్యూయాడేడ్ టాక్స్ (వ్యాట్) ని రెండితలు చేసి 18 శాతానికి తెచ్చింది. ఈ పరిస్థితిలో ఐఎంఎఫ్ షరతుల వల్ల, ముందు వెనుకలు చూడకుండా విచ్చలవిడిగా అధిక వడ్డీలకి అప్పులిచ్చిన అంతర్జాతీయ విత్త వ్యాపారులకు ఎటువంటి నష్టం కలుగలేదు, సరికదా అప్పుల భారం యావన్మంది శ్రీలంక కార్మిక వర్గంపై పడింది.

ప్రజలను కడగండ్లకు గురిచేస్తున్న ఈ ఐఎంఎఫ్ ఒప్పందాన్ని మళ్లీ తిరగరాయించి, ప్రజల మీద భారం తగ్గించి,అప్పులిచ్చిన తరువాత ఆ రిస్కు భరించవలసిన బాధ్యత ఉన్న అంతర్జాతీయ విత్త పెట్టుబడిదారులచేత అప్పు తరుగుకి ఒప్పించే దిశగా అడుగులు వేస్తామని దిసనాయకే అంటున్నారు. ఆదాయ పన్ను పరిమితిని తగ్గించి, నిత్యావసర వస్తువులపై విక్రమసింఘే ప్రభుత్వం వేసిన పన్నులను వెనక్కి తీసుకుంటామని వాగ్దానం చేశారు. ఈ వాగ్దానాలను నిలబెట్టుకుని, సంస్థాగతంగా వెళ్లూనికొని ఉన్న అవినీతిని అదుపు చేయగలిగితే, దిసనాయకే శ్రీలంక రాజకీయాలపై గట్టి ముద్రవేస్తారు. అంతర్యుద్ధం వల్ల గాయపడిన శ్రీలంక సమాజానికి, పెద్ద రాజకీయ పార్టీల చేత భంగపడి ఉన్న శ్రీలంక ప్రజలకు ఊరట కలిగించినవారవుతారు.



> ఎన్‌పిపి కూటమిలోని పార్టీలకి లోతైన సైద్ధాంతిక విబేధాలు ఉన్నప్పటికీ ఈ ఉమ్మడి ప్రోగ్రామ్ అధారంగా జాతీయ స్థాయిలో ప్రజలముందు ఒక ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని పెట్టగలిగింది. స్వదేశీ పారిశ్రామిక అభివృద్ధి, పారిశ్రామిక స్వయం ప్రతిపత్తి, వ్యవసాయంలో ప్రజాహిత సంస్కరణలు, ఈ ఉమ్మడి ప్రోగ్రామ్‌లో భాగం. నాయకత్వంలో ఉన్న జేవీపీ కొన్నికీలక పరిశ్రమల జాతీయీకరణని (ముఖ్యంగా విద్యుత్, చమురు వంటి ప్రజావసరాలు), బడా వర్గాలపై పన్ను పెంచే ప్రగతిశీలక ఆదాయ పన్ను విధానాన్ని, విద్య, వైద్యం ఇతర సామాజిక వ్యయాలకి బడ్జెట్ పెంపును, కూటమి విధానాలుగా ముందుకు తెచ్చింది.

అధ్యక్ష భవనంలో మార్క్సిస్టు పార్టీ

జనవిముక్తి పెరుమన (పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్)1965లో ఒక మార్క్సిస్ట్-లెనినిస్టు పార్టీగా ఏర్పడింది. రోహన విజెవీర (1943-1989) నాయకత్వాన జేవీపీ, శ్రీలంకలో పాతుకుపోయిన సంస్థాగత ప్రజా వ్యతిరేక వ్యవస్థపై రెండుమార్లు (1971లో ఒకసారి, 1987 నుండి 1989 మధ్య మరోసారి) సాయుధ తెరుగుబాటు లేవనెత్తింది. ఈ రెండు తిరుగుబాట్లని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేసింది. ఈ క్రమంలో వేలాదిమంది చనిపోయారు. ప్రభుత్వం రోహన విజెవీరను కూడా హత్య చేసింది. ఈ ఘటనల తరువాత 1989లో జేవీపీ, సాయుధ పోరాటం విరమించుకుని ఎన్నికల ప్రజా రాజకీయాలలో పాలుపంచుకోవాలని నిర్ణయించింది. అప్పటి తిరుగుబాటులో ఎందరో ముఖ్య నాయకులని కోల్పోయిన స్థితిలో, సోమవంశ అమెరసింఘే (1943-2016) నాయకత్వాన జేవీపీ పార్టీ పునర్నిర్మాణం చేపట్టింది. అమెరసింఘే తరువాత దిసనాయకె నాయకత్వం లో జేవీపీ ఎన్నికల బరిలో ఉంటూ, ప్రజల్లోకి తమ సోషలిస్టు ఆర్థిక, సామాజిక విధానాలని తీసుకుపోతూ పార్లమెంటరీ రాజకీయ పార్టీగా ఎదిగింది. దిసనాయకే జేవీపీ నాయకత్వంలోని రెండోతరం వారు. పార్టీ సంస్థాగత నాయకత్వం కన్నా ఓ ఇరవై ఏళ్ల తర్వాత వచ్చిన ఈ ప్రస్తుత నాయకత్వం, గత ముప్పై ఏళ్లుగా తమ రాజకీయాలని, సిద్ధాంతాలని శ్రీలంక శ్రామిక, రైతు, పేద వర్గాలలోకి తీసుకువెళ్లడంలో ముందడుగు వేశారు.

కానీ మరోవైపు శ్రీలంక తమిళుల పట్ల జేవీపీ విధానంపై అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అంతర్యుద్ధ సమయంలో, ఎల్టీటీఈ సాయుధ వేర్పాటువాదం పట్ల అవలంబించవలసిన విధానం పట్ల జేవీపీ వైఖరి సింహళ జాతీయవాదులకి దగ్గరగా ఉంది. తమిళుల విషయంపై, కొందరు జేవీపీ నాయకులు అప్పుడప్పుడు బయల్పరిచే సింహళ మితవాద ధోరణిపై ప్రశ్నలు ఇంకా ఉన్నాయి.మితిమీరిన లంచగొండితనం, అవినీతి, కుటుంబ రాజకీయాలతో విసుగెత్తిన ప్రజలకి దిసనాయకే వ్యక్తిగత నిజాయితీ, నిరాడంబరతకి ఆకర్షితులయ్యారనడంలో సందేహం లేదు. తమిళ, సింహళ స్పర్థలు ఇకపై రాజకీయాలను శాసించకూడదన్న ఆయన వైఖరి కూడా ప్రజాంగీకారం పొందింది.

గత కొన్నేళ్లుగా పార్టీ పునర్నిర్మాణం జరిగిన క్రమంలో, ఒంటరిపోరు సరిపోదన్న అవగాహనతో జేవీపీ 2019లో మరో 21 వామ పక్ష, మధ్యేవాద వామపక్ష పార్టీలతో కలిసి ఉమ్మడి ప్రోగ్రామ్‌తో అవినీతికి, ఐఎమ్ఎఫ్ షరతులకి, ప్రజా బడ్జెట్ కోతలకి వ్యతిరేకంగా నేషనల్ పీపుల్స్ పవర్ కూటమి నిర్మాణానికై పనిచేసింది. ఎన్‌పిపి కూటమిలోని పార్టీలకి లోతైన సైద్ధాంతిక విబేధాలు ఉన్నప్పటికీ ఈ ఉమ్మడి ప్రోగ్రామ్ అధారంగా జాతీయ స్థాయిలో ప్రజలముందు ఒక ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని పెట్టగలిగింది. స్వదేశీ పారిశ్రామిక అభివృద్ధి, పారిశ్రామిక స్వయం ప్రతిపత్తి, వ్యవసాయంలో ప్రజాహిత సంస్కరణలు, ఈ ఉమ్మడి ప్రోగ్రామ్‌లో భాగం. నాయకత్వంలో ఉన్న జేవీపీ కొన్నికీలక పరిశ్రమల జాతీయీకరణని (ముఖ్యంగా విద్యుత్, చమురు వంటి ప్రజావసరాలు), బడా వర్గాలపై పన్ను పెంచే ప్రగతిశీలక ఆదాయ పన్ను విధానాన్ని, విద్య, వైద్యం ఇతర సామాజిక వ్యయాలకి బడ్జెట్ పెంపును, కూటమి విధానాలుగా ముందుకు తెచ్చింది. అంతర్జాతీయ విత్త పెట్టుబడి ఎగదోసిన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న శ్రీలంక ప్రజలని, కూటమి ఆర్థిక స్వయం ప్రతిపత్తి ఎజెండా గట్టిగా ఆకర్షించింది. దశాబ్దాలుగా జాతి వైషమ్యాలతో సతమతమవుతున్న శ్రీలంక సమాజానికి ఈ అజెండా ఒక కొత్త దారి చూపింది.

ఈ అజెండాని ఎంతవరకు కార్యరూపంలో పెట్టి, శ్రీలంక పారిశ్రామిక స్వయంప్రతిపత్తికి పునాదులు వేయడంలో సఫలం చెందు తారో ముమ్ముందు చూడాల్సిన విషయం. ఏది ఏమైనా, దిసనాయకే గెలుపుతో మార్పుకోసం ఎదురుచూస్తున్న నేటితరానికి ఓ కొత్త ఊపిరి దొరికింది. తమ శ్రీలంక ఐఎమ్ఎఫ్ కబంధ హస్తాలనుండి బయటపడి, సమగ్ర జాతీయ అభివృద్ధి వైపు అడుగులు వేయగలదన్న కొత్త ఆశ ఈ రోజు యువతలో చిగురించింది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | సెప్టెంబర్ 26, 2024 | www.navatelangana.com

శౌర్య యాత్రకు స్వాగత ఏర్పాట్లు

నవతెలంగాణ-వైరా



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రకు రకరకాల వక్రీకరణలను ఖండిస్తూ రాష్ట్రంలో సాగుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర దళానికి ఘన స్వాగతం పలికేందుకు వైరా మండలంలో పోరాట కేంద్రాలుగా ఉన్న గండగలపాడు, విప్పలమడక, ఖానాపురం గ్రామాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం సాయుధ పోరాట యోధులు, ఖమ్మం మాజీ శాసన సభ్యులు మంచికంటి రాంకిషన్‌రావు స్వగ్రామం కాసిరాజుగూడెం, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ తొలి చైర్మన్ చిర్రావూరి లక్ష్మి నరసయ్యల త్యాగాలను వివరించేందుకు ఖమ్మం నగరంలోనూ దళం ప్రదర్శనలు ఇవ్వనుంది అదే రోజు వైరా మండలం గండగలపాడు, వైరా, 27వ తేదీన ఖానాపురం, విప్పలమడక గ్రామాలలో ప్రజానాట్యమండలి కళాకారుల దళం వీర తెలంగాణ నాటకాన్ని ప్రదర్శిస్తారు. తెలంగాణా సమాజాన్ని గందరగోళ పరుస్తున్న, లేక మతపరమైన పోరాటంగా చిత్రీకరించ జూస్తున్న పాలక వర్గాల కుట్రలను తిప్పికొట్టేందుకు, పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనన్న వాస్తవిక సత్యాన్ని వివరించేందుకు సాగుతున్న శౌర్య యాత్ర బుధవారం ఖమ్మం జిల్లాలో ప్రవేశించి తొలి ప్రదర్శన ముదిగొండ మండలం గోకినపల్లిలో ఆ గ్రామానికి చెందిన మృతవీరులను, త్యాగధనుల చరిత్రలను కళారూపాల రూపంలో వివరిస్తుంది. వైరా మండలం గండగలపాడు గ్రామంలో సాయుధ రైతాంగ పోరాట యోధులు, మధిర మాజీ శాసన సభ్యులు బోడేపూడి వెంకటేశ్వరరావు, సాయుధ దళ కమాండర్ కాజా రాధాకృష్ణ మూర్తి, దేవభక్తిని నర్సయ్య, గుజ్జా బసవయ్య, కిన్నెర రాఘవులు తదితరులు సాగించిన పోరాట స్ఫూర్తిని, త్యాగాలను నాయకుల ఉపన్యాసాల ద్వారా, కళారూపాల ద్వారా వివరించనుంది. ఖానాపురం గ్రామంలో అమరవీరులు వేగుంట జోగయ్య, వేగుంట నారాయణ, కుక్కా వెంకటేశ్వర్లు, తుపాకీ గుళ్ల దెబ్బలు తిని జీవితాంతం కమ్యూనిస్టుగా జీవించిన తోట పెద్ద గోపయ్య వీరగాథలను వివరించనుంది. విప్పలమడక గ్రామానికి చెందిన తెలంగాణ పోరాట యోధుడు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ఆయన సహచర్యంలో గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమ పురోగతికి, అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కు బలమైన పునాదులు వేసిన పారుపల్లి తులిశమ్మ, తుమ్మల కనకరత్నం, యెదుళ్ల వెంకటేశ్వర్లు తదితరులను యాది చేసుకుంటూ నిర్వహించే కార్యక్రమంలో ఉపన్యాసాలతో పాటు, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం బాంచన్ నీ కాల్మొక్కుతా అన్న మట్టి మనుషులే బంధూకులు చేతబట్టి నైజాంను, దొరలను తరిమిన వీరగాధను ప్రదర్శించనున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ పోరాటాన్ని నేటి తరానికి తెలియజెప్పటం, ముస్లిం రాజు అయిన నిజాం నిరంకుశత్వంపై హిందువుల పోరాటంగా, దానికి విమోచన అని పేరు పెట్టి అధికారిక ఉత్సవాలు జరపాలన్న బీజేపీ కుటిల రాజకీయ నీతిని ఎండగట్టే కళాప్రదర్శనలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.



మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-కొణిజర్ల

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఐద్వా మండల ఎనిమిదవ మహాసభ తాళ్లపల్లి విజయ అధ్యక్షతన మండల కేంద్రంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ కొండపల్లి దుర్గాదేవి నగర్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ దేశంలో మహిళలపై నిత్యం అత్యాచారాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వాలు మారిన మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు పరిష్కారం చూపటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలను వంటింటికే పరిమితం చేయాలని మను ధర్మ శాస్త్రాన్ని ఆచరించాలని బిజెపి ప్రయత్నిస్తుందని ఆమె మండిపడ్డారు. ఇంట బయట మహిళలు శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు.. మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తీసుకురావటం ద్వారా మహిళలు రాజకీయంగా ముందుకు వచ్చినప్పుడే మహిళా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు చట్టం చేయాలని, మహిళల రక్షణకు ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రతి మహిళకి 2,500 ప్రతినెలా ఇస్తానని హామీ ఇచ్చారని, సామాజిక పెన్షన్లు 2000 నుంచి 4000 పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. డ్వాక్రా గ్రూపులకు రుణాలు మాఫీ చేయాలని, కొత్తవి తిరిగి అందించడం ద్వారా స్వయం పోషకంగా మహిళల అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం 5వేల కోట్లు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించి మహిళలందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. పెళ్లి చేసుకున్న దంపతులకు కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన ఆమెని అమలు చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ప్రభుత్వం వైద్య సాయం అందించాలన్నారు. మహాసభ ప్రారంభంలో సంఘం జెండాను సంఘం సీనియర్ నాయకురాలు పద్మ తిలకం జెండా ఆవిష్కరించి అమరవీరులందరికీ జోహార్లు అర్పించారు. ఈ మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బండి పద్మ, వైరా డివిజన్ ఇంచార్జ్ మెరుగు రమణ మాట్లాడారు. అనంతరం మండల ఐద్వా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బొలమాల సరోజినీ (చిన్నగోపతి,) తాత పద్మ (కాచారాం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 13 మందితో కమిటీ ఎన్నుకున్నారు. ఈ మహాసభలో చింతనిప్పు హేమలత, కావూరి నాగమణి, కొరెల్లి సరోజిని, బి.ఉమాదేవి, చింతపల్లి నాగమణి, డి.వెంకట్ నర్సమ్మ డి.నాగమణి, కాంపల్లి అప్పమ్మ, జోగు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పూర్తిస్థాయిలో సర్వే చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు

నవతెలంగాణ-బోనకల్



ఇటీవల కురిసిన అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంటలను పూర్తి స్థాయిలో సర్వే చేసి రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, రాపల్లి, చిన్నబీరవల్లి గ్రామాలలో ఆయా గ్రామాల పార్టీ గ్రామ శాఖల మహాసభలు బుధవారం జరిగాయి. పార్టీ చిన్నబీరవల్లి గ్రామ శాఖ మహాసభ సంద్ర వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని చంద్ర వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సిపిఎం బ్రాహ్మణపల్లి గ్రామ శాఖ మహాసభ సీనియర్ నాయకులు పారుపల్లి పూర్ణచంద్రరావు, సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. మందడపు శ్రీనివాసరావు అధ్యక్షతన మహాసభ జరిగింది. సిపిఎం రాపల్లి గ్రామ శాఖ మహాసభ కొనకళ్ళ హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం జరిగిన మహాసభలలో చింతలచెరువు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పత్తి పంట ప్రధానంగా దెబ్బతిన్నది అన్నారు. కానీ ప్రభుత్వం అరకొరగా మాత్రమే సర్వే చేసి పంట నష్ట సర్వేను నమోదు చేసిందన్నారు. ఈ వర్షాల వల్ల పత్తి, పూత పిందె దాదాపు 80 శాతం వరకు రాలిపోయిందన్నారు. సాగర్ కాలువలకు వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. పాలేరు వద్ద కాలవగండ్లు పూడ్చటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రైతులను కాపాడవలసిన ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తామని ప్రకటించి నేడు రుణమాఫీ విషయంపై రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం చిన్నబీరవల్లి గ్రామ శాఖ కార్యదర్శిగా దొంతిబోయిన రమేష్, బ్రాహ్మణపల్లి శాఖ కార్యదర్శిగా చావా వెంకటేశ్వరరావు, రాపల్లి శాఖ కార్యదర్శి గంగదేవుల నరసింహారావు ఎన్నికయ్యారు ఈ మహాసభలలో పార్టీ మండల కమిటీ సభ్యులు కిలారి సురేష్, బంధం శ్రీనివాసరావు, మందడపు శ్రీనివాస్‌రావు, డిసిసిబి డైరెక్టర్ పెరబత్తిని ప్రసాద్, ఆయా గ్రామాల సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ నాయకుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఖమ్మంరూరల్ మండల కమిటీ సభ్యుడు ఎల్.జానయ్య ఇటీవల మృతి చెందాడు. జానయ్య కుటుంబాన్ని కేవిపియస్, సీపీఎం నాయకులు బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు ఐదు వేల రూపాయలు, కేవిపియస్ ఖమ్మం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం జానయ్య కుటుంబానికి అందజేశారు. పార్టీ ఎల్లప్పుడు జానయ్య కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు, నాయకులు రంజాన్ పాషా, పగిడిపల్లి ఉపేందర్, వెంకట్రావు, కేవిపియస్ మండల నాయకులు పాపిట్ల సత్యనారాయణ, నూకల బాలరాజు, ఐ రామనాథం, ఎల్.సైదులు, నవీన్, వృకాస నాయకులు మునిగంటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలి

- నీటి ప్రవాహక దారులను ఆక్రమిస్తే విపత్తులు తప్పవు
- డ్రెయిన్ నిర్మాణం సమయంలో సరైన లెవెల్స్ మెయింటైన్ చేయాలి
- రోడ్ల విస్తరణ వల్ల భూములు మంచి ధర పలుకుతాయి
- రూ.50 లక్షలతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

నవతెలంగాణ-ఖమ్మం



మనం చేపట్టే ప్రతి అభివృద్ధి పని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి 16వ డివిజన్, శ్రీరాంనగర్, రోడ్ నెం. 13లో రూ.50 లక్షలతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని అధికారులు, ప్రజా ప్రతినిధులు మనసు పెట్టి పూర్తి చేయాలని తెలిపారు. డ్రెయిన్స్ నిర్మాణ సమయంలో సరైన లెవెల్స్ పకడ్బందీగా మెయింటైన్ చేయాలని, ప్రతి చుక్కనీరు ఎక్కడికి వెళ్లాలో అక్కడికే వెళ్ళేలా చూడాలని అన్నారు. కార్పొరేటర్లు దగ్గర ఉండి పని చేయించాలని, నాణ్యతను పరిశీలించాలని మంత్రి తెలిపారు. రోడ్డు నిర్మాణం, విస్తరణల వల్ల ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, మన భూములకు మంచి ధరలు వస్తాయని అన్నారు. నాలాలను, రోడ్లను ఆక్రమించడం వల్ల చాలా నష్టాలు కలుగుతాయని మంత్రి పేర్కొన్నారు. పట్టణంలో గ్రీనరీ పెంచేందుకు విద్యుత్ తీగలకు దూరంగా మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. వానలు లేని కాలంలో ప్రతి భూమి సాధారణంగా కనిపిస్తుందని, నీటి ప్రవాహక దారులను ఆక్రమించడం వల్ల వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో చాలా ఇబ్బందులకు గురి కావాల్సి ఉంటుందని అన్నారు. వెలుగుమట్ల పార్క్ అభివృద్ధి చేస్తామని, ఏవైనా ఆక్రమణలు తొలగించాల్సిన పరిస్థితులలో పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలం మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, స్థానిక కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, ఖమ్మంఅర్బన్ తహసీల్దార్ సిహెచ్.స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేకుండా జనరిక్ మందులు పంపిణీ

- ఖమ్మం మెడికల్ హబ్‌లో బివికె, వివిసి మరో ముందడుగు
- త్వరలో ప్రజలకు మరింత చేరువగా మెడికల్ సేవలు
- వివిసీ, బీవీకే ట్రస్టుల చైర్మెన్‌లు వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా, నాణ్యత కలిగిన జనరిక్ మెడిసిన్స్‌ను పంపిణీ చేయడానికి మాత్రమే మెడికల్ షాపు ప్రారంభం చేస్తున్నట్లు వివిసి, బివికె ట్రస్టుల చైర్మన్‌లు వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వివిసి (వంకాయలపాటి వీరయ్య చౌదరి) బివికె (బోడేపూడి వెంకటేశ్వరరావు కేంద్రం) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం వైరారోడ్ డాక్టర్ సత్యనారాయణ హాస్పిటల్ కాంప్లెక్స్‌లో నూతన జనరిక్ మందుల షాపును వంకాయలపాటి ద్రౌపది, రాజేంద్రప్రసాద్, నున్నా నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షణ కోసం, శరీరంపై ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా, లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకు, నాణ్యత కలిగిన ముందులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జనరిక్ మందుల షాపు ప్రారంభం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇరువురు ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేశామని, కరోనా సమయంలో



పలువురు చనిపోయినపుడు వారి కుటుంబ సభ్యులు కూడా అంత్యక్రియలకు వెనకాడితే తమ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వరద బాధితులకు సహాయం చేయడంలో, ఆపద సమయంలో ప్రజలకు నిజాయితీగా, చిత్తశుద్ధితో సేవా కార్యక్రమాలు పలు నిర్వహించామని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో తాగునీరు సమస్య వచ్చినప్పుడు పెద్ద ఎత్తున వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. పేద ప్రజలు, మధ్యతరగతి ప్రజలు ఉండే ప్రాంతాల్లో అనేక మెడికల్ క్యాంపులు పెట్టి లక్షలు విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. బివికె, వివిసి ఆధ్వర్యంలో త్వరలో ఖమ్మం నగరంలో పేద, మధ్యతరగతి ప్రజలకు పూర్తి స్థాయిలో మరింతగా నిరంతరం వైద్య సేవలు కొనసాగించడం కోసం ఒక కార్యక్రమం తీసుకోబోతున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు వైద్యం సేవలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేందర్, బాబ్జి, సీపీఐ(ఎం) నాయకులు నాయకులు వై.శ్రీనివాసురావు, బోడపట్ల సుదర్శన్, ఎం.సుబ్బారావు, మాదినేని రమేష్, ఎంఎ జబ్బర్, పి.ఝాన్సీ, వాసిరెడ్డి వీరభద్రం, శివనారాయణ, బండారు యాకయ్య, మీరా సాహెబ్, ఆర్.ప్రకాష్, రమేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నేలకొండపల్లి

అక్టోబర్ 4వ తేదీన మండల కేంద్రంలోని సిపిఐ(ఎం) కార్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, స్వయం సమృద్ధి కోసం చేపట్టిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం గుడవర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలను కూడా విస్తతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే స్థానిక ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 22 నెలలుగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ ఇతర సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వంద రూపాయలకే బీపీ షుగర్ మందులను పంపిణీ చేస్తూ ప్రజల అభిమానాన్ని పొందుతున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన, ఆదరణ లభిస్తుందన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఆరోగ్యం అత్యంత ఖరీదై పోయిందన్నారు. పేదలకు ఆరోగ్య సమస్య వస్తే కార్పొరేట్ వైద్యం పేరుతో ఆసుపత్రి యాజమాన్యం, డాక్టర్లు దండుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో పేదలకు ఆరోగ్య విషయంలో, ఆర్థిక విషయాల్లో అండగా నిలిచేందుకు, భరోసా కల్పించేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే సదుద్దేశంతో వృత్తి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో యువతకు కూడా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని కూడా ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, గుడివర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.వి.రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, రాసాల కనకయ్య, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, దేగల వెంకటేశ్వరరావు, మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, శీలం అప్పారావు, గుగులోతు వీరు, బలుసు ప్రమీల, పెద్దిరాజు నరసయ్య పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ ఎస్సైలు

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో 9 నెలల పాటు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 547 మంది ఎస్ఐ అభ్యర్థులను తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ వివిధ జిల్లాలకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్‌కు కేటాయించిన ఐదుగురు ఎస్ఐ (సివిల్) బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆరు గ్యారంటీల అమల్లో పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన ఆరు గ్యారంటీలు అమల్లో పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. బుధవారం వైరా మండలం రెబ్బావరంలో జరిగిన సిపిఐ(ఎం) గ్రామ మహాసభలు ప్రారంభం సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు వ్యవసాయ కూలీలకు అందించే 12 వేల రూపాయలు పథకం, గృహ నిర్మాణ పథకం, వితంతువులు, వృద్ధులు, వికలాంగులు పించన్లు మంజూరు, పెంపుదల ఊసేలేదన్నారు. డబుల్ బెడ్ రూం నిర్మాణంలో దళిత బంధు, ఇతర సంక్షేమ పథకాలు అమలు వైఫల్యం వల్లే కేసిఆర్ ప్రభుత్వంను ఎన్నికల్లో ఓడించారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదలకు ప్రాదాన్యత ఇవ్వడం లేదని అన్నారు. రైతు భరోసా ఖరీఫ్ సీజన్ ముగింపుకు కూడా విడుదల చేయలేదని అన్నారు. రైతులు ఉద్యమం మేరకు రుణమాఫీ పూర్తి చేశామని ప్రకటించిన ప్రభుత్వం, నాలుగు, ఐదు విడతల్లో మిగిలిన రుణమాఫీ చేస్తామని ప్రకటించడం జరిగిందని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి కొనసాగించాలని



పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభంగా పార్టీ జెండాను సాయినేని వెంకటేశ్వరరావు ఎగురవేసినారు. రెబ్బవరం శాఖ కార్యదర్శిగా తాళ్లూరు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు తూము సుధాకర్, నాయకులు శివాజీ, సాయినేని వెంకటేశ్వరావు, హుస్సేన్బి, సైదాబీ, సూర్య ప్రకాష్, రామకృష్ణ, సతీష్, గుత్తా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- వరద బాధితులకు న్యాయం చేయాలి
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-మధిర

మధిర తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వరద బాధితులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తొండలగోపరం గ్రామపంచాయతీలో నీట మునిగిన ఇండ్లకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం కొంతమంది అర్హుల పేర్లతో పాటు నష్టపోయిన బాధితులకి కాకుండా కొందరి పెద్దమనుషులనూ లబ్ధిదారులుగా ఎంపిక చేయటం దురదృష్టకరమని అన్నారు. పూర్తి అర్హత ఉండి నష్టపోయిన వారిని సక్రమైన పద్ధతిలో ఎంపిక చేయకుండా అవినీతికి పాల్పడ్డ అధికారులపై చట్ట పరమైన చర్య తీసుకోవాలని, నిజమైన లబ్ధిదారులకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయని పక్షంలో మండల వ్యాప్తంగా వరద బాధితులను సమీకరించి తాసిల్దార్ కార్యాలయం ముట్టడి చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దాల ప్రభాకర్ తెలప్రోలు, రాధాకృష్ణ, పల్లేకంటి విల్సన్, సుధాకర్, కొండయ్య శివ, శ్రీను, గోపి, వరద బాధితులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ- నేలకొండపల్లి

నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఖమ్మంకు చెందిన చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు బుధవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల ఖమ్మంలో సంభవించిన మున్నేరు వరద సమయంలో బాధితులకు ఆహార ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, నోట్ పుస్తకాలు అందజేశామన్నారు. కరోనా సమయంలో సంస్థ తరపున ప్రతిభావంతులైన పేద ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆన్లైన్ బోధన కోసం ల్యాప్టాప్స్ అందజేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ తరగతులు, మారుమూల గిరిజన ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా సోలార్ లైట్స్ పంపిణీ చేశామన్నారు. మహిళా సాధికారతలో భాగంగా మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు పంపిణీ చేశామన్నారు. వీధి వ్యాపారులకు తోపుడుబండ్లు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ వారి సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. చేతన ఫౌండేషన్ ద్వారా విద్యాపరంగా సహాయం చేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజావత్ వెంగళరావు అన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, పాఠశాలల ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మెరుగైన వసతులతో వైద్య సేవలు అందించాలి

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వసతులతో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటి, ఏఎంసి, జనరల్ వార్డులు, వెయిటింగ్ హాల్, ఐసియూ, ఫార్మసి, మెడికల్ రూమ్‌లు, ఓపి, ఫిజియోథెరపి రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల సహాయకులతో కలెక్టర్ మాట్లాడి, అందుతున్న సేవలు, ఆస్పత్రిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ కళావతి బాయి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది, ఉన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

అభివృద్ధి పనులకు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నేషనల్ హైవే ప్రాజెక్ట్ భూ సేకరణ బాధితులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. చింతకాని మండలం కోదుమూరు, బస్వాపురం, కొణిజర్ల మండలం మునగాల, గోపతి, వైరా మండలం సిరిపురం, సోమవరం, పెనుబల్లి మండలం చింతగూడెం గ్రామాల్లో సేకరణ చేసే భూ యజమానులతో కలెక్టర్ నష్టపరిహారంపై చర్చించారు. భూ సేకరణకు అవార్డ్ పాస్ చేసినట్లు, ప్రభుత్వ పరిధిలో ఉన్న మెరుగైన పరిహారం అందజేయుటకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. హైవేతో మిగులు భూములకు డిమాండ్ పెరుగుతుందని కలెక్టర్ అన్నారు.

ఫైనాన్స్‌దారుల వేధింపులు..!

- వారి బారి నుండి మమ్ముల్ని కాపాడండి మహా ప్రభో
- వరద బాధితుల ఆవేదన
- నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతున్న గిరిగిరిదారులు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలో ఇటీవల ముంచెత్తిన భారీ వరదలకు మేము సర్వం కోల్పోయామని ఈ గిరి గిరి ఫైనాన్స్ వ్యాపారస్తులు రోజూ సాయంత్రం కాగానే మమ్మల్ని పీకు తింటున్నారని, వారి నుండి తమను కాపాడాలని మున్నేరు వరదలు తాకిడికి గురైన వరద బాధితులు బోరున విలపిస్తున్నారు. ఈ వరదలకు తాము సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని, ఎంత చెప్పినా వినకుండా నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతూ మమ్మల్ని మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంచెం మా పరిస్థితి బాగున్నాక మీ అప్పు తీరుస్తామని ఎంత బతిమిలాడినా వినిపించుకోకుండా ప్రవర్తిస్తున్నారు. వీరి బారీ నుండి తమను ఆదుకోవాలని, లేకపోతే వీరితో మాటలు పడలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని పోలీసు వారు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రకాశ్ నగర్ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మున్నేరు వరదల తాకిడికి ప్రకాశ్ నగర్ బ్రిడ్జిపై పక్కకు ఒరిగిన విషయం తెలిసిందే. దీంతో రాకపోకలు నిలిపివేసారు. ఇలా రాకపోకలు నిలిపియడం వల్ల ముదిగొండ, వెంకటగిరి ప్రాంతాల నించి ఖమ్మం నగరంలోకి వచ్చే ప్రయాణికులతో పాటు బ్రిడ్జికి అవతల వైపు ఉన్న గ్యాస్ గోదాం వద్ద నివసిస్తున్న కాలనీ వాసులకి సైతం ఖమ్మంలోకి రావాలంటే చుట్టూ తిరిగి వచ్చే పరిస్థితులు నెలకొంది. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఉన్నతాధికారులు, సీపీ సునీల్ దత్ ఆదేశాలమేరకు అడిషనల్ సిపి, అడిషినల్ డిసిపి ప్రసాదరావ్, సిబ్బంది కలసి ద్విచక్రవాహదారులకు మాత్రమే రాకపోకలకు అనుమతి కల్పించారు.

వరద ప్రాంతాల్లో ఉచిత హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని కవిరాజ్ నగర్ 11వ డివిజన్‌లో శ్రీ సాయిబాబా గుడి పక్కన మండపంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ వారిచే ఉచిత హెల్త్ క్యాంపు, ఖమ్మం శరత్ మ్యాక్స్ విజన్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వరదల కారణంగా అనారోగ్య సమస్యల దృష్టిలో ఉంచుకొని కవిరాజు నగర్ వాస్తవ్యులు బి.లక్ష్మీకాంత్, సిద్దు ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య క్యాంపును నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపు నందు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో వరదలకు గురైన ఈ ప్రాంత ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడకుండా ఉండటానికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడి చైర్మెన్ కీసర పద్మా రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఫరీక్ ఖాద్రి, డి.చైతన్య యశోద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ వర్షిత మరియు వైద్య సిబ్బంది, శరత్ మ్యాక్సీ విజిల్ నుండి డాక్టర్ సింధు, విక్రం సింగ్, శ్రీకాంత్, బి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర రెడ్డికి మంత్రి తుమ్మల నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని ముద్దునూరు గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ ఎర్రమల వెంకటేశ్వర రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మృతదేహాన్ని బుధవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దొండేటి వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వరద బాధితుల సహాయార్థం శ్రీ చైతన్య విద్యా సంస్థలు భారీ విరాళం

- చైర్మెన్ మల్లంపాటి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరదల విలయతాండవాన్ని చూసి చలించి పోయిన తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్ డైరెక్టర్ విద్య వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి 25 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలకు అత్యుత్తమ విద్యను అందించడమే కాకుండా మానవతా దృక్పథంలో సామాజిక బాధ్యతలలో శ్రీ చైతన్య సంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని చైర్మన్ శ్రీధర్ తెలిపారు. అంతేకాకుండా గత ఆదివారం విద్యాసంస్థలలో పనిచేస్తున్న వరదలలో నష్టపోయిన ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులకు మరియు విద్యార్థుల కుటుంబాలకు 10 లక్షల ఆర్థిక సహాయంతో పాటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం కూడా చేశామని ఆయన తెలిపారు. సామాన్య దృక్పథంతో ఈ భారీ విరాళాన్ని అందించిన శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ ను ముఖ్యమంత్రి అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సామాజికవేత్త యువ నాయకుడు తుమ్మల యుగేందర్, డైరెక్టర్ రవితేజ, పాఠశాల డిజిఎం చేతన్ మాధూర్ తదితరులు ఉన్నారు.

దంసలాపురం వరద బాధితులకు లయన్స్ చేయూత

- నిత్యావసరాల వస్తువుల కిట్లు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



మున్నేరు వరద ముంపు బాధితులను ఆదుకోవడంలో లయన్స్ క్లబ్ ఎంతో కృషి చేసింది. బాధితులకు పంపిణీ చేయడంలో నిత్యం ఒక అడుగు ముందే ఉంటుంది. సెప్టెంబర్ 1న ఖమ్మం పట్టణంలో సంభవించిన మున్నేరు వరద ముంపు నాటి నుండి నేటి వరకు బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అండగా నిలిచింది. క్లబ్ 320 ఈ ద్వారా ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ నుండి వచ్చిన 125 బియ్యం బస్తాలతో పాటు నిత్యావసర సరుకుల కిట్లను బుధవారం 16వ డివిజన్ ధంసలాపురం ప్రాంతంలోని మున్నేరు వరదముంపు బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరామ్, కోశాధికారి ఆర్తి గోవిందరావు, రీజినల్ చైర్మన్ డిపిసి రావు, కొంకిమల్ల విశ్వేశ్వరరావు, మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, జనార్ధన్ రావు, కురివెళ్ల లక్ష్మీనారాయణ, పసుమర్తి సాంబశివరావు, దుర్గా నాగేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నగరంలోని స్థానిక జడ్పీ సెంటర్ నందు ఉన్న రీ హబ్ బుద్ధ రిహాబిలిటేషన్ సెంటర్ నందు బీజేపీ నాయకులు గోంగూర వెంకటేశ్వర్లు(జీవీ) దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం దీన్ దయాల్ సేవలను ఆయన స్మరించుకున్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వీరి బాటలోనే నడుస్తున్నారని మనందరం కూడా ఆయన చూపిన బాటలో నడవాలని ఆయన అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | సెప్టెంబర్ 26, 2024 | www.navatelangana.com

శ్రీవారి హుండీ ఆదాయం రూ.29.51 లక్షలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్య క్షేత్రమైన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీల ఆదాయం 29 లక్షల 51 వేల 447 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 91 రో జుల కాలానికి గాను భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు అని తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఖమ్మం సహాయ కమిషనర్ వీరస్వామి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ ఉప్పల శ్రీరా మచంద్రమూర్తి, సూపర్డెంట్ విజయకుమారి, మధిర సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులు కోల్పోయిన సర్టిఫికెట్ల జారీకి చర్యలు

- సర్టిఫికెట్ జారీ కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

నవతెలంగాణ-ఖమ్మం

వరద బాధితులు కోల్పోయిన వివిధ రకాల సర్టిఫికెట్ల జారీకి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బతిన ఇండ్లలో వరద బాధితులు కోల్పోయిన సర్టిఫికెట్ల జారీకి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వరదల కారణంగా కోల్పోయిన సర్టిఫికెట్ల జారీ కోసం జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇండ్ల వద్ద నిర్వహించిన సర్వే ఆధారంగా ఇప్పటి వరకు దాదాపు పదవ తరగతి సర్టిఫికెట్ల కోసం 680, ఇంటర్ 454, డిగ్రీ/బీటెక్ సంబంధించి 94, పీజీ 47, పాస్ పోర్ట్ కొరకు 29 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అదే విధంగా రెవెన్యూ కి సంబంధించి ఆదాయ సర్టిఫికెట్లు 269, కుల ధ్రువీకరణ పత్రాలు 376,



నివాస ధ్రువీకరణ పత్రాలు 189, ఓబిసి సర్టిఫికెట్లు 77, పాస్ పుస్తకాలు 88, ఆధార్ కార్డు 388, రేషన్ కార్డు 182 కోల్పోయినట్లు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. విద్యా సర్టిఫికెట్లకు సంబంధించి విద్యార్థి పేరు, చిరునామా, పాసైన సంవత్సర వివరాలు విద్యా శాఖకు జిల్లా యంత్రాంగం ద్వారా ప్రతిపాదనలు పంపి సర్టిఫికెట్ల జారీ చేయిస్తామని అన్నారు. పాస్ పోర్ట్ అధికారులతో కూడా మాట్లాడి వాటిని జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రెవెన్యూ సంబంధిత సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాబోయే రెండు, మూడు వారాలలో పూర్తి స్థాయిలో ప్రజలందరికీ వారికి సంబంధించిన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పూర్తి చేసే దిశగా అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 237 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ లో శిక్షణ అందించేందుకు వారానికి 3 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, దీనికోసం 120 మంది మాస్టర్లను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రతి బుధవారం జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందిస్తున్నారని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ టీచర్స్ మీటింగ్ పకడ్బందీగా జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థుల హాజరు, పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహణను కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. జిల్లాలోని 50 పాఠశాలల్లో ముందస్తుగా ఇంగ్లీష్ ల్యాబ్ లను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో దశల వారీగా జిల్లా వ్యాప్తంగా ఈ ల్యాబ్ లను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం మీ సేవా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

వరదలో ధ్రువపత్రాలు కోల్పోయిన వారికి మళ్ళీ తిరిగి ఉచితంగా ధ్రువపత్రాలు అందించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు వరద బాధితుల కోసం మండల పరిధిలోని రాజీవ్ గృహ కల్ప ప్రాంతంలో మీ సేవా కేంద్రాన్ని తహసీల్దార్ రాంప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఆదాయ, కులం, నివాస, ఆధార్ వంటి ధ్రువపత్రాలు కోల్పోయిన వరద బాధితులు మీ సేవా కేంద్రంలో ఉచితంగా దరఖాస్తు చేసుకొని ధ్రువ పత్రాలు మళ్ళీ వెంటనే పొందాలని తహసీల్దార్ సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ధ్రువపత్రాలు అందజేశారు. వరదముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమిష్టిగా విద్యా ప్రమాణాలు పెంచుదాం

- ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన నివేదత

నవతెలంగాణ-కల్లూరు




మండలంలో అన్ని పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ పత్తిపాటి నివేదిత అన్నారు. బుధవారం కల్లూరు మండల విద్యాశాఖ ఎంఈఓగా ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పత్తిపాటి నివేదిత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని యుటిఎఫ్ మండల కమిటీ కార్యదర్శి కే.విజయ్ కుమార్, కోశాధికారి వేముల శ్రీనివాస్, పిఆర్టియు మండల కమిటీ కార్యదర్శి చాంద్ సాహెబ్, బాలాజీ నాయక్, టిపిటిఎఫ్ నాయకులు మేడరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు ఎంఈఓకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని కోరారు.

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల గోడ పత్రికలు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన దివ్య క్షేత్రం స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు ప్రతి సంవత్సరం అత్యంత వైభోవపేతంగా నిర్వహించబడుతున్న శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు ఈ సంవత్సరం కూడా అక్టోబర్ నెల 3 తేదీ నుండి 12 తేదీ వరకు నిర్వహించ బడుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్రావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను గోడ పత్రికలను బుధవారం దేవాదాయ - ధర్మాదాయ శాఖ ఖమ్మం సహాయ కమిషనర్ వీరస్వామి, ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్రావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు ఉప్పల మురళీమోహన్ శర్మ, ఆలయ పర్యవేక్షకులు విజయకుమారి, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



ఏచూరి స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ముందుకెళ్లాలి

- ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ
- నిరంతర స్ఫూర్తి ఏచూరి బొంతు రాంబాబు
- పరిశోధనలకు శరీరాన్ని అప్పగించిన మహోన్నతుడు ఏచూరి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం

ఏచూరి స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ముందుకెళ్లాలని ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఖమ్మంలోని ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూపిజిసి కళాశాలలో సంస్మరణ సభను జిల్లా ఉపాధ్యక్షులు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుండే ఎంతో ధైర్యంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దానికోసం కృషి చేశారని, ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అందరూ ఏకమై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఏచూరి దేశంలో ఉన్నటువంటి విద్యార్థి లోకానికి, రాజకీయాలకు నిరంతర స్ఫూర్తిని దేశంలో పేద మధ్యతరగతి కార్మిక వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన ఎనలేని కృషి చేశారని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే అధ్యయనం పోరాటం నినాదంతో నాటి దేశ ప్రధానిని సైతం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎదిరించి నిలిచినటువంటి మహోన్నతమైన వ్యక్తి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని అన్నారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులుగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దానికోసం విద్యార్థి దశలో పనిచేశారని,



అంతేకాకుండా తాను చనిపోయాక కూడా పరిశోధనల కోసం తన శరీరాన్ని కూడా త్యాగం చేసినటువంటి మహోన్నతమైన వ్యక్తి ఏచూరి అన్నారు. ఆయన స్ఫూర్తితో నేడు విద్యారంగంలో వచ్చే సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి లోకం ఎస్ఎఫ్ఐతో కలిసి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, లెక్చరర్ వీరన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, మల్లూర్, సాయి, రమ్య, సుశీల, అలేఖ్య మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో...! ఆర్థిక అభ్యున్నతి సాధ్యం...!!

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- 'హోప్' సౌజన్యంతో 100మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి

మహిళలు సాధికారత సాధించడం ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థిక అభ్యున్నతి దిశగా ముందుకు సాగుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాలకు చెందిన 100మంది పేద వర్గాలకు చెందిన మహిళలకు హోప్ మినిస్ట్రీస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్లను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ చేతుల మీదుగా ఆ సంస్థ బాధ్యులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి కుటుంబ బాధ్యతతో పాటు ఆర్థిక బాధ్యతలను కూడా భుజాన వేసుకొని ఇంటికి దీపం ఇల్లాలు నానుడిని నిజం చేస్తూ ముందుకు



సాగుతున్నారన్నారు. ఆ దిశగా ప్రతి మహిళ స్వయం సాధికారత సాధించడం ద్వారా ఆయా కుటుంబాల జీవన పయనం ఆనందమయంగా సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ శామ్యూల్ గెడ్డంను, సంస్థ సేవా కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులు అభినందించారు. కరుణాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నకేశవరావు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నేను అనగా శ్రీమతి కుమ్మరి సవిత, తండ్రి:గురుమూర్తి, భర్త విష్ణు, వయస్సు: 40 సం.లు, వృత్తి : గృహిణి, నివాసం : ఇంటి నెం 6-3-365/1(న్యూ నెం. 15-13-365/1), బ్యాంక్ కాలనీ, ఖానాపురంహవేలి, ఖమ్మం నగరం & అర్బన్ మండలం, ఖమ్మం జిల్లా తేది. 18-09-2024 న ఇంటి దగ్గర నుండి జిల్లా పరిషత్ వద్ద గల జిరాక్స్ సెంటర్ వద్దకు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గం మధ్య లో కవర్ జారిపోయినది. నా పేరున గల విస్తీర్ణం: 584.42 చ.గ. ఖాళీ స్థలం ఖమ్మం రెవెన్యూ జిల్లా, రఘునాథపాలెం రెవెన్యూ మండలం, వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ ఏరియాలో వి. వెంకటాయపాలెం రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్లు 236/అ, 236/ఆ & 236/ఈ మించుమలై, ప్లాట్ నెంబరు 4, విస్తీర్ణం: 325-43 చ.గజములు. ప్లాటు నెంబరు 5 24 విస్తీర్ణం: 36-77 చ. గజములు, ప్లాటు నెంబరు 6 పార్ట్, విస్తీర్ణం: 22-22 చ. గజములు, ప్లాటు నెంబరు 7, విస్తీర్ణము : 200-00 చ. గజములు వెరశి మొత్తం ఏకఖండముగా గల విస్తీర్ణం : 584-42 చ. గజములు యొక్క ఒరిజినల్ గిఫ్ట్ డీడ్ 3368/2022, తేది: 11.05.2022 గలది మరియు లింక్ డాక్యుమెంట్స్ నెం 1296/2021, తేది: 19.02.2021 & 424/2021, తేది: 16.01.2021 గా లింక్ డాక్యుమెంట్స్ లు, మార్గం మధ్యలో ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్స్ మరియు లింక్ డాక్యుమెంట్స్ లు కలిగిన బ్యాగు పోయినది. తిరిగి ఎంత వెతికినను కనిపించలేదు. కావున ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన అడ్రస్కు అందజేయగలరు. లేదా ఈ క్రింద సెల్ నెంబర్కు తెలియజేయగలరు.
సెల్ : 9963768262

డాక్యుమెంట్స్ పోయినవి

నేను అనగా శ్రీ గుమ్మలపల్లి వెంకటరమణ, తండ్రి:జగన్నాథం, వయస్సు: 46 సం.లు, వృత్తి : ఉద్యోగం, నివాసం : ఇంటి నెం 16-5-67/1/బి/ఎ/1/ఎ/1, శ్రీ శ్రీ సర్కిల్ ఏరియా శ్రీ నగర్ కాలనీ, ఖమ్మం నగరం & అర్బన్ మండలం,ఖమ్మం జిల్లా తేది. 11-03-2023 న ఇంటి దగ్గర [illegible] ఇంట్లో అద్దెకి ఉంటున్నాను నుండి జిల్లా పరిషత్ వద్ద గల జిరాక్స్ సెంటర్ వద్దకు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గం మధ్య లో కవర్ జారిపోయినది. నా పేరున గల విస్తీర్ణం: 402-77 చ.గ. ఖాళీ స్థలం ఖమ్మం జిల్లా అశ్వరావుపేట రిజిస్ట్రార్, ఖమ్మం రూరల్ సబ్-రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని, ఖమ్మం రెవెన్యూ జిల్లా, చింతకాని రెవెన్యూ మండలం, వందనం గ్రామ పంచాయతీ ఏరియాలో వందనం రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్లు 121/అ మించుమలై, ప్లాట్ నెంబరు 10, విస్తీర్ణం: 402-77 చ.గజములు యొక్క ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం. 9134/2018, తేది: 08.11.2018 గలది మరియు లింక్ డాక్యుమెంట్స్ నెం 1621/2013, తేది: 16.03.2013, 2692/2011, తేది: 30.08.2011 మరియు 1125/2010, తేది 05.05.2010 గా లింక్ డాక్యుమెంట్స్ లు, మార్గం మధ్యలో ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్స్ మరియు లింక్ డాక్యుమెంట్స్ లు కలిగిన బ్యాగు పోయినది. తిరిగి ఎంత వెతికినను కనిపించలేదు. కావున ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన అడ్రస్కు అందజేయగలరు. లేదా ఈ క్రింద సెల్ నెంబర్కు తెలియజేయగలరు.
సెల్ : 9866803529

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE AT KHAMMAM
I.A. NO. 02/2023
IN
O.S. NO. 152/2017

Between :
Mandadapu Sai Kumar Reddy
...Petitioner/ Plaintiff
AND
Rayapudi Usha Rani & 2 others
....Respondents / Defendants

NOTICE

To,
Respondent/ Defendant No.3
Mandadapu Narasimha Reddy, S/o. Venkata Reddy, Age : 46 yrs, Occ : Agriculture, R/o. Plot No. 88, Road No. 17, Sri Ram Hills, Khammam City and District.

Please take notice that in the above Hon'ble court, the Petitioner /Plaintiff has filed the above petition / Suit against you for Restoration under order IX Rule 9 of C.P.C : That the above case is posted for your appearance on **30-09-2024 at 10.30 AM.** As such you may appear personally or through your counsel without fail, otherwise the Hon'ble court will pass appropriate orders in your absence.

// By order of the Hon'ble court//

SK. LATHEEF
MD. PARVEZ
R.N. Swamy
Khammam Advocates, Khammam
Dt. 25-9-2024 Cell : 9700683404

సాగునీరు వస్తుంది.. ఆందోళన వద్దు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

నవతెలంగాణ-కల్లూరు

సాగునీరు రాలేదని, పంటలు ఎండిపోతున్నాయని అధైర్య పడకండి ఈ సంవత్సరమే మంచి దిగుబడిలు వస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని రంగాపురం గ్రామంలో వెంకటేశ్వర రెడ్డి మృతి చెందడంతో రంగాపురం వెళుతున్న సందర్భంగా మంత్రి చెన్నూరు మీదగా వస్తున్నారని తెలుసుకొని రైతులు ప్రజలు చెన్నూరు సెంటర్లో వేచి ఉండటంతో వారిని చూసి మంత్రి కారు ఆపి ప్రజలతో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు సాగునీరు లేక పంటలు ఎండిపోయాయని అనే మంత్రి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన మంత్రి గతం కంటే ఈ ఏడాది ఎక్కువ దిగుబడి వస్తుందని, కాకపోతే నన్ను అడగండి అంటూ చలోక్తి విసిరారు. మీరిచ్చిన ఆశీర్వాదం వల్లే మళ్లీ మంత్రి అయ్యానని, ప్రతి నిమిషం మీ సేవకే అంకితం చేస్తున్నామని ఈ సందర్భంగా ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. మంత్రితోపాటు కల్లూరు మండలం నాయకులు పసుమర్తి చందర్రావు తదితరులు ఉన్నారు.



గిరిజనులకు కరెంటు మోటరు, బోరు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-పెనుబల్లి

కొత్తలంక పల్లి, సుందరయ్య కాలనీ, బ్రహ్మలకుంట, గిరిజనులకు బ్యాంకు లోన్ ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శన నిర్వహించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అన్నపూర్ణకు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు మాట్లాడుతూ.. పేద గిరిజనులకు పంటలు పండించుకోవడం కోసం, తక్షణమే కరెంటు మోటార్, బోరు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, బ్యాంకుల నుండి రుణాన్ని తక్షణమే మంజూరు చేయాలని, పేద గిరిజనులైన నాయక పోడు, లంబాడీ కుటుంబాలను ఆదుకోవాలని, ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలను మంజూరు చేయాలని, తెలియజేశారు. సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మాట్లాడుతూ, పేద గిరిజనులు అనేక సంవత్సరాలుగా అటవీ ప్రాంతంలో అటవీ భూములను సాగు చేసుకుంటున్నారని, గత ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చింది. పంట పండించుకోవడానికి సౌకర్యాలు కల్పించే దానిలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, మండల కమిటీ సభ్యులు గుడిమెట్ల బాబు, మిట్టపల్లి నాగమణి, రాజినేని మంగమ్మ, పాల్గొన్నారు.

ఎంఈఓగా రమణయ్య బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ముదిగొండ



ముదిగొండ విద్యాశాఖ అధికారిగా (ఎంఈఓ) మండల నోడల్ ఆఫీసర్, పమ్మి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న డి.రమణయ్య ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమకం అయ్యారు. బుధవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్చార్జి ఎంఈఓగా పనిచేసిన శ్యాంసన్ చింతకాని మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సత్తుపల్లి విద్యాశాఖ అధికారిగా రాజేశ్వరరావు

- అభినందనలు తెలిపిన టీఎస్‌యూటీఎఫ్, పీఆర్టీయూ, టీపీటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారిగా (ఎంఈవో) నక్కా రాజేశ్వరరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన 1996 నుంచి 2005 వరకు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. 2005 నుంచి వేంసూరు, సత్తుపల్లి మండలాల్లో గత 20 యేండ్లుగా హెచ్‌ఎంగా, ప్రస్తుతం గెజిటెడ్ హెచ్‌ఎంగా, కాంప్లెక్సు చైర్మెన్‌గా ఉద్యోగ నిర్వహణలో ఉన్న రాజేశ్వరరావుకు ఎంఈవోగా పోస్టింగ్ ఇస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ నుంచి ఉత్తర్వులను విడుదల చేశారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వరరావును యూటీఎఫ్, పీఆర్టీయూ, టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకులు ఆయన కార్యాలయంలో కలుసుకొని అభినందనలు తెలిపారు. ఎంఈవోను కలిసి అభినందనలు తెలిపిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు జీఎస్ఆర్ రమేశ్, జల్లిపల్లి మురళీమోహన్, కొక్కెరగడ్డ వెంకటేశ్వరరావు (కేవీ), బాల నాగేశ్వరరావు, కొప్పుల శ్రీనివాసరావు, మునగాల వెంకటేశ్వరరావు, పీఆర్టీయూ నాయకులు పి. సుధాకరరెడ్డి, ఎస్. మధుసూదనాచారి పాల్గొన్నారు.

సంగం వీరభద్రానికి మంత్రి తుమ్మల నివాళి

నవతెలంగాణ-కల్లూరు

మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బోడిమల్లె గ్రామనికి చెందిన సంగం వీరభద్రం ఇటీవల మృతి చెందగా బుధవారం వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, యనమల రాము, బోడిమల్లె గ్రామ కాంగ్రెస్ నాయకులు సంగం రామకృష్ణ, శీలం కృష్ణా రెడ్డి, జీనుగు భాస్కర్ రావు, అజ్మీరా భద్రు, తాళ్ళూరి భద్రయ్య, శీలం రాంభద్రారెడ్డి, అజ్మీర నంద, తదితర కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

కూసుమంచి ఎంఈవోగా వీరాస్వామి

నవతెలంగాణ -కూసుమంచి



మండల నూతన విద్యాశాఖ అధికారిగా కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఈవో తెలిపారు.

నేడు వీరనారి ఐలమ్మ జయంతి : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

వీరనారి ఐలమ్మ జయంతి గురువారం ఉదయం 9 గంటలకు పాత కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చౌక్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలంకరణ చేయడం జరుగుతుందని కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

28న జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారిణి ఎస్. మాధవి

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం, కొత్తగూడెం, నేలకొండపల్లి, హైదరాబాద్‌లలో ఉన్న వివిధ కంపెనీలలో ఉన్న 850 ఖాళీ ఉద్యోగాల భర్తీకి గాను ఈ నెల 28న ఉదయం 10 గంటల నుండి స్థానిక ఎస్.ఆర్. అండ్ బి.జీ.ఎన్.ఆర్. డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎస్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, అపోలో హెల్త్ కేర్, మెడ్ ప్లస్ ఫార్మసీ, హెటరో ల్యాబ్స్ లిమిటెడ్, మధుకాన్ షుగర్ అండ్ పవర్ లిమిటెడ్, సత్య మైక్రో క్యాపిటల్ లిమిటెడ్, ముత్తూట్ మనీ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ పే, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, టోపికో ఇన్సూరెన్స్ బ్రోకింగ్ (భారత్ హ్యుందాయ్), ఫ్యూచర్ ఐటి సొల్యూషన్స్, స్కినీడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ నిప్పో లైఫ్ ఇన్సూరెన్స్ ఫర్ ఉమెన్స్, ఫ్లిప్ కార్ట్, వికేర్, టీం లీజ్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

పంచాయతీ కార్మికులకు బీమా

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

రాజపురం గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్ర నందు పంచాయతీ కార్యదర్శి పాషా ఆధ్వర్యంలో బుధవారం యర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక సమక్షంలో పది గ్రామ పంచాయితీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి భీమా చేయించారు. పోస్టల్ డిపార్ట్మెంట్ వారితో వారికి భీమా పాలసీలు చేయించారు. ఈ కార్యక్రమానికి నర్సాపురం గ్రామ పంచాయతీ స్పెషల్ ఆ ఫీసర్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబ్బ హాజరు అయినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 143 మంది పంచాయితీ కార్మికులకు పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా బీమా పాలసీలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వాణి, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పసుమర్తి వెంకటేశ్వరావు, ఆశావర్కర్లు సుభద్ర, స్వరూప,పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-మణుగూరు



సమితి సింగారం పంచాయతీ పరిధిలో మణుగూరు జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ కాశ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిది అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్, మండలాభివృద్ధి అధికారి, పంచాయతీ ఈఈ, డీఈ, ఏఈ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పిరినాకి నవీన్, పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ సమ్మయ్య, అన్ని కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, మైనార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు దుర్గాభవాని, శృతి

నవతెలంగాణ-పినపాక

గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించే మల్టీపర్పస్ వర్కర్లు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్త నియమాలు పాటించాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు దుర్గా భవాని, జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శృతి తెలిపారు. బుధవారం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సెక్రటరీల సహకారంతో ఈ వైద్య పరీక్షలు నిర్వహించినట్లుగా తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేసినట్లుగా తెలియజేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ఆరోగ్య సమస్యలు ఉంటే నేరుగా గ్రామపంచాయతీ సెక్రటరీకి తెలియజేయాలని, తద్వారా వారికి మెరుగైన వైద్య చికిత్స అందించే విధంగా కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు సైతం ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, సెక్రటరీలు ఖాజా హుస్సేన్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, సందీప్, సాంబశివరావు, ఉపేందర్, ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, చంద్రకుమార్, నాగిని, జ్యోతి, పద్మ అరుణ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య అన్నారు. బుధవారం పర్ణశాల, రేగుబల్లి-1 కాంప్లెక్స్ పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారిలో శారీరక, మానసిక, వికలాంగత్వాన్ని గుర్తించి సంబంధిత రిపోర్టులను మండల విద్యా వనరుల కేంద్రంలో అందజేయాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షలను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఓ రామారావు, పర్ణశాల జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఏజే. ప్రభాకర్, ఐఈఆర్టీలు సతీష్, రాగిణి, ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లులు పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి

నవతెలంగాణ-చర్ల

ప్రతి ఒక్క తల్లి తమ తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించి వారికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని చర్ల మండల సిడిపిఓ చైతన్య పేర్కొన్నారు. బుధవారం పోషణ మాసోత్సములో భాగంగా మండల పరిధిలోని ఆదివాసి గ్రామమైన గోరుకొండ అంగన్వాడి కేంద్రంలో ఆదివాసీ మహిళలకు సామూహిక సీమంతాలు, అన్న ప్రసన్న వేడుకలు నిర్వహించారు. సిడిపిఓ చైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ ఆదిలక్ష్మి స్వరూప రాణి, జగదాంబ పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ నాగరాజు, తిప్పాపురం అంగన్వాడి టీచర్ సారక్క, గోరుకొండ అంగన్వాడి టీచర్ అన్నపూర్ణ, చలమల అంగన్వాడి టీచర్ శాంతమ్మ, ఏఎన్ఎం వీరమ్మ, గ్రామస్తులు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-టేకులపల్లి

మండల కేంద్రమైన టేకులపల్లిలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గంజాయి నిర్మూలన కోసం యువకులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఆధ్వర్యంలోనే వైద్యశాలలు అభివృద్ధి

నవతెలంగాణ-టేకులపల్లి

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాలలు అభివృద్ధికి నోచుకున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్ అభిప్రాయపడ్డారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జీ బానోతు హరిప్రియ ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాలను పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ కార్యక్రమంలోఅధికార ప్రతినిధి బానోతు కిషన్ నాయక్, ఉద్యమ నాయకులు కుమ్మరి కిరణ్, టిరవి, బానోతు రవి, బోడ రమేష్, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు, చెరువులు పరిశుభ్రంగా ఉంచుకోండి

- డీఎల్పీఓ సుధీర్ కుమార్

నవతెలంగాణ-పినపాక

పరిసరాలు, చెరువులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని డీఎల్పీఓ సుధీర్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి భూపాలపట్నం, పినపాక, సీతంపేట, దుగినేపల్లి, వెంకటరావుపేట జగ్గారం, సీతారాంపురం గ్రామపంచాయతీలను పరిశీలించారు. రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం మన బాధ్యత అని గుర్తు చేశారు. గ్రామపంచాయతీలో తయారుచేసే కంపోస్ట్ తయారీని పరిశీలించారు. సత్యనారాయణ స్వామి మొక్కలు థర్మకోల్ సీట్లపై నిలిపి ఉంచి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం చెరువుల్లో వదిలే కార్యక్రమాన్ని పరిశీలించారు. చెరువుల్లో నీరు నిలవ ఉన్న ప్రదేశాల్లో ఈ మొక్కలు వదలడం వల్ల నీరు పరిశుభ్రమవుతుందని తెలియజేశారు. 23 గ్రామ పంచాయతీల్లో ఉన్న చెరువుల పరిధిలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీలు, పాల్గొన్నారు.

ఎంఈఓగా ఆనంద్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



నూతన మండల విద్యాశాఖ అధికారిగా ఉండేటి ఆనంద్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉమ్మడి మండలానికి మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించిన సత్యనారాయణ బాదిలీలో బాగంగా పెనుబల్లి మండలానికి ట్రాన్సర్ కావడంతో ఆయన స్థానంలో యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ కుమార్ నూతనంగా మండల విద్యాశాఖ అధికారి బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-పినపాక

సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అన్నారు. బుధవారం ఈ.బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు శ్రీవిద్య జూనియర్ కళాశాల, రాధిక హై స్కూల్‌లో సైబర్ జాగ్రుకా దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూ డదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. అంతే కాకుండా గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా వస్తే ఆశ్రమం కలిగించవద్దని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు అమ్మే వారి సమాచారం ఉంటే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నిరోషా, వైస్ ప్రిన్సిపల్ రవి ప్రసాద్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాచలం అభివృద్ధి, కరకట్ట నిర్మాణానికి కృషి చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం అభివృద్ధికి కరకట్ట నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. రామాలయం ఏరియా గంగనమ్మ సిపిఐ(ఎం) శాఖ ప్రథమ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దక్షిణ అయోధ్యగా పిలవబడుతున్న భద్రాచలం అభివృద్ధికి, గోదావరి కరకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలన్నారు. భద్రాచలం అభివృద్ధి పట్ల గత పాలకులు చిన్నచూపు చూశారని, నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంతం పైన పట్టున్న మంత్రి తుమ్మల ప్రత్యేక శ్రద్ధ చూపి భద్రాచలం అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజనలోను జిల్లా విభజనలోను తీవ్రంగా నష్టపోయింది భద్రాచలం ప్రాంతమని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి తగిన నిధులు కేటాయించాలన్నారు. భద్రాచలంకు ఆనుకుని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ చూపాలని కోరారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిలో సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధుల కృషి మరువలేనిదని భవిష్యత్తులో భద్రాచలం సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభానికి ముందు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి. సంతోష్‌కుమార్, పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్, ఎస్‌డీ. ఫిరోజ్, పార్టీ సీనియర్ నాయకులు ధనకొండ రాఘవయ్య, ఆటో యూనియన్ నాయకులు కిలారి శ్రీనివాస్, డివైఎఫ్ఐ నాయకులు డి. సతీష్ బాబు, పార్టీ సభ్యులు ఆది, పోషాలు, గంగా, సుధా, భవాని, తదితరులు పాల్గొన్నారు. రామాలయం గంగానమ్మ సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా ఓలేటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అక్టోబర్ 26, 27 తేదీలలో పాత్రికేయులకు శిక్షణా తరగతులు



- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్‌రెడ్డి

నవతెలంగాణ-మణుగూరు

అక్టోబర్ 26, 27 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాత్రికేయులకు శిక్షణ తరగతులు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు క్యాంప్ కార్యాలయంలో శిక్షణ తరగతుల బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం మణుగూరు సబ్ డివిజన్ డిఎస్పి రవీందర్ రెడ్డి, సీఐ సతీష్ టీడబ్ల్యూజేఎఫ్ శిక్షణ తరగతులు విజయవంతం కావాలని కోరి వారు బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం అనిల్‌రెడ్డి మాట్లాడుతూ సమాచార సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మీడియా రంగంలో అనేక మార్పులు వచ్చిన సందర్భంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విస్తరించిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులలో నైపుణ్యత అవసరమన్నారు. మీడియా రంగంలోకి ఈతరం జర్నలిస్టులతో నైపుణ్యత మెలకువలు సమాచార సేకరణ పట్ల అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత జర్నలిస్టులకు వృత్తిని మెరుగుపరిచే ప్రక్రియలో భాగంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జర్నలిస్ట్ సంక్షేమం కోసం ముందుండి పోరాడుతుందని, జిల్లాలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అక్రిడేషన్ కార్డులతో పాటు హెల్త్ కార్డులివ్వాలని అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు చిర్రా శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, పినపాక నియోజక వర్గ అధ్యక్షుడు వెలమ రాజేందర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దామల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

- ఆయిల్ ఫాం అభివృద్ధి, సొసైటీ విస్తరణే లక్ష్యం
- అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరరెడ్డి, పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆయిల్ ఫాం సాగు పెంపుదల, సాగులో ఎదురయ్యే సమస్యలు పరిష్కారం, సాగు దారుల సంక్షేమం నేపధ్యంలో ఉనికిలోకి వచ్చిన తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ ఫాం గ్రోవర్స్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యలు రైతులకు పిలుపునిచ్చారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో బుధవారం సొసైటీ వార్షికోత్సవ వివరాలను తెలిపే పోస్టర్‌ను సీనియర్ రైతు దండు రామరాజు ఆవిష్కరించి మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యం స్ఫూర్తి తో ఆయన జన్మదినం అక్టోబర్ 2 నే ఈ సొసైటీ ఏర్పాటు అయిన క్రమంలో వచ్చే అక్టోబర్ 2 బుధవారం స్థానిక గిరిజన భవన్ లో నిర్వహించే ద్వితీయ వార్షికోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారని తెలిపారు. ఇందులోనే ఆయిల్ ఫాం సాగులో ఎదురయ్యే సమస్యలు, ఆయిల్ ఫాంకు కొత్తగా సోకే తెగుళ్ళు వాటికి పరిష్కారాలను నిపుణులైన శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు.ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెంపుదల తో పాటు తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ ఫాం గ్రోవర్స్ సొసైటీ సేవలను 31 జిల్లాల్లో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి కార్యాచరణ రూపొందిస్తామని కావున ప్రతీ సాగు దారుడు పార్టీలకు అతీతంగా హాజరు అయి ఈ ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి చెన్నారెడ్డి, తుమ్మ రాంబాబు, ఆళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-చర్ల



నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి దేశ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని విజయ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలన్నారు. విజయ కాలనీలో జరిగిన శాఖ మహాసభలో తొలుత పార్టీ జెండాను మండల నాయకురాలు పొడుపు కంటి సమ్మక్క ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. విజయ కాలనీ గ్రామ నిర్మాణం కోసం పార్టీ అత్యంత కృషి చేసిందన్నారు. సీపీఐ(ఎం) గత ప్రజా ప్రతినిధులైన కుంజ బుజ్జి, సున్నం రాజయ్య వారసత్వంలో భూ పోరాటం చేసి ఇండ్లు నిర్మించి ఈ కాలనీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి సీపీఐ(ఎం)కి శాఖ సభ్యులు పట్టుకొమ్మలా ఉన్నారని కానీ ఇక్కడ సమస్యలు ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్ట మీద ఇళ్లకు ప్రతి సందుకు కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని, పైపులైను లేనిచోట పైపులైన్ల పని పూర్తి చేయాలన్నారు. ఇండ్ల చుట్టూ ఇష్టానుసారం గ్రావెల్ తోలకాలు జరుపుతూ ఇండ్ల పునాదికి దెబ్బతీసే పరిస్థితి వస్తున్నదని, విజయ కాలనీ పరిధిలో ఇండ్ల స్థలాలు పరిధిలో కంకర నిలవలను తోలకలు చేయరాదని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ప్రభుత్వ పథకాల ముందడుగు వేయడం లేదని ఇది సరైన పద్ధతి కాదని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు సత్వరమే ఇవ్వాలని ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లను వారి స్థలాల్లో నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లపై ఇప్పటి వరకు నిర్దిష్టమైన ప్రకటన కూడా చేయకపోవడం శోచనీయమని, రుణమాఫీ కూడా అసంతృప్తిగా ఉన్నదని రైతులకు రైతుబంధు పైకము రైతుల ఖాతాలలో జమ చేయడం లేదని రైతుల పట్ల అత్యంత నిర్లక్ష్యం ఉన్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల పట్ల ఎన్నో హామీలు ఇచ్చిన అమలుకు నోచుకోవడం లేదని బీజేపీ ప్రజలను మరిచిందని కార్పొరేట్ వ్యక్తుల కనుసైగలో ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

పత్రికా విలేకరిపై దాడిని ఖండించండి

చర్ల మండలం పత్రికా విలేకరిపై గత మూడు రోజులుగా భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో వివిధ సమస్యలపై తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, బందెల చంటి, పొడుపుగంటి సమ్మక్క, వరదల వరలక్ష్మి, షారోను, నాగమణి, సూరమ్మ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా నాగయ్య బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-పినపాక



పినపాక మండల విద్యాధికారిగా ఈ.బయ్యారం పీజీహెచ్ఎం నాగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకు ఇంచార్జీ మండల విద్యాశాఖ అధికారిగా వీరస్వామి విధులు నిర్వహించారు. బుదవారం పినపాక మండల కేంద్రంలో గల మండల విద్యా వనరుల కేంద్రంలో నాగయ్య ఎంఈఓగా బాధ్యతలను స్వీకరించారు. మండలంలో నెలకొని ఉన్న పాఠశాలల స్థితిగతులపై పరిశీలించి మంచి విద్య బోధన అందించే విధంగా తన వంతు పాత్ర పోషిస్తానని నాగయ్య వివరించారు. విద్యాధికారిగా నియమితులైన నాగయ్యకు మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఎంఈఓకి సన్మానం

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలో 9 సంవత్సరాలు సుదీర్ఘకాలం టేకులపల్లి మండల శాఖాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన టి.రామ్ సింగ్‌ను, కొత్తగా టేకులపల్లి మండల విద్యాశాఖ శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.జగన్‌లను ఘనంగా పిఆర్‌టియు మండల శాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మోతిలాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, మండల ఉపాధ్యక్షులు రమణ, డి.పన్నాలాల్, మండల సిఆర్పిలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ప్రజా సమస్యలపై పని చేయాలి

- కొత్త కమిటీలను త్వరలో ప్రకటిస్తాం..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు

నవతెలంగాణ-మణుగూరు



బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గంలో బలంగా ఉండదని పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని, కమ్యూనిస్టు పార్టీల వల్లే ఆదర్శంగా పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. బుధవారం మణుగూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల, పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రానున్న రోజుల్లో పార్టీని మరింత బలపరిచి ప్రతి ఒక్క కార్యకర్త సైతం సైనికుల పనిచేయాలని తెలియజేశారు. అతి త్వరలో నూతన మణుగూరు మండల పట్టణ కమిటీలను, అన్ని అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సొసైటీ అధ్యక్షులు మణుగూరు సొసైటీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు వట్టం రాంబాబు కుంట లక్ష్మణ్, యాదగిరి గౌడ్, నవీన్, బొలిశెట్టి ముద్దంగుల కృష్ణ, కత్తి రాము, ఆవుల నరసింహారావు, టీబీజీకే ఉపాధ్యక్షులు నాగెల్లి వెంకట్, పాకాల రమాదేవి, దారావత్ రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్ పరిశుభ్రత కార్యక్రమం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయం ఆవరణలోని ఏటీబీ సెల్ ఆవరణలో బుధవారం స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాల్లో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డిజీయం పర్సనల్ జివి మోహన్‌రావు, డిజీఎం సివిల్ రవికుమార్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి కిశోర్, ఐఎన్‌టియు సివైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు పీ.పవన్

నవతెలంగాణ-జూలూరుపాడు



ఈ నెల 27న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద వేలాది మంది విద్యార్థులతో విద్యార్థి మహా గర్జనను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు పి. పవన్ తెలిపారు. బుధవారం మండలంలోని స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ముఖ్యకార్యకర్తల సమావేశం విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు కుప్పలుకుప్పలుగా ఉన్నాయని, విద్యాసంవత్సరం ప్రారంభమై 3 నెలలు గడిచిపోయిన తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకూ విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదన్నారు. గత 4 సంవత్సరాలుగా 8000 కోట్లకు పైగా స్కాలర్షిప్, ఫీజ్ రియాంబర్స్మెంట్ విద్యార్థులకు అందడంలేదన్నారు. ప్రభుత్వ వసతి గృహలలో చాలీచాలని మెస్ ఛార్జిలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. వసతి గృహలలో చదువుకునే విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచలన్నారు. సంక్షేమ వసతి గృహల్లో వర్షానికి కురుస్తున్న భవనాలకు మరమ్మత్తులు, భవనాలు లేని చోట సొంత భవనాలు నిర్మించాలన్నారు. గురుకులాల్లో సమయం మార్పుల కారణంగా విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం ఏర్పాటు చేయాలన్నారు. అన్నిచోట్ల రెగ్యులర్ ఎమ్ఈఓ లను, డి ఈ ఓ లను నియమించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర నాయకత్వం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 27న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద వేలాదిమంది విద్యార్థులతో భారీ ర్యాలీ, నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ భాగస్వామ్యమై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైస్కూల్ నాయకులు అనిల్, శివమని, అఖిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నర్సాపురం సెక్టార్‌లోని నర్సాపురం అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతాలతోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సిడిపిఓ నవ్య శ్రీ గర్భిణీలు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహారల గురించి తెలియజేశారు. అనంతరం అంగన్వాడి కార్యాలయ ఆవరణలో పండ్ల మొక్కలు, వివిధ రకాల పోషకాలను అందించే కూరగాయల మొక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి యాకూబ్, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

డ్రగ్స్ నివారణపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఏఎస్పీ అంకిత్ కుమార్ సంఖ్వర్ ఆదేశానుసారం ఎస్ఐలు విజయ లక్ష్మి, పీవీఎన్ రావుల ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడి వాటికి బానిసలుగా మారి వాటి కోసం దొంగతనాలకు పాలపడుతున్నారని, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వారిని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతీ ఒక్కరూ తమ పిల్లల ప్రవర్తనను పర్యవేక్షించాలని కోరారు. గంజాయి కి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసువారికి సమాచారం ఇవ్వగలన్నారు. సమాచారం తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కందుల ప్రసాద్, రవి, ప్రసాద్‌బాబు, యువతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-జూలూరుపాడు

ఎస్పీ ఉత్తర్వులు ప్రకారం డ్రగ్స్ నివారణపై మండల కేంద్రంలో పోలీస్ సిబ్బంది బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి శ్రీనివాస్‌రెడ్డి, బ్లూ కోర్టు సిబ్బంది వెంకట్, సురేష్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం మారాయిగూడెం 7వ శాఖా మహాసభ, భీమవరం 8 వ శాఖ మహాసభ మాజీ మండల కమిటీ సభ్యులు అమరజీవి సోయం వీరస్వామినగర్ మాజీ సర్పంచ్ సోయం భద్రయ్య ప్రాంగణంలో అపక సత్యం, అపక రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలలో సిపిఐ (ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్యలు మాట్లాడుతూ సిపిఐ(ఎం) కార్యకర్త, నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దుమ్ముగూడెం మండలంలో సిపిఐ (ఎం) పార్టీకి పూర్వ వైభవం తీసుకొని రావాలని అమరవీరుల స్ఫూర్తితో ఆందోళన పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు సోయం నాగమణి, మాజీ సర్పంచ్ తోడం తిరుపతిరావు, నూతన శాఖ కార్యదర్శిగా ఎన్నికైన కోడి వీరస్వామి, మారాయిగూడెం నూతన కార్యదర్శిగా ఎన్నికైన సున్నం వెంకటేశ్వర్లు, సోడే రాముడు, సోంది అర్జున్, సోయం ముత్తయ్య సోంది శివశంకర్, సున్నం సురేష్, వెంకటరమణ, మచ్చా పుల్లయ్య, సుబ్బయ్య, రాజు, భూపతి, సోడే వెంకటేశ్వర్లు, సోయం కామయ్య, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

'జేఎల్‌ఎం నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలి'

నవతెలంగాణ-పాల్వంచ

టిజిఎస్‌పిడిసిఎల్‌లో జేఎల్‌ఎం 2,200 పోస్టులకు నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని కేటీపీఎస్, టీవీఎస్ జేఏసీ చైర్మెన్ ఎం.నరసింహారెడ్డి, కన్వీనర్ తోట త్రినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం పాల్వంచలో జేఏసీ సమావేశం 15 35 కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ లేబర్‌గా ఉన్న మేము గత ప్రభుత్వంలో ఆర్టిజన్‌గా గుర్తించబడ్డాము. ఈ గవర్నమెంట్ లోనైనా ఆర్టిజన్స్‌కు కన్వర్షన్ చేసి జేఎల్‌ఎం పోస్టులలో భర్తీ చేయాలని యాజమాన్యాన్ని కోరారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 26న ధర్నా కార్యక్రమంకి ఆర్టిజన్స్ కార్మికులు హైదరాబాదులోని మింట్ కాంపౌండ్ టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ఆఫీస్ వద్దకు అధిక సంఖ్యలో పాల్గొని మన నిరసనను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మెన్‌బి. రాములు, ఎస్. రమేష్, కో కన్వీనర్స్ బి. మంగీలాల్, ఎస్.రజినిబాబు, మిగతా కమిటీ సభ్యులు, ఆర్టిజన్, కార్మికులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

- మానవత్వం చాటుకున్న చేయూత ట్రస్ట్

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీ బత్తులనగర్ గ్రామంలో గత మూడు రోజుల కిందట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో సోడీ వెంకటేష్ అనే గిరిజన నిరుపేదకు చెందిన పూరి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. దీంతో నిస్సహాయస్థితిలో ఉండగా బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్టు దృష్టికి రాగానే బుధవారం రేకులు ఇల్లు నిర్మాణానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మారు మూల గిరిజన ప్రాంతమైన బత్తులనగర్ గ్రామం కావడంతో అతనిది అతి నిరుపేద కుటుంబం కావటంతో మరికొంద దాతలు ముందుకు వస్తారని చేయూత ట్రస్ట్ ఆకాంక్షించారు. సర్వంకోల్పోయి కట్టుబట్టలతో నిలబడ్డ ఆ కుటుంబాన్ని ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇల్లు అందించాలని కోరారు. చేయూత ట్రస్టు ప్రధానంగా విద్య వైద్య రంగాలను ఎంచుకొని అతి నిరుపేద కుటుంబాలకు అండగా నిలబడుతూ మండలం కాకుండా ఇతర మండలాల్లో కూడా సహజ సహకారాలు అందిస్తూ ముందుకెళ్తుందని ట్రస్ట్ వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కైపు నాగిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, శనగా మల్లేశ్వరరావు, కామిరెడ్డి వెంకటరెడ్డి, బిజ్జం వెంకట రామిరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరావు, బాలు, చేతుల వాసు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులు తారసపడితే సమాచారం ఇవ్వాలి

- ఎస్సై ఈ.రతీష్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలో అపరిచితులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ ప్రజలను కోరారు. ఈ మేరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో.. బుధవారం మండలంలో పలు గ్రామాల్లో ఎస్సై ఈ.రతీష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రధాన రహదారి, వంతెనల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. మావోయిస్టుల వారోత్సవాలు ఈనెల 21 నుంచి వచ్చే అక్టోబర్ 20 వరకు జరుగుతున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా ప్రతి గ్రామాన్ని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. మావోయిస్టుల వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంఘ విద్రోహహక శక్తులకు ప్రజలెవరూ సహకరించ వద్దని హెచ్చరించారు. గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వారి సమాచారం స్థానిక పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసులకు సమాచారం అందించడానికి పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712682079 ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై గన్ మెన్ కె.ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలను పరిష్కరించాలి

- అధ్వాన్న స్థితిలో మరుగుదొడ్లు
- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి

నవతెలంగాణ- బూర్గంపాడు

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి సమస్యలను జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోలు పర్యవేక్షించి పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉన్న రోగులకు ప్రభుత్వం తరుపున అందించే భోజనం అందరికీ సరిపడా పెట్టడం లేదన్నారు. ముఖ్యంగా మరుగు దొడ్లు తలుపులు లేక సింకులు పగిలి పోయి అధ్వాన్న స్థితిలో దుర్గంధాన్ని వెదజల్లు తున్నాయని తెలిపారు. దుర్గంధాన్ని వెదజల్లుతున్న మరుగుదొడ్ల గది పక్కనే రోగులు చికిత్స తీసుకోవడం వారి దయనీయమైన పరిస్థితికి ప్రతిరూపం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల తరుపున ప్రజలకు మెరుగైన వైద్యం అం దే వరకు ప్రజల తరఫున పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయు అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు భూపల్లి నరసింహారావు, మైనారిటీ అధ్యక్షులు సాధిక్ పాషా, ఉపాధ్యక్షులు, గుల్ మొహమ్మద్, బొల్లు సాంబ శివరావు, కోమటిరెడ్డి రాజాశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ, బాణోత్ శ్రీను, కేవీ. రమణ, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు రాధిక స్కూల్ విద్యార్థులు

- అభినందించిన కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి

నవతెలంగాణ-పినపాక



మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాల నందు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడలలో రాధిక స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరిచారు. బుధవారం నిర్వాహకులు నలుగురు క్రీడాకారులను జిల్లా స్థాయి పాఠశాల క్రీడలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మొదటిసారి జిల్లా స్థాయి పాఠశాల క్రీడలకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. మునుముందు పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించి జిల్లా స్థాయికే కాకుండా రాష్ట్ర స్థాయికి వెళ్లే విధంగా కృషి చేస్తామని పాఠశాల క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు చింతకుంట జయసింహారెడ్డి, సంపత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ నిరోషా, పాఠశాల ప్రిన్సిపల్ సాజీమన్, పిఈటి మహేష్, ఉపాధ్యాయులు, జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఎంఈవోగా ప్రసాదరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట మండల విద్యాశాఖ అధికారిగా మామిళ్ళవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆ ఉత్తర్వులు అందుకున్న ప్రసాదరావు గురువారం విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి వాసి ప్రసాదరావు 2000 సంవత్సరంలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ మహబూబ్‌నగర్ జిల్లాలో, అనంతరం ఖమ్మం జిల్లా సత్తుపల్లి, ప్రస్తుతం అశ్వారావుపేట మండలం మామిళ్ళవారిగూడెంలో ప్రధానోపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

ఆయాలు లేక అవస్థలు



- టీచర్లకు అదనపు పని భారం
- పట్టించుకోని ఐసీడీఎస్ ఉన్నతాధికారులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

చిన్నారుల ఆలనా.. పాలనా చూడాల్సిన ఆయమ్మలు లేక పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. దీంతో పిల్లలకు ఆటపాటలతో పాటు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పనిభారంగా మారింది. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధి కారులు ఆ దిశగా చర్యలకు తీసుకోక పోవడంతో ఆయమ్మలు లేని అంగన్‌వాడీ కేంద్రాలు ఆలనా పాలనా లేని నిలయాలుగా మారాయనే చెప్పవచ్చు. దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పర్ణశాల, దుమ్ముగూడెం, ఆర్లగూడెం, మారాయిగూడెం, నర్సాపురం, ఏఎస్ఆర్ కాలనీ, భద్రాచలం సెక్టార్‌లు ఉన్నాయి. మొత్తం ఏడు సెక్టార్ల పరిధిలో 173 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా పర్ణశాల సెక్టార్ పరిధిలో ఎల్ఎన్ రావు పేట, పెద్ద బండిరేవు, ఎస్ కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్ పోస్టులతో పాటు 8 అంగన్‌వాడీ సెంటర్లకు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతోపాటు ఆర్లగూడెం సెక్టార్‌లో 15, దుమ్ముగూడెం సెక్టార్‌లో 15, నర్సాపురం సెక్టార్‌లో 7, ఏఎస్ఆర్ సెక్టార్‌లో 10 అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మారాయిగూడెం సెక్టార్ పరిధిలో మారాయిగూడెం, కొత్త నారాయణరావుపేట అంగన్‌వాడీ సెంటర్లకు టీచర్ పోస్టులతో పాటు 16 అంగన్‌వాడీ సెంటర్లకు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భద్రాచలం సెక్టార్ పరిధిలో అశోక్ నగర్ కొత్తవాడ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్ట్‌తో పాటు 12 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పని భారం

దుమ్ముగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొత్తం 7 సెక్టార్లలో 173 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 83 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయాలు లేరు. దీంతో ఆయాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పని భారం పడుతోంది. ప్రతిరోజు టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రం చేసుకోవడంతో పాటు చిన్నారులను ఇంటింటికి వెళ్లి తీసుకురావలసి వస్తుంది. దీంతోపాటు చిన్నారులకు ఆటపాటలతో పాటు, విద్యాబుద్ధులు నేర్పించడం, పోషకాహారాలు అందించడం వంటి అదనపు పనులతో అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పని భారంగా మారిందనే చెప్పవచ్చు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

దుమ్ముగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 83 ఆయా పోస్టులతో పాటు 6 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఖాళీగా ఉన్న ఆయమ్మ పోస్టులతో పాటు టీచర్ పోస్టులను భర్తీ చేయాలని చిన్నారుల తల్లి దండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై నవతెలంగాణ సిడిపిఓ నవ్య శ్రీని వివరణ కోరగా అశ్వారావుపేట ఐసిడిఎస్ ప్రాజెక్టుకు చెందిన కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు కోర్టును ఆశ్రయించడం వలన అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల నోటిఫికేషన్ రద్దు అయిందని, త్వరలో ఖాళీలు భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

- కలెక్టర్ జితేష్ వీ.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిశుభ్రతకు నిత్యం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని జిల్లా కలెక్టర్ డీఎంహెచ్ ఓ భాస్కర్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కార్మికులకు సూచించారు. కార్మికులంతా వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకొని అవసరమైన చికిత్సలు చేయించుకోవాలన్నారు. నిత్యం పారిశుధ్య చర్యల్లో నిమగ్నమయ్యే కార్మికులు ఆరోగ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ప్రజా సేవలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందని వారికి పలు సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రాధాన్యతను ఇవ్వనుందని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజా రోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మి కులు అందిస్తున్న సేవలను జిల్లా కలెక్టర్ కొనియాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పలువురు పారిశుధ్య కార్మికులను ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మున్సిపల్ కమిషనర్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కమ్యూనిజం పని అయిపోయింది అనే వారికి చెంపపెట్టు శ్రీలంక ఎన్నికల ఫలితం...



- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కమ్యూనిస్టుల పని అయిపోయిందని.. కమ్యూనిజానికి కాలం చెల్లిందని కారు కూతలు కూసే మత ఛాందసవాదులకు శ్రీలంక ఎన్నికల ఫలితాలు ఒక చెంపపెట్టు లాంటిదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం అశోక్ నగర్ శాఖ ఏడవ మహాసభ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమాజంలో ఆకలి బాధలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, సమస్యలు ఉన్నంతకాలం పోరాటాలు కొనసాగుతాయన్నారు. దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న మతోన్మాదులకు బుద్ధి చెప్పేది ఒక కమ్యూనిస్టు పార్టీ లేనని అన్నారు. రాష్ట్రంలో కూడా పోరాటాలను ప్రారంభించే సమయం ఆసన్నమైందని, ఎన్నికల అప్పుడు రేవంత్ ఇచ్చిన ఐదు గ్యారెంటీలపై పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అశోక్ నగర్ కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలను అధ్యయనం చేసి ఈ మహాసభల వేదికలో పోరాటం రూపొందించుకోవాలని ప్రజా సమస్యలపై పోరాటాలే ఎజెండాగా మహాసభలు నిర్మించాలని కోరారు. శాఖ నుండి ఆల్ ఇండియా వరకు సాగే మహాసభలలో భవిష్యత్తు ఉద్యమాలకు కావలసిన పలు తీర్మానాలను మహాసభలు ఆమోదిస్తున్నాయని, ఈ మహాసభలకు ప్రజల నుండి కూడా అపూర్వ స్పందన కలుగుతుందని మచ్చ స్పష్టం చేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్ అధ్యక్షత వహించగా మాజీ పార్లమెంట్ సభ్యులు బాబురావు పార్టీ జెండాను ఆవిష్కరించి ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ. నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట రామారావు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, డీ.సీతాలక్ష్మి, స్థానిక నాయకులు డీ.నతీష్ బాబు, పుణ్యవతి, తడికల కుమారి, గణపతి అమ్మ, సూరమ్మ, సావిత్రమ్మ, రాణి, వెంకటేశ్వర్లు, శివకుమారి, సీతమ్మ రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఆశా వర్కర్ల నిరవధిక విధుల బహిష్కరణ

నవతెలంగాణ-బూర్గంపాడు



ఆశావర్కర్లను వేధింపులకు గురి చేస్తున్న మోరంపల్లి బంజర పిహెచ్సి డాక్టర్, హెచ్‌ఈఓ, ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నేటి నుండి నుండి విధులు బహిష్కరించి పిహెచ్‌సి ముందు ఆందోళన నిర్వహించాలని మండల ఆశా వర్కర్లు నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు బుధవారం బంజరలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు బుచ్చమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మచారి పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లను డాక్టర్,హెచ్‌ఈఓ, ఏఎన్ఎం వేధిస్తున్న విషయంపై ఆగస్టు 29వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించామని, ఈ సందర్భంగా విచారణ జరిపి చర్యలు తీసు కుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.ం అండ్ హెచ్ హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. విచారణ జరిపినప్పటికీ నేటి వరకు వేధింపులకు పాల్పడిన డాక్టర్, హెచ్‌ఈఓ, ఏఎన్ఎం పై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 14వ తేదీనే విచారణ అధికారులు తమ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు ఇచ్చారని చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరొకవైపు వేధింపులు యదావిధిగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సరైన రీతులో స్పందించిన కారణంగా నే విధులు బహిష్క రించాలని నిర్ణయం తీసుకున్నా మని ఆశ వర్కర్ల నాయకురాలు బుచ్చమ్మ, తారా దేవిలు పేర్కొన్నారు. మమ్ములను వేదిస్తున్నవారిపై చర్యలు తీసుకునే వరకు విధులు నిర్వహించామని వారు తెలిపారు. ఆశావర్కర్ల పోరాటానికి అండగా వుంటామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నా యకులు శ్రీలత, కృష్ణ వేణి, భారతి, విజయ, నాగమణి తదితరులు పా ల్గొన్నారు.

మహారాజశ్రీ ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
ఒ.యస్. నెం. 55/2024

బిట్వీన్ :
దొండపాటి మహేంద్ర ....వాది
మరియు
బిల్ల లక్ష్మీ
ఇట్టి విషయం ఎవరికీ సంబంధించినచో వారికి .... ప్రతివాదులు

టు,
ఇట్టి విషయం ఎవరికీ సంబంధించినచో వారికి

పైన తెలిపిన వాది డిక్లరేషన్ దావా ఒ.యస్. నెం. 55/2024, ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నందు ప్రతివాది అయిన మీపై దాఖలు చేసియున్నారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు ది. 27-09-2024న వాయిదా కలదు. ఆ రోజు మీరు స్వయంగా గాని లేక మీ న్యాయవాది గారి ద్వారా గాని జవాబు తెలియ జేయుటకు పైన తెలిపిన న్యాయస్థానం నందు ఉ.గం 10.30 ని॥లకు హాజరు కాగలరు. లేనియెడల మీ పరోక్షంలో తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

//కోర్టు వారి అనుమతితో//
కీర్తి కార్తీక్
అడ్వకేట్, ఇల్లందు
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
సెల్ : 9949352234
ఇల్లందు
ది.25.09.2024

శ్రీయుత గౌరవ ఏజెంట్ గవర్నమెంట్ / జిల్లా కలెక్టర్ కోర్టు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
ఎం.ఒ.పి. నెం. 73/2023

బిట్వీన్ :
మల్లాడి అంజలిదేవి ....పిటిషనర్
మరియు
మల్లాడి శ్రీనివాసరావు, తండ్రి : వెంకటరావు, వయస్సు : 44 సం.లు, వృత్తి : ప్రైవేట్ ఉద్యోగి, నివాసం : గాయత్రి రెస్ట్ రూమ్స్, ఓల్డ్ పోస్టల్ క్వార్టర్స్ చప్టా దిగువ, భద్రాచలం గ్రామం & మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
...... రెస్పాండెంట్

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై వాది అయిన అంజలీదేవి విడాకుల కొరకు ప్రతివాది అయిన మల్లాడి శ్రీనివాసరావు పై గౌరవ కోర్టు నందు దావా వేసినారు. అట్టి దావా నందు ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు అట్టి అడ్రస్ నందు అందుబాటులో లేనందున కోర్టు వారి ఆదేశముల తో ఈ నోటీసు ఇవ్వటమైనది. కావున మీరు ది. 04-10-2024న 3.30 ని॥లకు పై గౌరవ కోర్టు నందు స్వయంగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా హాజరు కాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షంలో తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//
భద్రాచలం
ది.25.09.2024
టి. చైతన్య
అడ్వకేట్, భద్రాచలం

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, JUDGE AT KOTHAGUDEM.
E. P. No. 41 OF 2023
S.C.S 13 OF 2012

Between :
Kapil Chit (Kosta) Pvt. Ltd. Kothagudem Branch, Rep.byitsDivisionalManager,B.Ramakrishna,S/o.Yellaiah .... Decree Holder
AND
Mr. Peruka Sridhar Babu, & Others ... Judgment-Debtors

To,
JDR NO:2 Cheripalli Koteswara Rao, S/o. Komaraiah, Age: adult, Occ: General Mazdoor, PVK-5 Incline, SCCL,Kothagudem, R/o. Q.No. DB-429, Panjabgadda, Ramavaram, Kothagudem Mandal, Khammam District.

Whereas the above named Decree Holder has instituted a Execution Petition against you for recovery of money of Rs.15,314=00 You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 25-10-2024 at 10.30. AM failing which the matter will be decided exparte in accordance with law.

By order of the court.
M.S.R.RAVI CHNADRA
S.K.KHADAR
Advocate's
KOTHAGUDEM.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, JUDGE AT KOTHAGUDEM.
E. P. No. 121 OF 2023
OS.S 385 OF 2011

Between :
Kapil Chit (Kosta) Pvt. Ltd. Kothagudem Branch, Rep.byitsDivisionalManager,B.Ramakrishna,S/o.Yellaiah .... Decree Holder
AND
Mr. Barmavath Mohan, & Others ... Judgment-Debtors

To,
JDR NO:2 Banoth Ravi, S/o. Amar Singh, Age: Adult, Occ: SGT, PS, Veerabhadrapuram,(Prasent Working Place:SGT, Teacher, Garimellapadu Village, Chunchupalli Mandal, Bhadradri Kothagudem Dist. R/o. H.No. 7-51, Sarvaram, Kothagudem.
JDR No : 5.Barmavath Hari Singh, S/o. Harja, Age: Adult, Occ: Craft Teacher, Govt., AHS, Kinnerasani, (Prasent Working Place:SA Teacher(MA English), Govt., AHS School, Palvancha)R/o. Sujatha Nagar Road, Tekulabanjar Village, Chandrugonda Mandal.

Whereas the above named Decree Holder has instituted a Execution Petitionagainst you for recovery of money of Rs.4,38,025=00 You are hereby summonedto appear in the above court in person or by an advocate duly instructed on the 25-10-2024 at 10.30. AM failing which the matter will be decided exparte in accordance with law.

By order of the court.
M.S.R.RAVI CHNADRA
S.K.KHADAR
Advocate's
KOTHAGUDEM.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్వచ్ఛత హి సేవా

- పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నరసాపురం, దుమ్ముగూడెం, పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ ఆదేశాల ప్రకారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల మల్టీ పర్పస్ వర్కర్లకి హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. డిఎంహెచ్‌ఓ చైతన్య పరివేక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తెల్లం సీతమ్మ, వైద్యాధికారులు సుభాష్, పుల్లారెడ్డి, రేణుకరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. శేషు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన రూ.5వేల బోనస్ : సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు



స్థానిక సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సోలార్ కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి లాభాల బోనస్ వర్తింపజేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని టెక్నీషియన్‌లను రాత్రిపూట గస్తీ పనిచేయించొద్దని హెల్పర్లను మెయిన్ గేట్ వాచ్మెన్‌గా పని చేయించొద్దని ఆగస్టు నెల జీతం తక్షణం చెల్లించాలన్నారు. సెప్టెంబర్ నెల మొత్తం ఇండస్ట్రియల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సీఐటీయూ సర్వేలు, కార్మికుల సంతకాల సేకరణ చేస్తుందని, ఈనెల 28న సర్వేలో వచ్చిన సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, 30న హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో అందరూ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో సిఐటియు మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ, సోలార్ కార్మిక యూనియన్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా చౌదరిని కలిసిన గురజాల గోపి

నవతెలంగాణ-మణుగూరు



మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని బుధవారం హైద రాబాద్‌లోని ఆమె నివాసంలో కాంగ్రెస్ ఉమ్మడి ఖమ్మ జిల్లా సీనియర్ నాయకులు గురజాల గోపి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

నూతన ఎంఈఓగా పీవీ.రమణ

- గాడిలో పడనున్న మండల విద్యావ్యవస్థ

నవతెలంగాణ-చర్ల



స్థానిక విద్యావంతుడు, సమ న్వయం కలిగిన పరిటాల వెంకట రమణారావు నూతన మండల విద్యాశాఖ అధికారిగా నియ మితులయ్యారు. ఎన్నో ఏళ్లుగా స్థానికంగా ఉండని ఇన్చార్జి ఎంఈఓలతో విసిగి వేసగారిన మండల ప్రజలు స్థానిక గెజిటెడ్ ప్రధాన ప్రధానోపాధ్యాయుడికి ఉన్నతాధికారులు మండల విద్యాశాఖ అధికారి బాధ్యతలు అప్పగించడం శుభపరిణామం అని పలువురు విద్యా విశ్లేషకులు అంటున్నారు. అయితే నవతెలంగాణలో పలుమార్లు 'ప్రాథమిక విద్య ప్రశ్నార్థకం' 'ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి' 'విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యాయులు చేతుల్లోనే' అనే శీర్షికలు ప్రచురించడంతోపాటు ప్రత్యేక చొరవ తీసుకొని ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి మండల విద్యావ్యవస్థను తీసుకొని వెళ్లడంతో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు స్థానికుడైన పివి రమణను మండల విద్యాశాఖ అధికారిగా ఉన్నతాధికారులు నియమించడం జరిగింది. ఇక మండల విద్యాశాఖ దినదిన అభివృద్ధి చెందడం జరుగుతుందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు అభినందనలు తెలిపి శాలువాలు కప్పి సత్కరించారు. అభినందనలు తెలిపిన వారిలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు మురళీమోహన్, బాలకృష్ణ, పిఆర్‌టియు నాయకులు ఎస్ఎస్ఎస్ రవికుమార్, బత్తుల శ్రీనివాస్, చిట్టిబోతుల వేణు, ఎస్‌సిఆర్‌పి జయప్రకాష్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-చంద్రుగొండ

మండలంలోని ఎదుర్ల వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పట్టుకున్నామని ఎస్సై స్వప్న తెలిపారు. అయ్యన్నపాలెం మూలమలుపు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టుబడినట్టు చెప్పారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

చంద్రుగొండ ఎంఈఓగా సత్యనారాయణ

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రకొండ మండల విద్యాశాఖ అధికారిగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన సత్తెనపల్లి సత్యనారాయణ పెనుబల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన అధికారికి పలువురు ఉపాధ్యాయులు ఉద్యోగ సంఘాల బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

గీత కార్మికులకు శిక్షణ

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

గీత కార్మికులు ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి జారి పడితే ఏ ప్రమాదం జరగకుండా రక్షణ కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన కాటమయ్య రక్షణ కిట్లు చాలా ఉపయోగదాయకమని జిల్లా బీసీ సంక్షేమ వెల్ఫేర్ అధికారి ఇందిరా అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె ఆధ్వర్యంలో ఆళ్ళపల్లి, గుండాల మండలాల్లోని గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల ద్వారా కార్మికులకు శిక్షణ ఇచ్చారు. రక్షణ కిట్ ఎలా ఉపయోగించాలి, తాటిచెట్టుపైకి ఎక్కిన తరువాత ప్రమాదం జరిగితే ఎలా చేయాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు గీతాకార్మికుల పేర్లు నమోదు చేసుకుని త్వరలో కాటమయ్య కిట్లు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి, గుండాల మండలాల గీతా కార్మికులు తాళ్లపల్లి వెంకన్న, కోటేశ్వరరావు, శ్రావణ్, శేఖర్, వెంకటేశ్వర్లు, సతీష్, చంద్రశేఖర్, రవి, నవీన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి పీహెచ్సీని సందర్శించిన బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-ములకలపల్లి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపుమేరకు బుధవారం ములకలపల్లి పీహెచ్సీని బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.60కోట్లతో నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన వైద్య సిబ్బందిని నియమించకపోవడం, వైద్యులు అందుబాటులో లేకపోవడం, పర్మినెంట్ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, స్టాఫ్ నర్సులు లేనికారణంగా ఆసుపత్రికి వచ్చిన రోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం వల్ల సామాన్యులు విషజ్వరాల బారినపడి ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారన్నారు. వైద్యం కోసం వచ్చిన ఓ వృద్ధురాలిని ప్రశ్నించగా ఆసుపత్రి సిబ్బంది సిలైన్ బాటిల్ అందుబాటులో లేవని సమాధానం ఇచ్చారని వాపోయిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వైద్యసిబ్బందిని నియమించి మందులు సరిపడా అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం రోగులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, శెనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, సున్నం బాబూరావు, పుష్పాల చంద్రరావు. కోండ్రు సుందర్రావు, బైటి రాజేష్, పూరేటి నర్సింహారావు, సూరం పుల్లారావు, గూడపాటి సురేష్, తానం కష్ణ, పుష్పాల సాయి, ఊరబెద్ది వెంకన్న, వేముల సతీష్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దత్తత గ్రామం చెన్నాపురంలో అభివృద్ధికి శ్రీకారం

- రూ.1 కోటి 7 లక్షలతో పనులు ప్రారంభించిన జారే

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ నెల 19న గురువారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత తీసుకున్న కావడి గుండ్ల పంచాయతీ చెన్నాపురంలో బుధవారం అభివృద్ధి పనులకు స్వీకారం చుట్టారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా ఆయన ఈ శుభకార్యానికి నడుం బిగించారు. వారం రోజులు గడవకముందే ఒక కోటి ఏడు లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఈ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచటానికి ముందుగా పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు, డ్రయినేజీ నిర్మాణం చేపట్టటం జరుగుతుందని త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఇందిరమ్మ ఇండ్ల పథకం కూడా నియోజకవర్గంలో మొదటిసారిగా ఇక్కడి నుంచే ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీధర్, జూపల్లి రమేష్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజు, ఎమ్మార్వో కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, నంద్రు రమేష్, తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్, సత్యనారాయణ, మిండ హరిబాబు, సంకురావు, మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక కాంగ్రెస్ నాయకులు అభిమానులు కార్యకర్తలు గ్రామస్తులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరికీ విద్యా, వైద్యం ప్రాథమిక హక్కు

- మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అందరికీ విద్యా, వైద్యం ప్రాథమిక హక్కు అని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని వికాసం ప్రత్యేక బాలుల వసతి గృహంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భారత పౌరులందరికీ న్యాయంతో పాటు విద్యా వైద్యంపై సర్వహక్కులు ఉంటాయన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని భవిష్యత్తులో లీగల్ అథారిటీ సర్వీస్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చైతన్య వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రమణ, న్యాయవాదులు అవులూరి సత్యనారాయణ, సాధన పల్లి సతీష్, అంజలి, సంధ్యారాణి, కోర్టు సిబ్బంది రమేష్, కోర్ట్ కానిస్టేబుల్ వైద్య నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోకు యూటీఎఫ్ అభినందనలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించబోతున్న గర్ల్స్ హై స్కూల్ భద్రాచలం ప్రధానోపాధ్యాయురాలు తోటమల్ల రమను భద్రాచలం టిఎస్ యుటిఎఫ్ మండల కమిటీ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, మండల అధ్యక్షులు ఎం. రమేష్ చంద్, మండల సహా అధ్యక్షులు ఎస్ .ఆశాలత, సీనియర్ నాయకులు రాజా, శ్రీనివాస్, మండల కార్యదర్శి కె పుష్పలత, పాఠశాల ఉపాధ్యాయునిలు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

సిపిఐ(ఎం) వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు, ఎన్ఎస్పీ కాలువల భూములను గుర్తించి పేదలకు ఇండ్ల పట్టాలి ఇవ్వాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ ఎన్ఎస్పి సాగర్ కాలువ స్థలాన్ని ఇండ్లు లేని పేద ప్రజలు ఆక్రమించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్పీ కాలువ ప్రాంతాన్ని భూక్యా వీరభద్రం సందర్శించి మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్కరికీ కూడ ఇండ్ల స్థలాలు ఇవ్వాలేదని అన్నారు. దీర్ఘకాలికంగా వైరా మున్సిపాలిటీలో ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం వలన ఒకే ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందని, ప్రకృతి వనం పేరుతో ఎన్ఎస్పీ భూముల్లో మొక్కలు నాటి గాలికి వదిలేశారని, నాటిన మొక్కలను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పుడైనా వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి శాంతినగర్ లోని ఎన్ఎస్పి భూములను, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను సర్వే చేసి నిరుపేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో పేదలతో గుడిసెలు వేయించి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహన్ రావు, స్థానిక ప్రజలు గుగులోత్ దుర్గా భాను, తేజావత్ రవి, బాణోత్ వెంకటేష్, గుగులోత్ లల్లి, ధారావత్ శారద, రాద తదితరులు పాల్గొన్నారు.



దేశంలో కులం, మతం పేరుతో దాడులు

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ముదిగొండ

భారతదేశంలో బిజెపి ప్రజల మధ్య కులం, మతం పేరుతో విద్వేషాలు పెంచి దాడులు చేస్తుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ఆరోపించారు.సిపిఐ(ఎం) గ్రామ శాఖ మహాసభల్లో భాగంగా మండలపరిధిలో గోకినేపల్లిలో సీతారాం ఏచూరి ప్రాంగణంలో పార్టీ నాయకురాలు పయ్యావుల ప్రభావతి అధ్యక్షతన బుధవారం గ్రామ మహాసభ జరిగింది. ఈ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ సంపదను ప్రధాని మోడీ పెట్టుబడిదారులు ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆయన విమర్శించారు. దేశాన్ని హిందూ రాజ్యాంగా చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నాడని, కుట్రలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులుగా మనం ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మోడీ గ్రాఫ్ తగ్గిందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ మీద ప్రజలు వ్యతిరేకత పెరగటంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. భారీ వర్షాలకు సాగర్ కాలువ గండ్లు పడి తెగిపోతే నేటికీ గండ్లు పూడ్చలేని దౌర్భాగ్యమైన స్థితిలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉందన్నారు. నీళ్ల లేక రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్న ప్రభుత్వము,అధికారులు,మంత్రులు చోద్యం చూస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామ మూడు శాఖల కార్యదర్శులుగా మేడా నారాయణ, తొర్తి రమేష్, పయ్యావుల ప్రభావతిలను తిరిగి రెండోసారి ఎన్నుకున్నారు. తొలిత మహాసభ ప్రాంగణంలో సిపిఐ(ఎం) రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్ ఎర్రజెండా ఎగరవేశారు. గ్రామ అమరవీరులతోపాటు, సీతారాం ఏచూరి చిత్రపటాలకు పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు పయ్యావుల రామనాథం, కృష్ణసాగరపు సత్యం టిఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, రాయల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు తొర్తి గురవయ్య, బొడ్డు శ్రీను, పగడాల శ్రీను, తొర్తి లింగయ్య, సొందు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.





పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కస్నాతండ గ్రామంలో పార్టీ గ్రామ శాఖ మహాసభ అవిరేణి గురవయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ మహాసభలో సీపీఎం జెండాను అవిరేణి పుల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో జరిగిన సభలో యర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. పేదల పొట్ట కొట్టి పెద్దల జేబులు నింపుతున్న బిజెపిపై పోరాటం చేయాలని అట్టడుగు వర్గాలను కోరారు. మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్ మాట్లాడారు. అనేక హామీలతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు పూర్తిస్థాయిలో సహాయం అందట్లేదన్నారు. వరదల్లో కస్నా తండ గ్రామం పూర్తిగా మునిగిపోతే సీపీఎం గ్రామ శాఖ ముందు భాగంలో నుండి ప్రజలకు అండగా ఉందని తెలిపారు. వరద సహాయక చర్యల్లో వీరుడిలా పోరాడిన భూక్య నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. వరదల్లో సాహసోపేతంగా పనిచేసిన భూక్య నాగేశ్వరరావుకు సీపీఎం మహిళా నాయకురాలు దొడ్డ భారతమ్మ బ్యాగును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, మండల నాయకులు నందిగామ కృష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు, ఆంటోనీ, అవిరేణి నాగరాజు, ఊరుబండి చంద్రయ్య, భూక్య స్వామి, వల్లాల రాంబాబు, అవిరేణి కోటేశ్వరరావు, మారుతి ఉపేందర్, భూక్య సైదమ్మ దొడ్డ భారతమ్మ, బండి రవి తదితరులు పాల్గొన్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా భూక్య నాగేశ్వరరావును ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నుకున్నారు.

మండల విద్యాశాఖ అధికారిగా 'దామాల పుల్లయ్య'

నవ తెలంగాణ - బోనకల్



సుదీర్ఘకాలం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను భర్తీ చేసింది. మండల విద్యాశాఖ అధికారిగా రావినూతల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామాల పుల్లయ్యను మండల విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు బుధవారం నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. దామాల పుల్లయ్య మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓగా బుధవారం బాధ్యతలను స్వీకరించారు. పుల్లయ్య రావినూతల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మండల విద్యాశాఖ అధికారిగా రావినూతల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారే నియమితులు కావడం వరుసగా ఇది రెండవసారి కావటం విశేషం. గతంలో రావినూతల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన మలినీడు ఇందిరా జ్యోతి మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా పనిచేశారు. ఆమె బదిలీ కావడతో పోస్టు ఖాళీగా ఏర్పడింది. ప్రస్తుతం వైరా విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు మండల ఇన్చార్జి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన నుంచి దామాల పుల్లయ్య బాధ్యతలను స్వీకరించారు. ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన దామాల పుల్లయ్యను టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జిల్లా నాయకులు సద్దాబాబు, గోపాలరావు, పిఆర్టియు నాయకులు చింతల రవికుమార్, కొనకంచి రామ్మోహన్ తదితరులు ఎంఆర్సి కార్యాలయంలో కలిసి అభినందించారు.

రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేయాలి


నవతెలంగాణ-కారేపల్లి

రుణమాఫీ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్రలు డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లి మండలం గాంధీనగర్ శాఖ మహాసభ కేసగాని రాంమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నాగేశ్వరరావు, నరేంద్రలు మాట్లాడుతూ నేటికి రుణమాఫీ 50 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. రూ.2లక్షల పైన ఉన్న రుణాలపై స్పష్టమైన విధానం చెప్పకపోవటంతో రైతులు మాఫీపై అందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని రైతులు రుణాలు రెన్యూవల్స్ చేయలేదని, దీంతో రైతులపై వడ్డీ, ఆపరాధ వడ్డీ భారం పెరిగిపోతుందన్నారు. పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని చట్ట సభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్య అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా ఈసం వెంకటేశ్వర్లు(సలీం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్జా రామారావు, పాయం లింగమూర్తి, ఈసం వెంకటేశ్వర్లు, కేసగాని ఉపేందర్‌పాల్గొన్నారు.

వరద బాధితులకు లయన్స్ క్లబ్ చేయూత

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ధంసలాపురం వరద బాధితులకు లయన్స్ క్లబ్ నిత్యావసరాల వస్తువుల కిట్లు పంపిణీ చేశారు. మున్నేరు వరద ముంపు బాధితులను ఆదుకోవడంలో లయన్స్ క్లబ్ ఎంతో కృషి చేస్తుందని సంస్థ ద్వారా నిత్యావసర వస్తువులను సమకూర్చుకొని బాధితులకు పంపిణీ చేయడంలో నిత్యం ఒక అడుగు ముందుకు వేస్తుంది. ఈనెల ఒకటవ తేదీన ఖమ్మం పట్టణంలో సంభవించిన మున్నేరు వరద ముంపు నాటి నుండి నేటి వరకు బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అండగా నిలిచింది. క్లబ్బు 320 ఈ ద్వారా ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ నుండి వచ్చిన 125 బియ్యం బస్తాలతో పాటు నిత్యావసర సరుకులు కిట్లను బుధవారం 16వ డివిజన్ ధంసలాపురం ప్రాంతంలోని మున్నేరు వరదముంపు బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరామ్, కోశాధికారి ఆర్తి గోవిందరావు, రీజినల్ చైర్మన్ డిపిసి రావు, కొంకిమల్ల విశ్వేశ్వరరావు, మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, జనార్దన్ రావు, కురివెళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా మురళీమోహన్‌రావు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా బి.మురళీ మోహన్‌రావు బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ప్రస్తుతం ఎర్రుపాలెం మండల పరిధిలోని మీనవోలు జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులుగా పని చేస్తున్న మురళీ మోహన్‌రావుని మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా నియమించారు. పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మహారాజశ్రీ ఖమ్మం అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు
ఐ.ఎ. నెం. 3/2023 &
ఐ.ఎ. నెం. 4/2023
ఇన్
ఒ.యస్. నెం. 325/2015
దిటీష్ :
శ్రీమతి అడ్డెపల్లి సువర్చల ....వాది
మరియు
శ్రీమతి పిల్లలమర్రి బాల త్రిపుర సుందరి మరియు ఇతరులు
.........ప్రతివాదులు
టు,
శ్రీ పిల్లలమర్రి వెంకట సుబ్రమణ్య మధుసూదన శ్రీకాంత్, తండ్రి : వెంకటబాలకృష్ణ ప్రసాద్, వృత్తి : ప్రైవేట్ ఉద్యోగి, నివాసం : ఇ.నెం. 3-1-123, మోహన్ రోడ్, నర్తకీ టాకీస్ రోడ్, ఖమ్మం పట్టణం & జిల్లా.
పైన తెల్పిన దావాలోప్రతివాదులైన పైన తెల్పిన పిల్లలమర్రి వెంకట సుబ్రమణ్య మధుసూదన శ్రీకాంత్, ప్రతివాది-6 హాజరు నిమిత్తం వాయిదా తేది : 30-9-2024 ఉ.గం. 10.30 ని॥లకు కోర్టు వారి ఉత్తర్వులు పై దావాలో ఆర్డర్ ఇచ్చి ఉన్నారు. కావున ఆ రోజు అనగా 30-09-2024న మీరు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మీ న్యాయవాది గారి ద్వారా హాజరు కాగలరు. లేని యెడల గౌరవ అదనపు సివిల్ జడ్జి ఖమ్మం వారు సదరు దావాలో పరోక్షంగా విచారించగలరని తెలియపర్చడమైనది..
//కోర్టు వారి ఉత్తర్వులతో//
కె.పి. సత్యనారాయణ రావు,
వి.రామచంద్రరావు,
ఖమ్మం అడ్వకేట్స్, ఖమ్మం
ది.25.09.2024

పోషకాహారంతోనే ఆరోగ్యం : సీడీపీఓ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన ఎదుగుదల ఉంటుందని సీడీపీఓ కమల ప్రియ అన్నారు. మండల పరిధిలోని మద్దుల పల్లిలో జాతీయ పోషణ మాసంను బుధవారం నిర్వహించారు. సామూహిక సీమంతాలు, అన్నప్రసన్నాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. పోషహాకారం గురించి అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజారావు, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, విజయలక్ష్మి, సరిత, శ్రీలత, సకినా, ధనలక్ష్మి, మణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి క్రీడలకు ఎంజేపీ విద్యార్థులు

నవతెలంగాణ-వైరా

జోనల్ మెట్లు అత్యంత క్రీడా ప్రదర్శన చూపించి జిల్లా స్థాయి పాల్గొనేందుకు ఎంజెపి వైరా విద్యార్థులు అర్హత సాధించారు. వీరిని ఆర్సిఓ బీలోరని, జిల్లా కన్వీనర్ జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్ జహీద, వ్యాయామ ఉపాధ్యాయుడు రవి, తోటి ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సొంత ఇండ్లు కట్టించే వరకూ పోరు ఆగదు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్

నవతెలంగాణ-పాల్వంచ



సొంత ఇండ్లు కట్టించే వరకూ పోరును కొనసాగించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్ పిలుపు నిచ్చారు. సీపీఐ(ఎం) శాఖ మహాసభలను నవభారత్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శాఖ మహాసభలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏజె రమేష్ మాట్లాడుతూ ప్రతీ పేద కుటుంబానికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, స్థలం ఉన్నవారికి ఐదు లక్షలు రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన 10 నెలలు గడుస్తున్నపటికీ ఒక్కరికీ కూడా ఇండ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి దొడ్డ రవి కుమార్, పట్టణ కమిటీ సభ్యులు కె.సత్యం, తులసి రామ్, రహీమ్, బి.కాంతి, వి.వాణి, శాఖ కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అనుగుణంగా ఎంబీబీఎస్ సీట్లు పెంచాలి

- మైనారిటీ జిల్లా అధ్యక్షుడు యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలో ఈ ఏడాది జరిగే ప్రవేశాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తుంన్నందున, దీనికి అనుగుణంగా ఎంబీబీఎస్ సీట్లను కూడా పెంచాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నందున ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల రిజర్వేషన్లలలో కోత జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని 34 ప్రభుత్వ వైద్య కళాశాలలో మొత్తం 8900 సీట్లు ఉండగా, అందులో 4090 ఎంబీబీఎస్ సీట్లు ప్రభుత్వ కాలేజీలలో, 4810 ప్రైవేట కాలేజీలలో సీట్లు ఉండగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు కారణంగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ లలో వెనుకబడిన వర్గాల విద్యార్థుల సీట్లకు కోత విధించి అగ్రవర్ణాల పేదలకు సీట్లు కేటాయించటం మూలాన, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా కారణంగా మెడికల్ సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్న కారణంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎంబిబిఎస్ ప్రవేశాలలో ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేసిందని గుర్తు చేశారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అనుగుణంగా ఎంబిబిఎస్ సీట్లను పెంచాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, వైద్య శాఖామంత్రి, కాళోజి నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌తో పాటు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-పాల్వంచ



జాతీయ స్థాయి కరాటే పోటీలలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణ పరిధి కాంట్రాక్టర్స్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఈ నెల 22 ఆదివారం హైదరాబాద్‌లో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. పాఠశాల విద్యార్థులు కార్తీక్, రోష్ని(5వ తరగతి), ధను శ్రీ(4వ తరగతి) కరాటే విభాగంలో గోల్డ్ మెడల్స్, హేమ రుద్రిక (5వ తరగతి), భవిష్య సింధు (4వ తరగతి), లక్ష్మీధర్ (4వ తరగతి) కరాటే విభాగంలో సిల్వర్ మెడల్స్, నిహాల్, ఉద్వితలు బ్రోన్జ్ మెడల్స్ సాదించి రికార్డ్ సృష్టించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మెన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్య, ఏజీఎం జయ ప్రకాష్, హైస్కూల్ కో- ఆర్డినేటర్ వెంకట్, ప్రిన్సిపాల్ రమ్య ప్రైమరీ ఇన్చార్జ్ స్వర్ణలత, కరాటే మాస్టర్ పవన్ రెడ్డి విజయం సాధించిన విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.


మళ్లీ కుంగిన కల్వర్టు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచలం- చర్ల ప్రధాన రహదారి తూరుబాక గ్రామ శివారులో గల కల్వర్టు మళ్లీ కుంగింది. గత 20 రోజుల కిందట ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కల్వర్టు బీమ్ పగిలి కృంగిపోవడంతో ఆర్ అండ్ బీ అధికారులు ప్రత్యామ్నాయంగా ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక పనులు చేపట్టారు. కాగా గత రెండు రోజుల క్రితం రేగుబల్లి ఇసుక ర్యాంపు తోలకాలు ప్రారంభం కావడంతో అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగించడంతో కల్వర్టు మళ్ళీ కుంగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా కుంగిన కల్వర్టును బుధవారం తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ పరిశీలించి సంబంధిత ఆర్ అండ్ బి అధికారులకు సమాచారం అందజేశారు. శాశ్వత పనులు చేపడితే తప్పా, రాకపోకలు సాగే అవకాశం లేదని వాహనదారులు తెలుపుతున్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

నవతెలంగాణ-అశ్వాపురం



పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మారుమూల ఏజెన్సీలోని మామిళ్ళ వాయి గ్రామానికి చెందిన సోయం సత్యం (20) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన కొత్తగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి

- ఆదర్శ వివాహం చేసుకున్న ఎన్వి రాకేష్ పూలసోని

నవతెలంగాణ కామేపల్లి

ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్, పూలసోనీలు సెప్టెంబర్ 24న జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో మంగళవారం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో కులాంతర ప్రేమ ఆదర్శ వివాహం చేసుకున్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య వివాహనికి అధ్యక్ష వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు వివాహం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రధాన వ్యక్తిగా హాజరయ్యారు. ఈ వివాహ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ ఖమ్మం డివిజన్ పార్టీ కార్యదర్శి టి ఝాన్సీ, మాజీ జెడ్పిటిసి సభ్యులు మేకల మల్లిబాబు పాల్గొన్నారు.

వరద నష్టపరిహారం కోసం నిరసన

మొక్కుబడిగా సర్వే చేశారని ఆవేదన

- గ్రామమంతా వరదొస్తే కొంతమందికే పరిహారమంటూ ఆగ్రహం



నవతెలంగాణ-కోదాడరూరల్

వరద నష్టపరిహారం అందించాలని కోరుతూ బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అధికారులు మొక్కుబడిగా సర్వే చేశారని ఆరోపించారు. చిలుకూరు మండలం నారాయణపురం గ్రామ చెరువుకట్ట నాలుగు చోట్ల తెగడం వల్ల వరద గ్రామాన్ని ముంచెత్తిందని తెలిపారు. నడుము లోతు నీరు ప్రవహించిందన్నారు. దీంతో అన్ని ఇండ్లలోకి నీరు చేరడంతో వస్తువులు, మోటర్లు, విలువైన వస్తువులు కొట్టుకుపోయాయన్నారు. అదే వరద రాత్రిపూట వస్తే పెద్ద ప్రమాదం ఉండేదన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందేమోనని అనుకుంటే.. అధికారులు మొక్కుబడి సర్వే చేసి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం మొత్తం వరద వస్తే కొంతమందికే నష్టపరిహారం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనంతరం కార్యదర్శి అవినాష్.. వారందరి పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో నిరసన విరమించారు.



ఫ్లైఓవర్ ఎక్కుతుండగా కారు బోల్తా

వర్షం నీటితో అదుపు తప్పి.. ప్రమాదం

- ఆ సమయంలో కారులో ఆరుగురు ఉపాధ్యాయులు, డ్రైవర్
- అందరికీ గాయాలు.. హుటాహుటినా ఆస్పత్రికి తరలింపు
- అందోల్ జాతీయ రహదారిపై ఘటన

నవతెలంగాణ-జోగిపేట

ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న కారు.. ఫ్లైఓవర్ ఎక్కుతుండగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాద సమయంలో కారులో డ్రైవర్‌తోపాటు ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని మాసంపల్లి 161వ జాతీయ రహదారి వద్ద బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నేరడిగుంట, అక్సాన్‌పల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పూర్ణచందర్, మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, ప్రవీణ, వరలక్ష్మి, జ్యోతి, రత్నకుమారిని చౌటకూరు మండలానికి చెందిన కారు డ్రైవర్ ప్రవీణ్.. సంగారెడ్డి ప్రాంతం నుంచి ఆయా పాఠశాలలకు ప్రతిరోజూ కారులో తీసుకెళ్తుంటాడు. బుధవారం ఉదయం కూడా వారు కారులో పాఠశాలకు బయల్దేరారు. అయితే ఉదయం చిరుజల్లులు కురవడంతో.. కారుకు అడ్డంగా నీరు రాగా కారు అదుపు తప్పి పల్టీ కొట్టి సర్వీస్ రోడ్డుపై పడింది. దీంతో కారులోని వారందరికీ గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. విషయం తెలుసుకున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరోత్తం, రాజమల్లు, తదితరులు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. కాగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని జోగిపేట పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఉస్మాన్‌సాగర్(గండిపేట్) రిజర్వాయర్‌కు భారీ స్థాయిలో వరద వచ్చింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నీరు చేరింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 11.30 గంటల తర్వాత అధికారులు 2 గేట్లను అడుగు మేర ఎత్తి 234 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేశారు. అటు హిమాయత్ సాగర్ జలాశయానికి సైతం వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి దగ్గరలో ఉంది. దీంతో బుధవారం సాయంత్రం 7 గంటలకు రిజర్వాయర్ ఒక గేటు అడుగు మేర అధికారులు ఎత్తారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.





డబుల్ బెడ్ రూం ఇండ్లు ఖాళీ

బలవంతంగా వెళ్లగొట్టిన అధికారులు

- ప్రతిఘటించిన పేదలు, పెట్రోల్ పోసుకొని నిరసన
- ఆక్రమించుకున్న 'డబుల్' ఇండ్లు ఖాళీ చేయాలి : ఆర్డీఓ డీఎస్ వెంకన్న

నవతెలంగాణ-పాలకుర్తి

నిర్మాణం పూర్తైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్దిదారులకు కేటాయించకపోవడంతో నిరాశచెందిన పేదలు వాటిని ఆక్రమించుకొని నివాసముంటున్నారు. వారు ఖాళీ చేయాలని అధికారులు పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో బుధవారం బలవంతంగా ఖాళీ చేయించారు. పేదలు ప్రతిఘటించి పెట్రోల్ పోసుకొని నిరసన తెలిపారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం తొర్రూరు(జే)లో జరిగింది. తొర్రూరు గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 20 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించింది. అర్హులను గుర్తించి ఇండ్లు కేటాయించకపోవడంతో పడావుపడ్డాయి. దాంతో ఆగ్రహించిన గ్రామానికి చెందిన 20 మంది పేదలు.. ఎనిమిది నెలలుగా ఆ ఇండ్లను ఆక్రమించి నివాసం ఉంటున్నారు. కాగా, అక్రమంగా ఆక్రమించుకున్న ఇండ్లను ఖాళీ చేయాలని అధికారులు వారిని పలుమార్లు హెచ్చరించారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. ఇండ్లు ఖాళీ చేయబోమని లబ్దిదారులు పట్టుబట్టడంతో ఉద్రిక్తత వాతావరణంలో అధికారులు వారి సామాన్లను బయట పడేసి ఇండ్లకు తాళాలు వేసి సీల్ వేశారు. దాంతో తాము ఎక్కడ ఉండాలంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తూ పసలాది అంజమ్మ, పసులాది పద్మ పెట్రోలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గడ్డం భూలక్ష్మి, జోడు ఇందిర, గడ్డం ప్రజాపతి పెట్రోలు ఒంటిపై పోసుకొని నిరసన తెలుపుతూ ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన లబ్దిదారులను గుర్తించి గ్రామపంచాయతీ తీర్మానం చేసి తహసీల్దార్ కార్యాలయానికి అందజేసిందని తెలిపారు. అయినా ఇండ్లు కేటాయించకపోవడంతో తాము నివాసం ఉంటున్నామని, ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండా అధికారులు ఖాళీ చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండటానికి ఇల్లు లేకపోవడం, వరుసగా కురుస్తున్న వర్షాలకు పాత ఇండ్లు నేలమట్టం కావడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్నామని బోరున విలపిస్తూ తెలిపారు. అధికారులు బలవంతంగా ఖాళీ చేయించడంతో ఆరుబయటే ఉండాల్సి ఉంటుందని, వర్షాలకు ఎక్కడ





ఉండాలని ప్రశ్నించారు. కాగా, పెట్రోలు తాగిన మహిళలు, ఒంటిపై పెట్రోలు పోసుకున్న మహిళలను స్థానికులు వైద్యం కోసం పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఎనిమిది నెలలుగా నివాసముంటున్న అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ డిమాండ్ చేస్తూ బాధితులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవరుప్పుల ఎస్ఐలు యాకూబ్ హుస్సేన్, సృజన్, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐ రాకేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్‌తో పాటు పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఖాళీ చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకొని చొరబడ్డారని, ఆక్రమించుకున్న ఇండ్లను వెంటనే ఖాళీ చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ఆక్రమించుకున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఖాళీ చేయిస్తున్నామని తెలిపారు. మండలంలోని పాలకుర్తిలో 50, దర్దేపల్లిలో 40, తొర్రూరు జే వడ్డెర కాలనీలో 30 ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆన్‌లైన్ చేశామన్నారు. మిగతా గ్రామాల్లో లబ్దిదారులను గుర్తించలేదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఆక్రమించుకున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఖాళీ చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇండ్లు పూర్తయిన గ్రామాల్లో త్వరలోనే గ్రామ సభలను ఏర్పాటు చేసి అర్హులైన పేదలను ఎంపిక చేసి అందజేస్తామని తెలిపారు.

- ఆర్డీఓ డీఎస్ వెంకన్న

కార్మిక చట్టాలు అమలు చేయాలి

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలి
- 30న చలో లేబర్ కమిషనరేట్ జయప్రదం చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ధర్నా సందర్భంగా జిల్లాలోని కాటేదాన్ క్లస్టర్, కందుకూరు, తుర్కయంజాల్ ప్రాంతాల్లో 'వాల్ రైటింగ్' కార్యక్రమాన్ని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌తో కలిసి భూపాల్ ప్రారంభించారు. అనంతరం తుర్కయంజాల్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాల్ మాట్లాడారు. కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ ఎంప్లాయీస్ అందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, అదనపు పనికి అదనపు వేతనం రెండింతలు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని తెలిపారు. ప్రయివేటు యాజమాన్యాలు కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తూ కనీస వేతనాలు ఇవ్వకుండా, కార్మిక చట్టాలు అమలు చేయకుండా పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. హామీల అమలుకై సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని, అయినా ప్రభుత్వం స్పందించడం ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలను అమలు డిమాండ్ చేస్తూ లేబర్ కమిషనర్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్, డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి వై.స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ బుగ్గరాములు, సీహెచ్ ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి జానీ మాస్టర్

- నాలుగు రోజులపాటు అనుమతిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు



నవతెలంగాణ-గండిపేట్

లైంగికదాడి వేధింపులు ఎదుర్కొంటూ చంచల్‌గూడ జైల్‌లో ఉన్న ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ జానీని పోలీసు కస్టడీకి అనుమతినిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. తనపై లైంగిక దాడి చేశారని జానీమాస్టర్‌పై అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో జానీ మాస్టర్‌కు ఇటీవల అత్తాపూర్ కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. అయితే అతన్ని కస్టడీకి అప్పగించాలని నార్సింగి పోలీసులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. బుధవారం కూడా వాదనలు విన్న కోర్టు జానీ మాస్టర్‌ను నాలుగు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అనుమతి ఇస్తూ తీర్పునిచ్చింది. అయితే చంచల్‌గూడ జైల్‌లో ఉన్న జానీ మాస్టర్‌ను నార్సింగి ఏసీపీ రమణగౌడ్, సీఐ హరికృష్ణరెడ్డి నార్సింగి పీఎస్‌కు తరలించారు. ఈ కేసకు సంబంధించి నాలుగు రోజులపాటు పోలీసులు జానీ మాస్టర్‌ను విచారించనున్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించొద్దని, అవసరం అయితే న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని పోలీసులకు కోర్టు సూచించింది.

పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

12 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తాం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఉదండాపూర్ రిజర్వాయర్ పరిశీలన



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక, నీటిపారుదల శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. రూ.12 కోట్ల 97 లక్షలతో నిర్మించనున్న 4.2 కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్‌కు రూ.45 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్లతో పాటు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డిపై రూ.27,500 కోట్లు ఖర్చు చేసి ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని చెప్పారు. నీటి వాటానూ సాధించలేక పోయారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని, ఇదే చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. ఈ శాసనసభ కాలంలోనే పాలమూరు-రంగారెడ్డిని పూర్తి చేస్తామని చెప్పారు. ఉదండాపూర్‌తో పాటు ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పునరావాసం అందిస్తామని, వీటన్నిటిపై సమీక్షించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన చేపట్టినట్టు వెల్లడించారు.

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. గతంలో ఆర్ అండ్ ఆర్‌లో భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.మూడు కోట్లా 74 లక్షలు, ఆర్అండ్ఆర్‌కు సంబంధించి రూ.2.6 కోట్లు, ఉదండాపూర్‌లోని నిర్మాణాలకు సంబంధించి రూ.13 కోట్లు పెండింగ్ నిధులను విడుదల చేయాలని మంత్రిని కోరారు. అవార్డులకు సంబంధించి అదనంగా బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉదండాపూర్, కరివేన రిజర్వాయర్లు పూర్తయితే కరివేన ద్వారా 2.5 లక్షల ఎకరాలకు, ఉదండాపూర్ ద్వారా 9 లక్షల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని అన్నారు. త్వరగా ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్-ఇన్-చీఫ్ అనిల్ కుమార్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, శ్రీహరి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ జానకి, ఎస్ఈ శ్రీనివాసరావు, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఎస్.మోహన్ రావు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్
- 50 ఏండ్లు నిండిన వారికి పింఛన్
- రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా విస్తరించి చెరువులు, కుంటలను పరిరక్షించాలి : మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గొరెంకల నర్సింహా అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బుర్ర జ్ఞానేశ్వర్, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారులను ఆదుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఇప్పటికే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం వారికి భరోసా కల్పించిందన్నారు. నిధుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తున్నామని, మత్స్యకారులకు కనుచూపు మేరలో కూడా అన్యాయం జరగకుండా కాపాడుకుంటామని స్పష్టంచేశారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మత్స్య కార్మిక శాఖ రాష్ట్ర చైర్మెన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. 50 ఏండ్లు నిండిన మత్స్యకారులందరికీ ఆసరా పింఛన్లు అందజేస్తామని చెప్పారు.

చెరువులు, కుంటలు పరిరక్షించాలి : మత్స్య కారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి చెరువులు, కుంటలను కాపాడాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. కాలుష్య కోరల నుంచి చెరువులను పరిరక్షించాలని కోరారు. రాష్ట్రంలో 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4.90 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ మాఫియా చేతుల్లో చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల డ్రయినేజీ నీరు మొత్తం చెరువులు, కుంటల్లో కలపడంతో మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. చెరువులు, కుంటలను నది పరివాహక ప్రాంతాల భూములను శాటిలైట్ ద్వారా సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను నాటి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.114 కోట్లు ప్రకటించిందన్నారు. కానీ టెండర్ల ద్వారా పంపిణీ చేయడం బాధాకరమన్నారు. చేప పిల్లలను జలాల్లో వదిలారని, కానీ భారీ వర్షాలతో అవి కొట్టుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచితంగా చేప పిల్లలు కాకుండా నేరుగా మత్స్య సొసైటీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. 50 ఏండ్లు నిండిన మత్స్యకారులందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో రూ.20లక్షలతో చేపల మార్కెట్లను నిర్మించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మత్స్య కార్మికులు, ముదిరాజులు సంయుక్తంగా తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో డీఎఫ్‌సీ సీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొప్పు పద్మ, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చెనమోని శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకన్న, కొండల్, మల్లేష్, పి.జంగయ్య, సహాయ కార్యదర్శిలు నరసింహ, రవి, రామచంద్రయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల

వైద్య సౌకర్యాలు కుదించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు స్వామి మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రుల్లో, సీజీహెచ్ఎస్‌లో నిపుణులైన వైద్యులను, పారా మెడికల్, ఇతర సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లతోపాటు బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు పి ప్రభాకర్, బీజేఎం రెడ్డి, బ్రహ్మచారి, నరహరి, రామచంద్రుడు, అరుణ, ప్రభాకర్ నాయర్, శివలింగం, సుధావన్, వెంకయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఎన్ సోమయ్య, జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలంలో సాయంత్రం పూట వేడివేడిగా స్నాక్స్ తినాలనిపిస్తుంది. పకోడీలు, బజ్జీలు వంటివి బయట కొని తినేవాళ్లే ఎక్కువ. బయట నూనెతో చేసిన స్నాక్స్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే కొద్దిగా టైం కేటాయించుకొని ఇంట్లో చేసుకుంటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం. అలా చేసుకొనే రుచికరమైన రెసిపీలు కొన్ని నేటి మానవిలో మీ కోసం..



క్రంచీ క్రంచీ స్నాక్స్......

కొత్తిమీర వడలు

కావలసిన పదార్థాలు : కొత్తిమీర– మూడు కట్టలు, శనగపిండి – ఒక కప్పు, అల్లంవెల్లుల్లి పేస్టు – ఒక టీస్పూన్, కారం – అర స్పూన్, పసుపు – అర స్పూన్, పచ్చి మిర్చి – రెండు, దనియాల పొడి– అర స్పూన్, జీలకర్ర పొడి– అర స్పూన్, నువ్వులు – ఒక స్పూన్, గరంమసాలా – పావు స్పూన్, ఉప్పు – తగి నంత, నిమ్మరసం ఒక స్పూన్, నీళ్లు– పావు కప్పు, నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.



తయారీ విధానం : ముందుగా కొత్తిమీరను శుభ్రంగా కడిగి తరిగి ఒక పాత్రలోకి తీసుకోవాలి. తరువాత అందులో శనగపిండి, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి మిర్చి, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, నువ్వులు, నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి అన్నీ బాగా కలుపుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు అర చేతిలో కొద్దిగా నూనె రాసుకుని ప్లేట్‌లో సమంగా పరిచి 15 నుంచి 20 నిమిషాల పాటు ఉడికించాలి. చల్లారిన తరువాత మనకు కావాల్సిన షేప్‌లో కట్ చేసుకోవాలి. స్టవ్‌పై పాన్ పెట్టి నూనె పోసి కాస్త వేడి అయ్యాక వాటిని వేసి వేయించుకోవాలి. అంతే... కరకరలాడే కొత్తిమీర వడలు రెడీ.

పెసరపప్పు పకోడీ

కావలసిన పదార్థాలు: పెసరపప్పు – ఒక కప్పు, ఒకటిన్నర కప్పు నీళ్లు, పచ్చిమిర్చి తరుగు – ఒక స్పూను, సన్నగా తరిగిన అల్లం ముక్కలు – ఒక స్పూను, ఇంగువ – చిటికెడు, మిరియాలు – ఒక స్పూను, ధనియాలు – ఒక స్పూను, ఉప్పు, తగినంత, నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ విధానం: ఒక గిన్నెలో శుభ్రంగా కడిగిన పెసరపప్పును తీసుకుని కనీసం మూడు నాలుగు గంటలు నానబెట్టుకోవాలి. నీళ్ల నుంచి పెసరపప్పు తీసేసి బరకగా గ్రైండ్ చేసుకోవాలి. అందులోనే పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, ఇంగువ, కొద్దిగా నీళ్ల పోసుకుని కలుపుకోవాలి. ఇప్పుడు మరోసారి గ్రైండ్ చేయాలి. మిరియాలు, ధనియాలు కొద్దిగా దంచుకొని వాటిని పెసరపప్పు మిశ్రమంలో కలిపేసుకోవాలి. ఉప్పు కూడా వేసుకుని పిండి బాగా కలుపుకోవాలి. ఒక కడాయిలో నూనె పోసుకుని వేడెక్కాక చిన్న చిన్నగా పకోడీలు వేసుకోవాలి. క్రిస్పీగా, రంగు మారేంత వరకు వేయించుకోవాలి. పకోడీలు వేగేంత వరకు మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. ఒక టిష్యూ పేపర్ మీద తీసుకుంటే నూనె పీల్చేసుకుంటుంది. వీటిని కెచప్ లేదా ఏదైనా చట్నీతో సర్వ్ చేసుకోవచ్చు. చిన్న పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. మూంగ్ పకోడీ ఒకసారి మీరూ ప్రయత్నం చేయండి.



పోహా కట్‌లెట్స్

కావలసిన పదార్థాలు : అటుకులు ఒక కప్పు, బంగాళదుంపలు– రెండు, పసుపు – చిటికెడు, కారం – అర టీస్పూన్, గరం మసాలా అర టీస్పూన్, మామిడికాయ పొడి – పావు స్పూన్, చాట్ మసాల – అర టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్టు– అర టీస్పూన్, మిరియాల పొడి – పావు టీస్పూన్, కార్న్ ఫ్లోర్ – ఒక టేబుల్ స్పూన్, ఉప్పు – తగినంత, కొత్తిమీర – ఒక కట్ట, బ్రెడ్ క్రంబ్స్– ఒక కప్పు, మైదా – ఒక స్పూన్.



తయారీ విధానం : బంగాళదుంపలను ఉడికించి, మెత్తటి గుజ్జుగా చేసి పెట్టుకోవాలి. అటుకులను శుభ్రంగా కడిగి ఒక పాత్రలోకి తీసుకోవాలి. తరువాత అందులో బంగాళదుంపల గుజ్జు వేయాలి. తరువాత పసుపు, కారం, గరం మసాలా, మామిడికాయ పొడి, చాట్‌మసాలా, అల్లంవెల్లుల్లి పేస్టు, మిరియాల పొడి, కార్న్‌ఫ్లోర్, కొత్తిమీర వేసి, తగినంత పోహా కట్లెట్స్, ఉప్పు వేసి మెత్తటి మిశ్రమంలా కలపాలి. లి మరొక పాత్రలో మైదా పిండి తీసుకుని అందులో కొద్దిగా కార్న్ ఫ్లోర్ వేసి తగినన్ని నీళ్లు పోసి పలుచగా కలపాలి. చేతులకు నూనె రాసుకుని మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతుల్లోకి తీసుకుంటూ వడల్లా ఒత్తుకుంటూ మైదా మిశ్రమంలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్ అద్దాలి. స్టవ్‌పై పాన్ పెట్టి నూనె పోసి కాస్త వేడి అయ్యాక వాటిని వేసి గోధుమరంగులోకి మారే వరకు వేయించాలి. టొమాటో సాస్తో పోహా కట్‌లెట్స్ వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి.

కార్న్ కట్లెట్

కావలసిన పదార్థాలు: స్వీట్ కార్న్ లేదా మామూలు మొక్కజొన్న గింజలు – ఒక కప్పు, బంగాళదుంపలు – రెండు (మీడియం సైజ్‌వి), క్యారట్ తురుము– ఒక స్పూను, క్యాప్సికం ముక్కలు – ఒక స్పూను, ఉల్లిపాయ సన్నటి ముక్కల తరుగు – ఒక కప్పు, గుప్పెడు కొత్తిమీర తరుగు, పావు టీస్పూన్ పసుపు, కారం – అర స్పూను, ధనియాల పొడి – అర స్పూను, జీలకర్ర పొడి –అర స్పూను, ఉప్పు– రుచికి సరిపడ, పావు కప్పు బ్రెడ్ క్రంబ్స్, కార్న్ ఫ్లోర్ – రెండు స్పూన్లు, డీప్ ఫ్రైకి సరిపడా నూనె.



తయారీ విధానం : ముందుగా మొక్కజొన్న గింజల్ని మిక్సీలో వేసి బరకగా రుబ్బుకోవాలి. కొన్ని గింజలు అలాగే కనిపించినా పరవాలేదు. వాటితో కూడా తినేటప్పుడు రుచి బాగుంటుంది. ఈ ముద్దను ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో క్యారట్ తురుము, క్యాప్సికం ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు వేసుకుని బాగా కలుపుకోవాలి.

పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి అన్నీ కలిసేలా కలపాలి. అందులోనే ఉడికించిన బంగాళదుంపలను బాగా మెదిపి వేసుకోవాలి. చివరగా కార్న్ ఫ్లోర్, బ్రెడ్ క్రంబ్స్ కూడా వేసి గట్టిగా ముద్దలా కలుపుకోవాలి. ఇప్పుడు చేతులకు నూనె రాసుకుని కొంచెం ముద్ద తీసుకుని కట్లెట్ ఆకారంలో ఒత్తుకోవాలి.

కళాయి పెట్టుకుని నూనె పోసుకుని ఈ కట్లెట్లు వేసుకుని డీప్ ఫ్రై చేసుకోవాలి. రెండు వైపులా రంగు మారేంత వరకు వేయించుకుంటే సరిపోతుంది. క్రిస్పీగా అయిపోతాయి.

వీటిని నూనెలో నుంచి బయటకు తీసుకుంటే చాలు. అదనంగా నూనె వదిలేయడానికి టిష్యూల మీద తీసుకుంటే సరిపోతుంది. వీటిని ఏదైనా చట్నీ లేదా టమాటా సాస్‌తో కలిపి సర్వ్ చేయండి. ■

మెదడు చురుకుదనానికి...

మెదడు మన శరీరంలోని అత్యంత సంక్లిష్టమైన అవయవం. ఇది నిరంతరం పని చేస్తూనే ఉంటుంది. అయితే శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంతోపాటు మానసిక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం.

దీని కోసం డైట్‌లో కొన్ని సూపర్‌ఫుడ్‌లను చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇవి మెదడు పనితీరు, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

చాపలు : సాల్మన్, ట్యూనా వంటి చేపల్లో ఒమేగా –3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా కనిపిస్తాయి. ఈ కొవ్వు ఆమ్లాలు మెదడు అభివృద్ధి, కణాల నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఒమేగా –3 లో అధికంగా ఉండే ఆహారం మెదడును పదును పెట్టడానికి, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి.



బెర్రీలు : స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, రాస్‌బెర్రీలు వంటి వాటిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి మెదడు కణాలను దెబ్బతినకుండా రక్షిస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి.

తృణధాన్యాలు : మిల్లెట్, బార్లీ, బ్రౌన్ రైస్ వంటి తృణధాన్యాలలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. విటమిన్ ఇ మెదడు కణాలను ఆక్సీకరణ నష్టం నుండి రక్షిస్తుంది. మెదడును పదునుగా ఉంచడంలో సహాయపడుతుంది. అలాగే, తృణ ధాన్యాలలో ఉండే ఫైబర్ మెదడుకు పోషకాలను అందించడంలో సహాయపడుతుంది.

టొమాటో : టొమాటోలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. లైకోపీన్ వృద్ధాప్యానికి సంబంధించిన నష్టం నుండి మెదడును కాపాడుతుంది. జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది.

కాఫీ : కాఫీ మెదడు చురుకుదనాన్ని పెంచుతుందని అంటారు. వాస్తవానికి, కాఫీలో కెఫిన్ ఉంటుంది. ఇది మెదడులోని న్యూరోట్రాన్స్‌మీటర్ల స్థాయిని పెంచుతుంది. ఇది మెదడు పనితీరు, దృష్టిని మెరుగుపరుస్తుంది. అయినప్పటికీ, కాఫీని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. కాబట్టి సమతుల్య పరిమాణంలో మాత్రమే తినండి.

ఉపాధికి భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఏడాది మూడు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొంది కాలేజీల నుంచి బయటకు వస్తున్నప్పటికీ ఇండస్ట్రీ అవసరాలకు సంబంధించిన నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అన్నారు. పరిశ్రమలు సైతం సాంకేతిక నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ సమస్యను అధిగమించేందుకు యువతకు నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి ఇంటర్న్‌షిప్ కూడా ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనీ, దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా సమకూరుతుందని అన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా వినూత్న కోర్సుకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయని, చదివిన డిగ్రీకి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు గ్యాప్ ఉంటోందని సీఎం వివరించారు. బీఎఫ్ఎస్ఐకు అవసరమైన స్కిల్స్ నేర్పేందుకు ఈ కోర్సు ప్రారంభిస్తున్నామని చెప్పారు.

గత పదేండ్లలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేనందుకు రాష్ట్రంలో కొంత మంది యువత గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసయ్యారని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పట్టుబడిన డ్రగ్ పెడలర్స్‌లో ఇంజినీరింగ్ స్టూడెంట్స్ ఉన్నారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, వసతులు, కనీస ప్రమాణాలు ఉండటం లేదని సీఎం అన్నారు. కళాశాలలు ఇలాగే కొనసాగితే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు.

టాటా టెక్నాలజీస్ సహకారంతో ఐటీఐలను అప్ గ్రేడ్ చేసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, ఇప్పటికే మల్లేపల్లి ఐటీఐలో పైలెట్ ప్రాజెక్టు అమలు చేసినట్లు చెప్పారు. దీంతో ఐటీఐ చదివిన ప్రతి విద్యార్థికి ఉద్యోగం లభిస్తుందని అన్నారు. రాబోయే రెండేండ్లలో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తామని తెలిపారు. ఇటీవలే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం నెలకొల్పిందని, మహీంద్రా గ్రూప్ చైర్మెన్ ఆనంద్ మహీంద్రాను బోర్డు చైర్మెన్‌గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ఏటా వేలాది మంది యువతకు వివిధ రంగాల్లో జాబ్ గ్యారంటీ కోర్సులు నిర్వహిస్తామని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీలను అప్‌గ్రేడ్ చేస్తామనీ, త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసి, తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎక్విప్ సంస్థ రూ. 2.5 కోట్ల చెక్కును ముఖ్యమంత్రికి అందించింది. విద్యార్థుల డేటాతో రూపొందించిన ఎక్విప్ స్కిల్ పోర్టల్‌ను సీఎం ఆవిష్కరించారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రానున్న కొద్ది సంవత్సరాల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఐదు లక్షల మంది శిక్షణ పొందిన అభ్యర్థుల అవసరం ఉంటుందని తెలిపారు. ఈ ఖాళీల భర్తీకి నైపుణ్యం కలిగిన వారిని తయారు చేయగలిగితే రాష్ట్రంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. గత పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏనాడు నిరుద్యోగ యువత ఆకాంక్షలను గుర్తించలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ఇంజినీరింగ్, ఐఐటీ, మెడిసిన్ లాంటి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు బాగానే ఉన్నా బీఏ, బీకాం, బీఎస్సీ లాంటి డిగ్రీ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. వీరితో పాటు ఇంజనీరింగ్ చదివినా అవకాశాలు దక్కని వారిని దృష్టిలో పెట్టుకుని నైపుణ్య శిక్షణ కోర్సుకు రూపకల్పన చేసినట్టు వివరించారు. తాను ఎక్విప్ అనే సాంకేతిక శిక్షణ అందించే సంస్థను సంప్రదించినప్పుడు వారు సానుకూలంగా స్పందించడం ఉత్సాహాన్నిచ్చిందని వెల్లడించారు. సామాజిక బాధ్యత కింద ఎక్విప్ రూ.2.5 కోట్ల వ్యయంతో ఏటా పదివేల మందికి ఉచితంగా ట్రెయినింగ్ ఇవ్వడానికి ముందు కొచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం ప్రతినిధులు మమతా మాదిరెడ్డి, రమేష్ ఖాజా, ఎక్విప్ సంస్థ ప్రతినిధులు హేమంత్ గుప్తా, జి.సాయికిరణ్ పాల్గొన్నారు.

పని గంటలు పెంచితే ప్రమాదమే

(మొదటిపేజీ తరువాయి)

చాలా మంది ఉద్యోగులు నారాయణ మూర్తి చెబుతున్న 'వారానికి 70 గంటల' కంటే ఎక్కువ సమయమే పనిచేస్తున్నారు. అయినప్పటికీ మనుగడ కోసం పోరాటాన్ని కొనసాగించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఆశా వర్కర్లు రోజుకు 10–14 గంటలు పని చేస్తున్నారు. ఇంత కష్టపడినా వారికి నెలకు వచ్చే జీతం మూడు వేల రూపాయలు మాత్రమే. గిగ్ వర్కర్లు కూడా రోజుకు ఎనిమిది గంటలు కష్టపడాల్సి వస్తోంది. ఇదంతా కుటుంబ పోషణకోసమేనని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

ఐస్‌లాండ్ అనుభవాలతో...

పని గంటల విషయంలో ఉద్యోగులకు వెసులుబాటు ఉండాలని, అప్పుడే వారు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతలను మరింత ఎక్కువగా నెరవేరుస్తారని పరిశోధకుల అభిప్రాయం. దీనివల్ల పని ఒత్తిడి కూడా తగ్గుతుంది. మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఉద్యోగులతో ఎక్కువ గంటలు పని చేయించుకుంటే వారితో నిరాసక్తత కలుగుతుంది. ఒత్తిడికి గురవుతారు. ఉత్పత్తి కూడా పడిపోతుంది. తక్కువ పని గంటలు సమర్థతను పెంచుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఉదాహరణకు ఐస్‌లాండ్‌లో 2015–2019 మధ్యకాలంలో 2,500 మందికి వారానికి నాలుగు పనిదినాల పద్ధతిని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ కాలంలో వారి ఉత్పాదకత పెరిగిందని తేలింది. వారి ఆరోగ్యం కూడా మెరుగైంది. పని–జీవితం మధ్య సమతూకం ఏర్పడింది.ఐస్‌లాండ్ అనుభవాల నేపథ్యంలో బెల్జియం, జర్మనీ, పోర్చుగల్ కూడా అలాంటి ప్రయోగాలే చేశాయి. అవి కూడా మంచి ఫలితాలనే అందించాయి. పని గంటలు కుదించడం, విశ్రాంతి సమయాన్ని తప్పనిసరి చేయడంపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత స్థాయిలో చర్చ జరుగుతోంది. పని గంటలను తగ్గించిన బెల్జియం, జర్మనీ దేశాలలో సత్ఫలితాలు కన్పిస్తున్నాయి.

రెండో దశ ప్రశాంతం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండో దశ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. సాయంత్రం ఆరు గంటలకు ముగిసిందని ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం పోలింగ్ 56 శాతంగా నమోదైందని ఎన్నికల సంఘం(ఈసీ) డేటా చూపించింది. ఈసీ డేటా ప్రకారం.. జమ్మూ ప్రాంతంలో శ్రీ మాతా వైష్ణో దేవీ స్థానానికి అత్యధికంగా 75.29 శాతం ఓటింగ్ నమోదైంది. తర్వాతి స్థానాల్లో పూంచ్–హవేలీ (72.71 శాతం), గుల్బ్‌గార్హ్(ఎస్టీ) (72.19 శాతం), సురన్‌కోటే (72.18 శాతం)ఉన్నాయి. ఇక కాశ్మీర్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 15 నియోజక వర్గాల్లో ఖాన్‌సాహిబ్ స్థానానికి అధికంగా 67.70 శాతం పోలింగ్ నమోదైంది. తర్వాతి స్థానాల్లో కంగన్ (ఎస్టీ) (67.60 శాతం), చ్రార్–ఇ–షరీఫ్ (66 శాతం) లు ఉన్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు అందిన సమాచారం ప్రకారం హబ్బకడల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 15.80 శాతం ఓటింగ్ రికార్డ య్యింది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు మొత్తం 3502 పోలింగ్ స్టేషన్లను ఈసీ ఏర్పాటు చేసింది. పారదర్శక ఎన్నికల కోసం అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు చెప్పారు. రెండో దశలో 157 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు.

16 దేశాల నుంచి దౌత్యవేత్తల బృందం

రెండో దశ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జమ్మూకాశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు తారీఖ్ హమీద్ కర్రా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనాలు ఉన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని అసెంబ్లీ ఎన్నికలను గమనించటం కోసం యూఎస్, నార్వే, సింగపూర్ వంటి 16 దేశాల నుంచి దౌత్యవేత్తల బృందం బుధవారం చేరుకున్నది. రెండో దశ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 25 లక్షల మందికి పైగా ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. కాశ్మీర్‌లోని గండెర్బాల్, శ్రీనగర్, బుద్గాం, జమ్మూలోని రీయాసీ, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మొత్తం 26 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి, స్వతంత్రులు కలుపుకొని మొత్తం 239 మంది పోటీ చేశారు. శ్రీనగర్ జిల్లాలో అత్యధికంగా 93 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో బుద్గాం (46), రాజౌరీ (34), పూంచ్(25), గండెర్బాల్ (21), రీయాసీ (20) జిల్లాలు ఉన్నాయి.

రెండు స్థానాల నుంచి ఒమర్ పోటీ

ఒమర్ అబ్దుల్లా గండెర్బాల్, బుద్గాం స్థానాల నుంచి పోటీ చేశారు. కర్రా సెంట్రల్ షాల్టెంగ్ నుంచి బరిలో ఉన్నారు. 2014లో విజయం సాధించిన నౌషేరా స్థానం నుంచి రైనా తన అదృష్టాన్ని వ ం శీ ్ల పరీక్షించుకోనున్నారు. జైలులో ఉన్న వేర్పాటువాది నాయకుడు సర్జన్ అహ్మద్ వాగే అలియాస్ బర్కాటీ.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రషీద్ లోక్‌సభ విజయ నమోదును ప్రతిబింబించాలని చూస్తున్నాడు. ఈ ఏడాదిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో షేక్ అబ్దుల్ రషీద్ (రషీద్ ఇంజినీర్‌గా పేరున్నది) తీహార్ జైలులో నుంచే బారాముల్లా స్థానం నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లాపై పోటీ చేసి విజయం సాధించిన విషయం విదితమే. రెండు లక్షలకుపైగా ఓట్ల తేడాతో రషీద్ విజయం స్వంతం చేసుకున్నాడు. ఇప్పుడు బర్కాటీ కూడా అదే ఆశతో ఉన్నాడు. ఈయన బీర్వాహ్, గండెర్బాల్ స్థానాల నుంచి పోటీలో ఉన్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలైన ఒమర్ అబ్దుల్లాకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఇక రెండో దశలో బరిలో ఉన్న కీలక నాయకుల్లో అప్నీపార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ బుఖారీ (చన్నాపోరా), మాజీ మంత్రులు మహమ్మద్ సాగర్ (ఖన్యార్), అబ్దుల్ రహీమ్ రాథర్ (చ్రార్–ఇ–షరీఫ్), చౌదరీ ఝుల్ఫీకర్ అలీ (బుధాల్), సయీద్ ముస్తాఖ్ బుఖారీ (సురన్‌కోటే)లు ఉన్నారు. చౌదరీ ఝుల్ఫీకర్ అలీ, సయీద్ బుఖారీలు ఈ సారి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు.

అక్టోబర్ 1న తుది దశ.. 8న ఫలితాలు

జమ్మూకాశ్మీర్‌లో మొత్తం మూడు దశల్లో ఈసీ ఎన్నికలను నిర్వహించనున్నది. ఇప్పటికే, ఈ నెల 18న 24 స్థానాలకు పోలింగ్ ముగిసింది. 61.38 శాతం పోలింగ్ నమోదైంది. ఇక మూడో దశలో 40 స్థానాలకు వచ్చేనెల 1న ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 8న అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

జమ్మూకాశ్మీర్ ప్రజాస్వామ్య వేడుకకు 15 దేశాల దౌత్యవేత్తలు

జమ్మూకాశ్మీర్‌లో దాదాపు పదేండ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి అసెంబ్లీ ఎన్నికలను తిలకించడానికి ఏకంగా 15 దేశాల దౌత్యవేత్తలు బుధవారం జమ్మూకాశ్మీర్‌కు తరలివచ్చారు.

జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు..
పార్లమెంటులో పోరాడుతాం : రాహుల్



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు పార్లమెంటులో పోరాడుతామని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. దాని కోసం వీధుల్లోకి కూడా వెళ్తామని అన్నారు. బుధవారం జమ్మూలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రజల శ్రేయస్సును అంతం చేయడానికి, లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ), బయటి వ్యక్తుల ద్వారా ఈ ప్రాంతాన్ని నడపాలని బీజేపీ భావించిందని విమర్శించారు. అందుకే జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను లాక్కున్నదని ఆరోపించారు. 'లెఫ్టినెంట్ గవర్నర్ ఇక్కడ ఉండే వరకు, జమ్మూకాశ్మీర్ ప్రజల కష్టాల వల్ల బయటి వ్యక్తులు ప్రయోజనాలు పొందుతూనే ఉంటారు' అని విమర్శించారు. కాగా, జమ్మూకాశ్మీర్ ఎన్నికలు ప్రజల హక్కులకు సంబంధించినవని రాహుల్ గాంధీ తెలిపారు. 'రాష్ట్ర హోదాను మేం పునరుద్ధరిస్తాం. స్థానిక పరిశ్రమలను మా ప్రభుత్వం కాపాడుతుంది. సామాన్యుల కోసం బ్యాంకుల తలుపులు తెరుస్తాం' అని అన్నారు. మరోవైపు దేశ చరిత్రలో 1947 నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలను రాష్ట్రాలుగా, రాష్ట్రాలను రెండుగా విభజించిన సందర్భాలు ఉన్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే ఏనాడూ ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా తగ్గించలేదన్నారు. ఇది ప్రజలకు తీవ్ర అన్యాయమని అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరించిందని విమర్శించారు. ఎన్నికల ముందు రాష్ట్ర హోదాను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని తామంతా భావించామని, అదే సరైన మార్గమని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే వారు (బీజేపీ) మొదట ఎన్నికలకు వెళ్లారని విమర్శించారు. 'ఏదైనా కారణం చేత బీజేపీ దీనిని చేయకపోతే, ఇండియా కూటమి మొదటి పని ఇదే. ఎందుకంటే రాష్ట్ర హోదా ఇవ్వడం మీ హక్కు' అని అన్నారు.

అడ్డగోలు పెట్రో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

అనేక రాష్ట్రాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.100పైనా, డీజిల్ ధర రూ.90పైనే పలుకుతోంది. గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధర నిలకడగా కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఇటీవల కేంద్ర చమురుశాఖ కార్యదర్శి పంకజ్ జైన్ అన్నారు. కానీ చమురు ధరలు దిగివచ్చినప్పటికీ కేంద్రం ఇప్పటికీ హెచ్చు ధరలను కొనసాగిస్తూనే ఉంది. భారత్ తన చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచంలోని అతిపెద్ద ఇంధన వినియోగదారుల్లో భారత్ ఒకటిగా ఉంది. రష్యా ముడి చమురు ఇప్పటికీ తక్కువ ధరకే లభిస్తుందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి గత వారం స్వయంగా ప్రకటించారు. దాంతో రష్యన్ కంపెనీల నుంచి మరింత చమురును కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్–రష్యాల మధ్య నెలకొన్న భౌగోళిక అనిశ్చితుల వల్ల యూరప్ దేశాలు రష్యా చమురు దిగుమతిపై ఆంక్షలు విధించాయి. దాంతో రష్యా చమురు ధరను భారీగా తగ్గించడంతో పాటు రూపాయిల్లోనూ వాణిజ్యం చేసుకునేందుకు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇది భారత్‌కు చాలా కలిసివచ్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు భారత్‌కు చమురు దిగుమతిలో రష్యా వాటా 1 శాతం కంటే తక్కువే ఉండేది. క్రమంగా అది పెరుగుతూ దాదాపు 40 శాతం వాటాకు చేరింది. పైగా రష్యా నుంచి చౌకగా చమురును దిగుమతి చేసుకుంటుంది. అయినప్పటికీ ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందించక పోగా ఎక్సైస్ టాక్స్‌ను పెంచే యోచనలో ఉందని సంకేతాలు వస్తున్నాయి. దేశంలోని అధిక చమురు ధరలు ప్రజల ఆదాయాలకు గండి కొడుతున్నాయి. మరోవైపు హెచ్చు ఇంధన ధరలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయి. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎక్సైస్ టాక్స్‌ను మరింత పెంచి తన ఖజానాను భారీగా పెంచుకునే పనిలో పడటం గమనార్హం.

దసరాకు ఇందిరమ్మ కమిటీలు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధి, విధానాలను ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు దక్కాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించు కుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని తెలిపారు. ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇండ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో డేటా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బందికి సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు వివరించారు. అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతి ప్రకారం నియామకాలు చేపట్టాలని అన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇండ్లు వేలం వేయాలని సూచించారు. ఏండ్ల తరబడి వథాగా ఉంచడం సరికాదనీ, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇండ్లను అప్పగించా లన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్దిదారులకు అప్పగించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ.గౌతమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.







'శౌర్యయాత్ర'కు జన హారతి

పోరాట చైతన్యం అలాగే ఉంది



ప్రజల్లో వీరతెలంగాణ పోరాట చైతన్యం అలాగే ఉంది. అందుకే వారు వక్రీకరణల్ని, అవస్తవాల్ని నమ్మడంలేదు. పల్లెపల్లెన మాకు ఈ విషయం అర్థమైంది. కొన్ని చోట్ల స్థబ్దత ఉన్న మాట వాస్తవమే అయినా... కమ్యూనిస్టులపై ప్రజలు ఇప్పటికీ విశ్వాసం కోల్పోలేదని, వారి ప్రేమ, మాటలతో ఈ యాత్ర ద్వారా మాకు మరోసారి అర్థమైంది. కళారంగం ద్వారా ప్రజల్ని కదిలించడంలో, మారుమూల పల్లెల్ని చేరుకోవడంలో సంఘాలు, పార్టీలు మరింత చొరవ చూపాలి. అది ప్రజా పోరాటాలకు మద్దతు ఇస్తుంది.

- వి. ఆనంద్-
పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజానాట్యమండలి కళారూపాలు - చరిత్రకు నీరాజనాలు

ఆత్మీయతతో అక్కున చేర్చుకుని ఆదరిస్తున్న ప్రజలు

తెలంగాణను దొరలేలిన నాడు... మట్టి మనుషులు వెట్టిగోడుతో విలవిలలాడిన నాడు.. పల్లెపల్లెన ప్రజా దండు దొరలకు ఎదురు తిరిగి ఎర్రజెండైంది. సంఘమై నిలిచిన మట్టి మనుషుల త్యాగం నెత్తురై పారింది. ఊరుఊరు రణరంగమైంది... ప్రతి తోవ తిరుగుబాటు తోరణమైంది. నాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను... మరోసారి మళ్లీ కళ్లముందుంచుతూ నేడు ప్రజానాట్య మండలి చేపట్టిన శౌర్యయాత్రకు ప్రజలు హారతి పడుతున్నారు. పల్లెపల్లె వీరుల త్యాగల వలపోతలో ఓలలాడుతోంది. కళాతరంగాలై ప్రజానాట్యమండలి ఆలపిస్తున్న రాగాలకు... నాడు చిందిన వీరుల నెత్తుటి రూపాలు ఊరుఊరున ఎర్రని స్థూపాలై మెరుస్తున్నయ్..!

యాత్రకు చక్కని స్పందన

టీవీ, సినిమాల ప్రభావం తీవ్రమైన కాలంలోనూ... మా యాత్రకు చాలా చక్కని స్పందన లభిస్తోంది. ఉదయం 7 గంటలకు కళారూపాలు ప్రారంభించినా... పనులన్నీ ఆపేసి చూసేందుకు భారీగా ప్రజలు వస్తున్నరు. ఈ యాత్ర నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎంతలా అంటే... నేనే స్వయంగా వీర తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నంత చైతన్యాన్ని అందించింది.

- వేల్పుల వెంకన్న
యాత్ర సమన్వయకర్త



ఈ దృశ్యమంతా ఎక్కడో కాదు... తెలంగాణ వ్యాప్తంగా రణక్షేత్రాలను సందర్శిస్తూ ప్రజానాట్యమండలి చేస్తున్న "శౌర్య యాత్ర" కవాతులో కనిపించే కళా ప్రదర్శనా శిల్పాలు. అవును.. అతిశయోక్తి కాదు.. శౌర్యయాత్ర కేవలం ఓ కళాయాత్ర కాదు. ప్రపంచ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిన వీరతెలంగాణ సాయుధ పోరాట త్యాగాల్ని తలకెత్తుకుని చేస్తున్న యుద్ధ కవాతు.

నాటి సాయుధ పోరాట గాథలు, బాధలు చెప్పాలంటే... రణభూమిలో నడిచిన అనుభవం కావాలి. లేదా ఆ వారసత్వాన్ని తలకెత్తుకున్న తెగువ కావాలి. జెండాలై దౌర్జన్యపు దండుపై తిరగబడ్డ గుండెలు కావాలి. ఏదీ కానోడు, కష్టంలో ఎన్నడూ తోడులేనోడే ఎక్కువ ఎగురుతున్న కాలమిది. విద్వేషం నూరిపోయడం తప్ప... ప్రజా పోరాట లక్షణమే లేని కొందరు పిరికిపందలు.. నెత్తుటి వాసనను అద్దుకుని నీతి బోధ చేయాలనుకునే రాబంధులు.. వాడు, వీడు, ఎవడెవడో... ఈ నేల చరిత్రకు మతం మరకలద్ది విమోచనంగా, వ్యక్తి విజయంగా.. వక్రీకరించే ప్రయత్నం చేస్తున్న సమయమిది. ఇలాంటి తరుణంలో... నాటి వీరుల శౌర్యాన్ని.. వెట్టిని, దోపిడీ దౌర్జన్యాల్ని ఎదిరించి... స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని కాంక్షించి ప్రజాయుద్ధం నడిపిన సంఘం స్ఫూర్తిని, కమ్యూనిస్టు యోధుల కీర్తిని చాటుతూ శౌర్యయాత్రకు పురుడు పోసి... పల్లెపల్లెను ప్రేమగా అల్లుకుంటున్నది ప్రజానాట్యమండలి.

రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చి రంగారెడ్డి జిల్లాలో 10 రోజులు సుశిక్షితులైన 35మంది ప్రజానాట్యమండలి కళాకారుల బృందంలో అనుభవజ్ఞులు కొందరే... మిగిలినదంతా కొత్త నీరే.. అయినా నాటి వీరుల స్ఫూర్తిని ఒడిలో నింపుకుని ప్రదర్శనలో వారు చూపుతున్న కళా నైపుణ్యానికి జనం జేజేలు పలుకుతుంటే, వారి క్రమశిక్షణకు అన్ని రంగాల, సంఘాల, పార్టీల నేతలు ముచ్చట పడుతున్నారు. ఎందుకంటే.. వారు చెబుతున్నది ఓ మహత్తర సమరం గురించి. వారు చెబుతున్నది తెలంగాణ మట్టిసాళ్లలో నిత్యం సత్యమై చిగురించే త్యాగాల మొక్కల గురించి. అందుకే అనేకమంది ప్రముఖులు, పాత్రికేయులు ఇలాంటి యాత్ర ఎలాంటి లాభాపేక్ష లేని ప్రజానాట్యమండలికి మాత్రమే సాధ్యమని మద్దతు ప్రకటిస్తున్నా.. నాటి సిసలైన జన పోరాటమైనా.. నేటి అసలైన ప్రజా ఉద్యమాలైనా కమ్యూనిస్టులకే సాధ్యమని బహిరంగంగా కీర్తిస్తున్నా అమరులకు అరుణాంజలి ఘటించారు. శౌర్య యాత్ర ఎక్కడికి వెళ్లినా వందలాదిగా తరలివస్తున్న జనం... ప్రదర్శన పూర్తయినా కూడా అక్కడి నుంచి కదలకపోవడం, పాటలకు కోరస్ ఇవ్వడం, ఆటకు అడుగులు కలపడం వంటి ఘటనలు ఈ యాత్రలో కోకొల్లలు.

రంగుల హంగులు లేవు... నగిశీల కిరీటాలు లేవు.. ఆహార్య ఆర్భాటాలు లేవు..... కొంత ఆధునికత..., మరికొంత వైవిధ్యం..., అంతకు మించిన చైతన్యం... ఇవే వారి ఆయుధాలు. అందుకే వారి శౌర్యయాత్ర.. గాలివానలు, కరెంటు కోతలు, ప్రకృతి ఆటంకాల్ని సైతం అధిగమిస్తూ నిరాటంకంగా ముందుకు సాగుతోంది. వర్షాల కారణంగా సెప్టెంబర్ 1కి బదులు 6న నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో మొదలైన ఈ యాత్ర... వరుసగా తేరటి పల్లి, సూర్యాపేట, కడవెండి, కామారెడ్డి గూడెం, జనగాం, పాలకుర్తి, ఇప్పగూడెం, జాఫర్ ఘడ్, పెరుమాడ్ల సంకీస, కరివిరాల కొత్తగూడెం, ఎలుగుపల్లి అన్నారం, రామన్నగూడెం, మల్రిగూడెం, నల్లగొండ, అప్పాజీపేట, మునిపంపుల, వరంగల్, మానుకోట, రాఘవపురం, హైదరా బాద్, డిండిచింతపల్లి, అలంపూర్, వనపర్తి, బండలేమూర్... తర్వాత జోగిపేట, సంగారెడ్డిలో ప్రదర్శనలు ముగించుకుని... ఇప్పుడు ఖమ్మం దిశగా సాగుతోంది.



ఈ ప్రయాణం అంత సులువైన దేమీ కాదు. ఉదయం 5 గంటలకు నిద్రలేస్తున్న కళాకారులు స్నానాల తర్వాత సిద్ధమై... జిల్లాల సరిహద్దులు దాటుతూ రోజూ సుమారు 120 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి తదుపరి ప్రదర్శన చోటుకి చేరుకుంటున్నారు. అక్కడ భోజనం తర్వాత కాసేపు విశ్రాంతి. మళ్లీ మధ్యాహ్నం 3 గంటలకు లేచి ఫ్రెషప్ అయిన తర్వాత.. ప్రదర్శన ప్రాంగణాన్ని పరిశీలించడం, లైట్లు, మైకులు ఏర్పాట్లు చేసుకోవడం, 5 వరకు డ్రెస్‌కోడ్‌లోకి మారి... డప్పు శబ్దాలతో, కాగడాల వెలుగులతో.. గ్రామంలో ప్రదర్శన చేపట్టి ఊరేగింపు పూర్తి చేసుకుని సా.6 వరకు కళాప్రాంగణానికి చేరుకుంటున్నారు. డప్పు, చిడుతలు, కోలాట సమ్మిళిత ప్రారంభ కళావిన్యాసాలు, సంప్రదాయ జానపద కథా రాగాలతో ప్రజలతో మమేకమై.. "శౌర్యయాత్ర" ప్రారంభ నత్యంతో యాత్ర ఉద్దేశాన్ని చాటుతున్నారు. యోధులకు ఘనంగా అంజలి ఘటి ప్రజలందరిచే ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. తర్వాత.. నేటి నాయకులకు, నాటి ప్రజానాయకులకు మధ్య అంతరాన్ని తెలిపే "బూతులపురాణం"తో ఆలోచింపజేస్తూ.. ప్రశ్నకు ఎన్నటికీ మరణంలేదని "జీ హుజూర్" ద్వారా చాటుతూ.. మనుషులంతా ఒక్కటేనని "హిందూముస్లీం" ఖవ్వాలితో తెలిపి.. "చారాన-బారాన" నాటికతో దోపిడీ తీరును ఎండగడుతున్నారు. ఇక సభానంతరం.. తెలంగాణ సాయుధ రైతాంగ సమరానికి అద్దం పట్టే "వీరతెలంగాణ" వీధినాటికతో జనాన్ని ఆవహించి తమ కళారూపాలతో ఆలోచింపజేస్తున్నారు. ఇక...ప్రజల జీవన స్థితిగతులు, వర్తమాన రాజకీయాలపై పదునైన పాటలు, నృత్యాలు సరేసరి. ఈ ప్రదర్శన పూర్తయ్యే సరికి రాత్రి 11.30 దాటితే.. సామాన్లు సర్దుకుని భోజనం చేసేసరికి రాత్రి 1 అవుతోంది. తర్వాత రెండు కునుకులు తీసేలోపే కోడికూతతో మళ్లీ కళా పయనం ప్రారంభం. సుదీర్ఘ ప్రయాణాలు, ఒల్లు నొప్పులు, అనారోగ్యాలు, ఇతర సమస్యలు.. దానికి తోడు బీజీ షెడ్యూల్. అయినా.. కళాకారుల్లో అలసట ఆవగింజంతైనా కనిపించడం లేదు. తొలిపొద్దు కిరణాల్లా వారిలో కొత్త ఉత్సాహం తొణికిసలాడుతోంది. తమ కష్టాన్ని మరచి రోజురోజుకు ప్రదర్శనలతో రాటుదేలుతున్నారు. అవాస్తవిక నేపథ్యంలో అసత్య ప్రచారాల పరదాల్ని చీల్చుతూ.. నిప్పులాంటి నిజాల్ని పల్లెల చెంతకు, ప్రజల చెంతకు చేరుస్తున్నారు. అందుకే ...ఈ శౌర్యయాత్ర సందేశాన్ని గుండెల కద్దుకుంటూ... పల్లెపల్లె ప్రజానాట్యమండలి ప్రజా కళాకారులకు పబ్బతి పడుతోంది.

అశేషమైన మద్దతు




ప్రజా సాంస్కృతిక రంగంలో పీఎన్ఎంది సుదీర్ఘ ప్రయాణం అయినా... గత దశాబ్ద కాలంలో మేం నిర్వహించిన కార్యక్రమాలకు భిన్నమైన అనుభవమిది. అనుమానాస్పదంగా అనేక ఆటంకాలు పరిమితుల మధ్య మొదలైన మా యాత్రకు అశేషమైన మద్దతు లభిస్తోంది. యాత్ర సందర్భం, ఎంచుకున్న పోరాట చరిత్ర, కళారూపాల్లో నిజాయితీ, నవ్యతే అందుకు కారణమనేది నా భావన. వనపర్తి-అలంపూర్ మార్గంలో మా బస్సు పాడై ఆగిపోతే... వెంటనే సామాన్లతో ఆర్టీసీ బస్సులో నిద్రలేకుండా హైదరాబాద్ చేరుకుని.. రంగారెడ్డి జిల్లాలో బండలేమూర్ ప్రదర్శనను సమయానికి విజయవంతం చేయగలిగాం. ఇలా.. కళాకారుల అంకితభావం కూడా ప్రధానమైనదే. ఈ యాత్ర మాకు సరికొత్త స్ఫూర్తిని ఇచ్చింది. మా అంచనాకు భిన్నంగా.. అనేక కొత్త గ్రామాలు శౌర్య యాత్ర రావాలని కోరుతున్నాయి.

- కట్ట నర్సింహ, పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి

నవచిత్రం

వినోద భరితం..

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తన 37వ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'సామజవరగమన'తో బ్లాక్‌బస్టర్ అందించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఏ.కే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం 10 రోజుల పాటు జరిగిన కేరళ షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసింది.



రామ్‌చరణ్

రా మచ్చా మచ్చా..

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ మరో క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈనెల 28న సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'రా మచ్చా మచ్చా' ప్రోమోని విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. పల్లవిలోని లైన్స్ చూస్తుంటే.. తమన్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ మూవీ నుంచి పక్కా మాస్ బీట్ సాంగ్ ఆడియెన్స్‌ను అలరించబోతుందని అర్థమవుతుంది. ఈ పాటను గీత రచయిత అనంత్ శ్రీరామ్ రాశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన 'జరగండి జరగండి..' పాట ఎంత సెన్సేషన్ అయ్యిందో అందరికీ తెలిసిందే. 'వినయ విధేయ రామ' చిత్రంలో జోడీగా మెప్పించిన రామ్ చరణ్, కియారా అద్వానీ.. ఈ సినిమా తోనూ అలరించటానికి రెడీ అయ్యారు. ఇయర్ ఎండింగ్‌లో క్రిస్మస్ సెలబ్రేషన్స్ నుంచి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అన్నీ మావే అనే కాన్ఫిడెన్స్ మేకర్స్‌లో కనిపిస్తోంది. ప్రముఖ ఆడియో కంపెనీ సారేగమ ఈ సినిమా ఆడియో రైట్స్‌ను ఫ్యాన్సీ ప్రైజ్‌కి దక్కించుకుంది అని చిత్ర బృందం తెలిపింది.













Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886